తర తరాల పిల్లల కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


### 6న తెలంగాణ మంత్రివర్గ సమావేశం

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 6వ తేదీన జరగనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశం పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహణ, బిసిలకు రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కూడా మంత్రి వర్గం నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.


సంపుటి 08, సంచిక: 91 | శనివారం | 01-03-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# విరిగిపడిన మంచుచరియలు

- హిమపాతంలో చిక్కుకుపోయిన 57 మంది బిఆర్ఒ కార్మికులు
- 25 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన రెస్క్యూ సిబ్బంది
- మరో 22 మందికోసం గాలింపు చర్యలు ముమ్మరం



**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లో పెను ప్రమాదం వాటిల్లింది. గతకొన్ని రోజులుగా భారీగా మంచు కురుస్తున్నది. శుక్రవారం ఉదయం చమోలి జిల్లాలోని సరిహద్దు గ్రామమైన మనా గ్రామంలో మంచుచరియలు విరిగిపడ్డాయి. అయితే రహదారిపై మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 22 మంది బిఆర్ఒ కార్మికులు హిమపాతం కింద చిక్కుకుపోయారు. ఈ మంచు తుపాను కారణంగా తొలుత 57 మంది మంచుగడ్డల కింద సమాధి అయినట్లు భావించినప్పటికీ అందులో మధ్యాహ్నానికి 16 మందిని, రాత్రి 9 గంటల సమయానికల్లా మరో 9 మంది కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. మనా, బద్రీనాథ్ మధ్య ఉన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్ఒ) శిబిరాన్ని హిమపాతం తరువాయి 2లో

# దక్షిణాదికి బిజెపి అన్యాయం



- నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులో కుట్ర
- బిజెపి ఓట్లు, సీట్లు రాలేదని దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదు
- కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి చెల్లిస్తే ఇస్తున్నది 40 పైసలే
- బిహార్‌కు మాత్రం ఏడు రూపాయల అరవైపైసలు ఇస్తున్నారు

> చట్టసభల స్థానాలు తగ్గబోవని కేంద్రమంత్రి అమిత్ షా చెబుతున్నారు. దీని అర్థం దక్షిణాది రాష్ట్రాలలో సీట్ల సంఖ్యను పెంచబోరని సంకేతాలు ఇవ్వడమే కదా..? దక్షిణాది రాష్ట్రాల సీట్లు, ఓట్లతో సంబంధం లేకుండా 'బిమారు' రాష్ట్రాలకు సీట్లను పెంచుకుని, కేంద్రంలో అధికారంలో రావడానికి బిజెపి కుట్ర చేస్తోంది. ఇది తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తుంది. జనాభా నియంత్రణను పాటించాలన్న కేంద్ర ఆదేశాలను దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయి. జనాభా తగ్గిందని, ఇప్పుడు జనాభా ప్రతిపాదికన పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

## తెలంగాణకు సైంధవుడిగా కిషన్‌రెడ్డి

కేంద్ర సర్కార్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని కుట్రకు పాల్పడుతోందని, ఇదే జరిగితే తీవ్రమైన సంక్షోభానికి దారితీస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపికి ఓట్లు,సీట్లు రావడం లేదనే ఉద్దేశంతోనే దక్షిణాది రాష్ట్రాలను ఆర్థిక, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల అనుమతులు విషయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని, ఆయన తెలంగాణకు ఒక సైందవునిగా మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల అనుమతుల విషయంలో తాము కిషన్ రెడ్డి అనుమతి తీసుకోవడం ఏమిటని, ఆయనేమైనా దేశానికి యజమానినా..? (ఓనరా) అని అన్నారు. తాము ప్రస్తావించే అంశాలపై 'మీరు ఇన్ని సార్లు వస్తున్నారు...వీటిపైన మా కేంద్ర మంత్రి ఒక్కసారి కూడా మాట్లాడలేదు'అని కేంద్ర మంత్రులే చెబుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టిపిసిసి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశనంతరం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి సిఎంరేవంత్ రెడ్డి తరువాయి 2లో

# ఐదు చోట్ల మెత్తని భాగాలు



- టిబిఎం ముందు భాగం, దెబ్బతిన్నభాగంలో గుర్తింపు
- గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా ఎస్ఎల్‌బిసి సొరంగం స్కానింగ్
- టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం చేపట్టిన సహాయక చర్యల్లో పురోగతి

**నాగర్‌కర్నూల్ :** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బిసి)లో చిక్కుకున్న వారి కోసం ముమ్మరంగా చేపట్టిన సహాయక చర్యల్లో కీలక పురోగతి కనిపించింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించేందుకు పలువిధాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా సొరంగం స్కానింగ్ చేస్తుండగా.. ఐదుచోట్ల మెత్తని భాగాలు ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించారు. టిబిఎం ముందు భాగం, దెబ్బతిన్నభాగంలో తరువాయి 2లో

## దేశ రక్షణ బాధ్యత యువతపైనే

గచ్చిబౌలి స్టేడియంలో 'విజ్ఞాన్ వైభవ్ 2025' ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ

## మార్చి 10వ తేదీలోగా చేపట్టాలి

03 పార్టీ జెండా మోసినవారికి ఖచ్చితంగా గుర్తింపు

## తెలంగాణకు నిధులు మంజూరు బాధ్యత కిషన్‌రెడ్డిదే

- కేంద్ర మంత్రిగా ఉన్నా ప్రజలకు ఏమి చేశారో చెప్పాలి
- రాష్ట్ర ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం / హైదరాబాద్



తెలంగాణ రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించడం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి రూ.1,63,559.31 కోట్ల ప్రాజెక్టుల అనుమతులు, మంజూరుపై చర్చించి పూర్తి వివరాలతో కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలిసి వినతిపత్రాలు సమర్పించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున భరించాల్సిన వ్యయం భరించేందుకు ముందుకొచ్చామని, స్వయంగా తాను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి చర్చించి అన్నింటిపై లేఖలు అందజేశానని తెలిపారు. అయినప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి అవగాహనారాహిత్యంతో మాట్లాడుతున్నారని, విధానాన్ని అనుసరించడం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తరువాయి 12లో

# జనగణనతో పాటే కులగణన

- జనాభా ప్రాతిపదికన చట్టసభలతో పాటు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు
- సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బిసి వర్గాలకు న్యాయం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ బిసి సంఘాల నాయకులు, మేధావులు డిమాండ్
- బిసిలకు ప్రభుత్వాలు చేయూతనందించాలి : కూనంనేని



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసినని చెప్పుకునే ప్రధాని నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని పలువురు రాజకీయ, బిసి సంఘాల నాయకులు, బిసి మేధావులు డిమాండ్ చేశారు. తద్వారా జనాభా ప్రతిపాదికన చట్టసభలతో పాటు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలు చేసి,దశాబ్ధకాలంగా సామాజిక, ఆర్థికంగా వెనకబాటుకు గురవుతున్న బిసి వర్గాలకు న్యాయం చేయాలన్నారు.' బిసి హక్కుల సాధన సమితి' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మఖ్దూంభవన్‌లో 'దేశ జనగణనలో కులగణన, బిసిలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు, జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు'' అనే అంశంపై శుక్రవారం' రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి తరువాయి 12లో

### బిసి ఉద్యమాలకు సిపిఐ మద్దతు : అజీజ్ పాషా

బిసి సమస్యల సాధన కోసం సిపిఐ పలు సందర్భాల్లో పార్లమెంట్‌లో, ప్రత్యక్ష ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చిందని సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. బిసిలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరగాలంటే ఐక్యంగా ఉద్యమించాలని , ఈ ఉద్యమాలకు జాతీయ స్థాయిలో కూడా సిపిఐ సంపూర్ణ మద్దతును ఇస్తుందని తెలిపారు.



# ఓరుగల్లుకు విమానం

- మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్

వరంగల్ నగరంలో విమానాశ్రయం నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మామూనూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ప్రారంభం కాబోతోంది. వరంగల్ సమీపంలోని మామనూరులో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. అయితే శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్ల పరిధిలో నూతన విమానాశ్రయం ఉండకూడదని కేంద్ర ప్రభుత్వంతో గతంలో జిఎంఆర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ప్రకారం వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులిచ్చేందుకు కేంద్రం జాప్యం చేస్తూ వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 2లో



# స్వయం ఉపాధి పథకాలకు అత్యంత ప్రాధాన్యం

నిరుద్యోగ యువత ఉపాధికి బ్యాంకర్లు ముందుకు రావాలి

- బ్యాంకర్లతో కలిసి 2వ తేదీన రూ.6వేల కోట్ల ఉపాధి పథకాలను ప్రారంభించనున్న సిఎం
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గత పదేళ్ల పాలనలో సంక్షేమ కార్పొరేషన్లను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. సబ్సిడీలు, మార్జిన్ మనీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకర్స్ తో కలిసి సుమారు రూ.6వేల కోట్ల విలువైన ఉపాధి పథకాలను మార్చి 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తిలో ప్రారంభిస్తారని, స్వయం ఉపాధి పథకాల పంపిణీ, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జోడెద్దులుగా భావిస్తుందని, అందుకనుగుణంగా బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం హైదరాబాద్‌లోని బేగంపేటలో తరువాయి 2లో

# స్టాక్ మార్కెట్ ఢమాల్

- సెన్సెక్స్ 1,400 పాయింట్లు, నిఫ్టీ 400 పాయింట్లు పతనం
- ఎఐ అనుమానాలు.. ట్రంప్ నిర్ణయాలే ప్రధాన కారణం



**ముంబయి:** కృత్రిమ మేధ (ఐఎ) వ్యక్తం చేసిన అనుమానాలు, ఇటీవల కాలంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. భారత్‌లోనూ అదే పరిస్థితి కనిపించింది. బాంబే స్టాక్ ఎక్చ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ 1,400 పాయింట్లు, జాతీయ స్టాక్ ఎక్చ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 400 పాయింట్లు పతనమయ్యాయి. ఇన్ఫోసిస్, ఎం అండ్ ఎం, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, హెచ్‌సిఎల్‌టెక్ తరువాయి 2లో

బస్సులో అత్యాచార ఘటన

## నిందితుడి అరెస్టు



05

# భవనంలో భారీ అగ్నిప్రమాదం

- చిన్నారి సహా ముగ్గురు మృతి
- రంగారెడ్డి జిల్లా పుప్పాలగూడలో ఘటన

**ప్రజాపక్షం / గండిపేట :** రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం పుప్పాలగూడలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉస్మాన్‌కు చెందిన రెండు అంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ వ్యాపించడంతో ఊపిరాడక ముగ్గురు మృతిచెందారు. తొలుత భవనంలో మంటలు చెలరేగిన విషయం తెలుసుకున్న లంగర్ హౌస్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మొదటి అంతస్తులోని ఓ గదిలో చిక్కుకున్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారిని స్ట్రెచర్‌పై బయటకు తీసుకొచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్నవారిని ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతులను సిజిరా(7), సహానా(40), జమీలా(70)గా గుర్తించారు. అయితే, ఈ ప్రమాదం ఎలా జరిగింది? మంటలు ఎందుకు వ్యాపించాయనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ప్రమాదం నుంచి మరో ఐదుగురిని కాపాడారు. భవనంలో తరువాయి 2లో



భారత్–ఇయు మధ్య ఏడాది చివరి నాటికి

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- ప్రధాని మోదీ, ఇయు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా భేటీలో నిర్ణయం
- అమెరికా సుంకాల పెంపుతో త్వరగా అవాంతరాలను తొలగించుకోవాలని నిశ్చయం




**న్యూఢిల్లీ :** భారత్ – యూరోపియన్ యూనియన్ (ఇయు)ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లీయెన్‌లు అంగీకరించారు. భారత పర్యటనలో ఉన్న ఉర్సులా శుక్రవారం నాడు ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు వైపుల రక్షణ సహకారం మరింత విస్తరించాలని, ప్రత్యేకించి ఇండో – పసిఫిక్‌లో ఇది జరగాలని నిర్ణయించారు. తమ సన్నిహిత మిత్రదేశాలైన జపాన్, దక్షిణ కొరియాలతో ఉన్నట్లుగా భారతదేశంతో కూడా రక్షణ ఒప్పందాలను కుదుర్చుకోనున్నట్లు తరువాయి 12లో

# హమాస్ శక్తిని తక్కువ అంచనా వేశాం



ఇజ్రాయెల్ విచారణ బృందం ప్రకటన

**టెల్ అవీవ్:** హమాస్ శక్తిని తక్కువ అంచనా వేశామని, అందుకే 2023 అక్టోబర్ 7 నాటి దాడి ఘటనను ఊహించలేకపోయామని ఇజ్రాయెల్ ఆర్మీని ఉటంకిస్తూ విచారణ బృందం స్పష్టం చేసింది. నాటి హమాస్ దాడిలో కనీసం 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు మృతి చెందారు. సుమారు 250 మందిని హమాస్ బందీలుగా చేసుకుంది. వారిని విడిపించడానికి జరుగుతున్న చర్చల్లో భాగంగా మొదటి విడతలో కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుండగా, రెండో దశ చర్చలు ప్రారంభమయ్యాయి. ఇలావుంటే, నాటి ఘటనపై విచారణ నిర్వహించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) బృందం విడుదల చేసిన నివేదికను అనుసరించి, హమాస్ పూర్తి స్థాయిలో యుద్ధానికి సిద్ధంగా లేదని ఇజ్రాయెల్ సైన్యం భావించింది. అందుకే, ఈ దాడిని ముందుగా ఊహించలేకపోయింది. అంతేగాక, దాడి జరిపితే పరిస్థితి ఏమిటనే విషయాన్ని కూడా ఆలోచించలేదు. ఫలితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ దాడి జరిగిన తర్వాత ఇజ్రాయెల్ గాజాను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగించిన విషయం తెలిసిందే. ప్రపంచ దేశాల ఒత్తిడి కారణంగా హమాస్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతానికి గాజాలో యుద్ధం ఆగిపోయినప్పటికీ, పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళనలతో రోజులు గడుపుతున్నారు. ఇప్పటికే వేలాది మంది పాలస్తీనియులు గాజా స్ట్రిప్ నుంచి దూర ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఇలావుంటే, హమాస్ దాడికి తమ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు అనుసరించిన విధానాలు, తీసుకున్న పొరపాటు నిర్ణయాలే ప్రధాన కారణమని ఇజ్రాయెల్ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకించి సరిహద్దు ప్రాంతాల పట్ల సరైన అవగాహన లేదని విమర్శిస్తున్నారు. హమాస్‌కు ఎవరెవరి నుంచి మద్దతు లభిస్తున్నదో కూడా తెలియకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించినందువల్లే దాడి జరిగిందని అంటున్నారు. ఇలావుంటే, గాజా కాల్పుల విరమణ ఒప్పందం కోసం ఇజ్రాయెల్, హమాస్ మధ్య రెండో దశ చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ఈజిప్ట్ ప్రకటించింది. ఇజ్రాయెల్, ఖతార్, అమెరికా అధికారులు కైరోలో కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశపై చర్చలు ప్రారంభించారని పేర్కొంది. కాగా, ఆరు వారాల తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం గడువు మార్చి 1వ తేదీ, శనివారంతో ముగియనుంది. అందుకే, ఈ చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.




# ఫెడరల్ ఉద్యోగుల తొలగింపుపై శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టు స్టే



**శాన్‌ఫ్రాన్సిస్కో:** ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టు స్టే మంజూరు చేసింది. వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని డిస్ట్రిక్ట్ జడ్జి విలియమ్ అల్సప్ నిలిపివేశారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అధికారం పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి ఉండదని ఆయన తన ఉత్తర్వుల్లో వ్యాఖ్యానించారు. ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఉద్యోగుల తొలగింపుపై కార్మికులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తి అల్సప్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. అమెరికాలోని కొన్ని ఏజెన్సీల్లో చట్టవ్యతిరేకంగా ప్రొబేషనరీ సిబ్బందిని తీసేస్తున్నారని కార్మికులు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి చర్యలను సమర్థించలేమని వ్యాఖ్యానించారు. పర్సనల్ మేనేజ్‌మెంట్ ఆఫీసుకి తన సొంత ఉద్యోగులను తీసేసే హక్కు ఉంది కానీ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు తీసేసే హక్కు లేదని తేల్చి చెప్పారు. ఫెడరల్ ఏజెన్సీలే వారి శాఖల్లో ఉద్యోగాలు ఇవ్వడం లేదా తీసేయడం అనే అధికారం కలిగి ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగుల తీసివేతలపై ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం చట్టవ్యతిరేకమని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఫెడరల్ ఏజెన్సీల్లో సుమారు 2 లక్షల మంది సిబ్బంది ఉండగా, వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక ట్రంప్ ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు డోజ్ శాఖను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనికి చీఫ్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ ఉన్నారు. గవర్నమెంట్ వ్యవస్థలో వృథా వ్యయాన్ని కట్టడి చేసేందుకు కూడా ఇది పనిచేస్తుంది. ఈ శాఖ చేసిన సిఫార్సుల మేరకు ఫెడరల్ ఉద్యోగులపై వేటు ప్రారంభమైంది. అయితే, అమెరికాలోని పలు రాష్ట్రాల్లో కోర్టులు ఈ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. ఇప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కో కోర్టు సైతం ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, స్టే మంజూరు చేసింది.

# నేపాల్‌లో భూకంపం

## రెక్టార్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో ప్రకంపనలు.. పాకిస్తాన్‌లోనూ ప్రభావం

**ఖట్మండు:** నేపాల్ రాజధాని ఖట్మండు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.1గా నమోదైంది. సింధుపాల్ చౌక్ జిల్లాలోని భైరవ్ కుండ్‌లో భూకంప కేంద్రం ఉన్నట్లు నేపాల్ జాతీయ భూకంప నిర్వహణ, పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ భూకంపం ధాటికి భారత్‌లోని బిహార్‌లో కూడా శుక్రవారం రాత్రి 2.36 గంటలకు 5.5 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని సమాచారం. దీని ప్రభావంతూ పాకిస్తాన్‌లోనూ భూకంపం సంభవించింది. అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం, పాకిస్తాన్‌లో శుక్రవారం ఉదయం 5.14 గంటలకు, రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో భూమి కంపించింది. అయితే, ఆస్తి లేదా ప్రాణ నష్టంపై నేపాల్, పాకిస్తాన్ నుంచి ఎలాంటి సమాచారం లేదు.


**FORM - IV**

Statement about ownership and other particulars about newspaper **PRAJA PAKSHAM**, RNI Regd.No.**TELTEL/2018/76746**

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : **Karimnagar** |
| 2. | Periodicity of its Publication | : Daily |
| 3. | **Printer's Name** | : **Palla Venkat Reddy** |
| | Nationality | : Indian |
| | Address | : 12-1-493/VA, Giriprasad Bhavan Bandlaguda(Nagole), GSI Post Hyderabad-500068. Telangana State. |
| 4. | **Publisher's Name** | : **Palla Venkat Reddy** |
| | Nationality | : Indian |
| | Address | : 12-1-493/VA, Giriprasad Bhavan Bandlaguda(Nagole), GSI Post Hyderabad-500068. Telangana State. |
| 5. | **Editor's Name** | : **Makkena Subbarao** |
| | Nationality | : Indian |
| | Address | : Flat No.201, 2nd Floor, Venkatasai Castle, Raghavendra Colony, Bandlaguda, Nagole, Hyderabad - 500 068. Telangana State. |
| 6. | Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital | : **NAVACHETHANA VIGNANA SAMITHI** |

***Members of the Governing Body***

**President** : **Palla Venkat Reddy**
Hasthinapuram - Hyderabad

**Secretary** : **B.S.R. Mohan Reddy**
Dilsukhnagar - Hyderabad

**Treasurer** : **V. Ratnakar Rao**
Nagole - Hyderabad

***Members :***

| | |
|---|---|
| **K. Sreenivas Reddy** | - Manikonda - Hyderabad |
| **T. Srinivas** | - Hanumakonda - Warangal |
| **B. Prabhakar** | - Gaddiannaram - Hyderabad |
| **N. Madhusudhan Reddy** | - LB Nagar - Hyderabad |
| **K. Shankar** | - Srirampur Colony - Mancherial |
| **B. Hemantha Rao** | - Nelakondapalli - Khammam |
| **V.S. Bose** | - AS Rao Nagar - Hyderabad |
| **N. Jyothi** | - Hanumakonda - Warangal |

I, **Palla Venkat Reddy,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**Palla Venkat Reddy**
Signature of Publisher

Karimnagar
Date: 28.02.2025


# భవనంలో భారీ అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

మూడు గ్యాస్ సిలిండర్ల పేలుడుతో ప్రమాద తీవ్రత పెరిగింది. 'శుక్రవారం సాయంత్రం దాదాపు 5.30గంటల సమయంలో మాకు ఫోన్ వచ్చింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాం. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలు అదుపు చేస్తూ, పైన ఐదుగురు చిక్కుకున్నట్లు చెప్పడంతో లాడర్ వేసి డోర్‌లు పగలగొట్టి లోపలికి ప్రవేశించాం. అక్కడ ఒక పాప, ఇద్దరు మహిళలు అపస్మారకస్థితిలో ఉండటంతో వారిని స్ట్రెచర్‌పై తీసుకొచ్చి.. అంబులెన్సులో ఆస్పత్రికి తరలించాం' అని అగ్నిమాపకశాఖ అధికారి ఒకరు తెలిపారు.

# ఢమాల్

(మొదటి పేజీ తరువాయి)

తదితర కంపెనీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 1.97 శాతం పతనమై, 73,198 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా నిఫ్టీ 1.95 శాతం నష్టపోయి 22,2125 వద్ద ముగిసింది. ట్రంప్ విధించిన సుంకాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల సెంటిమెంట్లు, బలహీనమైన ప్రపంచ సంకేతాల ప్రభావంతో, ఈ వారం స్టాక్ మార్కెట్ చివరి రోజైన శుక్రవారం లావాదేవీలు ప్రారంభమైనప్పటి నుంచి అమ్మకాల ఒత్తిడి ప్రారంభమైంది. సాధారణంగా ఇన్వెస్టర్లు అనిశ్చితిని ఇష్టపడరు. అయితే, ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుండి అనిశ్చితి పెరుగుతూనే ఉంది. ట్రంప్ చేస్తున్న సుంకాల ప్రకటనల పరంపర మార్కెట్లపై ప్రభావం చూపు తోంది. చైనాపై అదనంగా 10 శాతం సుంకాన్ని విధించాలనే తాజా ప్రకటన ట్రంప్ తన అధ్యక్ష పదవి ప్రారంభ నెలల్లో సుంకాలతో దేశాలను బెదిరించాలనే ధోరణిని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజా సుంకాల పెంపుదలకు చైనా ఎలా స్పందిస్తుందో చూడాలి. ఇప్పుడు కూడా, మార్కెట్లు అమెరికా, చైనా మధ్య పూర్తి స్థాయి వాణిజ్య యుద్ధాన్ని తగ్గించలేదు. దీనిని నివారించే అవకాశాల అన్వేషణ జరగాలి. ఇలావుంటే మార్చి 3వ తేదీ, సోమవారం స్టాక్ మార్కెట్ లావాదేవీలు తిరిగి ప్రారంభమైనప్పుడు బేర్ ఆధిపత్యం కొనసాగుతుందా లేక మార్కెట్లు కోలుకుంటాయా అన్నది ఉత్కంఠ రేపుతున్నది. మెక్సికో, కెనడాపై ప్రతిపాదిత సుంకాలు మార్చి 4వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, ప్రపంచ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. అదే నిజమైతే, దాని ప్రభావం భారత మార్కెట్లపైన కూడా ఉంటుంది. ఇప్పటికే తన ఉత్పత్తులపై 10 శాతం అమెరికా సుంకాన్ని ఎదుర్కొంటున్న చైనా, మార్చి 4 నుండి అదనంగా 10 శాతం సుంకాన్ని ఎదు ర్కోవలసి వస్తుందని ట్రంప్ ధృవీకరించారు. గతంలో షెడ్యూల్ చేసిన రెసిప్రొకల్ టారిఫ్ తేదీ ఏప్రిల్ 2 అమలులో ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వరుస ప్రకటనలు స్టాక్ మార్కెట్‌ను అనిశ్చితిలోకి నెడుతున్నాయి. దీని పర్యవసానంగా ప్రపంచవ్యాప్తంగా విస్తృత మార్కెట్ భారీ క్షీణతను అనుభవిస్తున్నది. అమ్మకాల ఒత్తిళ్లు మార్కెట్ పురోగతిని నిరోధిస్తున్నాయి.

# ఇపిఎఫ్ వడ్డీ రేటు యథాతథం!

**న్యూఢిల్లీ:** ఉద్యోగ భవిష్య నిధి (ఇపిఎఫ్) డిపాజిట్లపై వడ్డీరేటును 2024–25 ఆర్థిక సంవత్సరానికిగానూ ప్రస్తుతమున్న 8.25 శాతాన్నే కొనసాగించనున్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఇపిఎఫ్ఓ ట్రస్టీల కేంద్ర మండలి (సీబీటీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇపిఎఫ్ డిపాజిట్లపై వడ్డీరేటు 8.15 శాతంగా ఉండగా... దాన్ని 2024 ఫిబ్రవరిలో 8.25 శాతానికి పెంచారు. ఈసారి మాత్రం ఎలాంటి పెంపు లేదు. ఈ నిర్ణయం వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపనున్నారు. ప్రభుత్వ ఆమోదం లభించగానే, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీని దాదాపు ఏడు కోట్ల మందికిపైగా ఇపిఎఫ్ సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు. కరోనా సంక్షోభం నెలకొన్న 2020–21లో ఈపీఎఫ్ డిపాజిట్లపై గరిష్ఠంగా 8.5 శాతం వడ్డీరేటును చెల్లించారు.

# ఓరుగల్లుకు విమానం

(మొదటి పేజీ తరువాయి)

కోరిక మేరకు ఒప్పందంలోని క్లాజ్‌ను జిఎంఆర్ సంస్థ సవరించింది. వరంగల్ మామూనురు విమానాశ్రయానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో విమానాశ్రయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇటీవలె ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలన పూర్తిచేసి కేంద్రానికి నివేదిక సమర్పించింది. దీంతో అనుమతి లభించింది. భారీ విమానాలు దిగేందుకు వీలుగా అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఈ విమానాశ్రయం కోసం దాదాపు 1000 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇప్పటికే 650 ఎకరాలకు పైగా భూసేకరణను ప్రభుత్వం పూర్తి చేసింది. మరో 250 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉంటుంది. త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభం కాబోతున్నాయి. ఈ భూసేకరణ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేసింది. కాగా, విమానాశ్రయం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమి సేకరించి ఇస్తే చాలు, నిర్మాణ పనులను కేంద్రమే పర్యవేక్షించనుంది.

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిని మంజూరీ చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్టుకు కావాల్సిన అన్ని అనుమతులు రావడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్ట్ కోసం కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు అనుమతిని మంజూరీ చేస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌కు లేఖ ద్వారా తెలియచేసిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి చెప్పారు. మామునూర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విమానాశ్రయ ప్రాధికార సంస్థ అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి పలు దఫాలుగా చర్చలు జరిపి, చొరవ చూపడంతోనే అన్ని అనుమతులు మంజూరు అయ్యాయని మంత్రి వెంకట్ రెడ్డి చెప్పారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసి అడ్డంకులు తొలగించేందుకు జిఎంఆర్ యజమాన్యంతో సంప్రదింపులు జరిపి, బోర్డులో పెట్టి ఎన్‌ఓసి ఇచ్చేలా తాను కృషి చేశానని మంత్రి వివరించారు. దీంతో హెచ్‌ఎఐఎల్ తన బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ ఎన్‌ఓసి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఈ ఎన్‌ఓసిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిందన్నారు. కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌కు లేఖ ద్వారా తెలిపిందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఎయిర్ పోర్టు నిర్మాణం మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. విమానాశ్రయ ప్రాధికార సంస్థ, హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' జారీ చేసినట్లు లేఖలో పేర్కొందని, అందుకు సంబంధించిన లేఖను మంత్రి విడుదల చేశారు. మామునూర్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి కావాల్సిన 253 ఎకరాల అదనపు భూమిని తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధికార సంస్థకి అప్పగించేందుకు రూ.205 కోట్లను విడుదల చేసిందన్నారు.

# అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం కేంద్రానికి పన్నుల రూపంలో ఒక్క రూపాయి చెల్లిస్తే, ఇందులో కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి రాష్ట్రానికి కేంద్రం చెల్లిస్తుందని, కానీ బిహార్ ఒక్క రూపాయి చెల్లిస్తే, ఆ రాష్ట్రానికి ఏడు రూపాయల ఆరుపైసలు, ఉత్తరప్రదేశ్ ఒక్క రూపాయి చెల్లిస్తే ,తిరిగి మూడు రూపాయాలను చెల్లిస్తున్నదని సిఎం తెలిపారు. బిహార్, ఉత్తరప్రదేశ్‌కు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. తాము మోదీ, కిషన్‌రెడ్డి ఆస్తులను అడగడం లేదని, రాష్ట్రానికి రావాల్సిన హక్కులను, వాటాలను కేంద్రాన్ని అడిగితే కూడా కిషన్ రెడ్డికి ఎందుకు ఇబ్బందవుతుందని, ఆయనేదో గుజరాత్ నుంచి రైళ్లలో ,విమానాల్లో నోట్ల కట్టలు పంపిస్తున్నట్టుగా బాధపడుతున్నారని సిఎంఎద్దేవా చేశారు. హైదరాబాద్ మెట్రోకు, ముసీ ప్రక్షాళనకు నిధులకు కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ చీకటి ఒప్పందాన్ని, తెలంగాణకు ఆ పార్టీలు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు తెలియజస్తామన్నారు.

**ఆరేళ్ల కాలంలో ప్రత్యేకంగా ఏం తెచ్చావో చెప్పు..**

ఆరేళ్లుగా కేంద్ర మంత్రిగా పనిచేసిన కిషన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏం తీసుకొచ్చారో సమాధానం చెప్పాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రమంత్రిగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశాలను ఎప్పుడైనా కేంద్రమంత్రివర్గంలో, ప్రధాని వద్దకు తీసుకెళ్లారా అని నిలదీశారు. ఏదో బెదిరించినట్టు కిషన్ రెడ్డి మాట్లడితే ఇక్కడ భయపడేవారేవ్వరూ లేరన్నారు. వరదల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా ఆటోలకు ఆటోలు, ద్విచక్రవాహనాలకు ద్విచక్రవాహనాలు, గుండుకు, గండు ఇస్తామని బండి సంజయ్ హామీనిచ్చారని, వాటిని అమలు చేశారా? అని సిఎం నిలదీశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకొచ్చి, రైతులను బలి తీసుకున్నారని సిఎం గుర్తు చేశారు.

**ఎపి.బిజెపి ఏలుబడి రాష్ట్రాల్లో మైనార్టీ రిజర్వేషన్లు ఆపే దమ్ముందా?..**

తెలంగాణలో ముస్లింలను బిసిలలో కలిపి చూపిస్తున్నారని చెబుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ తో సహా బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ముస్లిం మైనార్టీలకు అమలవుతున్న బిసి రిజర్వేషన్లను ఆపే శక్తి ఉన్నదా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గుజరాత్‌లో 29 ముస్లిం ఉపకులాలు బిసి రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయని వివరించారు. మందకృష్ణమాదిగను కౌగిలించుకుని, వినియోగించకున్న బిజెపి,ఎపిలో వర్గీకరణను ఎందుకు అమలు చేయడం లేదన్నారు.

**'ఢిల్లీ లిక్కర్' దందా కోసం ఢిల్లీకి వెళ్లడం లేదు**

ఢిల్లీలో 'లిక్కర్ దందా'ను చేయడం కోసం తాము ఢిల్లీకి వెళ్లడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తాము ఢిల్లీకి వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్ట్‌లకు అనుమతుల మంజురు చేయాలని కోరుతున్నామని, ఇందులో భాగం గానే వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అనుమతి వచ్చిందని వివ రించారు. రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని కూడా సాధించా మన్నా రు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఏం సాధించారని, కేంద్రం నుంచి ఎందుకు అనుమతిని తీసుకు రాలేక పోయారని, ఎక్కడ నిద్రపోయారని నిలదీశారు.




# మంచుచరియలు

(మొదటి పేజీ తరువాయి)

కప్పేసిందని చమోలి జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ తెలిపారు. కార్మికులను రక్షించడానికి కఠినమైన ప్రదేశం, భారీ మంచు, వర్షంతో బహుళ కంపెనీల బృందాలు పోరాడుతున్నాయని, అయితే ఎటువంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదన్నారు. బద్రీనాథ్ నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనా, భారత్–టిబెట్ సరిహద్దులో 3,200 మీటర్ల ఎత్తులో ఉన్న చివరి గ్రామం. అందుబాటులో ఉన్న అన్ని వనరులను ఉపయోగించి చిక్కుకున్న సిబ్బందిని రక్షించడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'ఉత్తరాఖండ్ జోషిమఠ్‌లోని మనా ప్రాంతంలో శుక్రవారం దురదృష్టకర హిమపాతం సంభవించింది, ఇది బిఆర్ఒ జనరల్ రిజర్వ్ ఇంజనీరింగ్ ఫోర్స్ (జిఆర్ఇఎఫ్) శిబిరాన్ని ప్రభావితం చేసింది. పరిస్థితి గురించి ముఖ్యమంత్రి పుష్కర్‌ధామితో మాట్లాడాను. బాధితులకు అధికార యంత్రాంగం అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది' అని సందీప్ తివారి ఎక్స్‌లో పేర్కొన్నారు. స్థానిక ఆర్మీ యూనిట్లతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. 'ఉదయం మనా, మానా పాస్ మధ్య హిమపాతం సంభవించినప్పుడు 57 మంది కార్మికులు శిబిరంలో ఉన్నారు. టిబెట్ సరిహద్దు వైపు సైన్యం వెళ్లేందుకు బిఆర్ఒ కార్మికులు నిత్యం మంచు తొలగింపు పనులు చేస్తారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రాణనష్టం జరిగినట్లు వార్తలు లేవు. రెస్క్యూ బృందాలను ఘటనాస్థలికి చేరుకున్నాయి. కానీ ఆ ప్రాంతంలో చురుగ్గా హిమపాతం, వర్షం పడుతుండడంతో సహాయక చర్యలు నెమ్మదిగా జరుగుతున్నాయి' అని జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. మంచు తుఫాను మరియు వర్షం పడుతున్నప్పటికీ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి బయలుదేరాయి. హిమపాతంలో చిక్కుకున్న 57 మంది బిఆర్ కార్మికులలో 25 మందిని రక్షించారని, మిగిలిన వారిని రక్షించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి ధామి మీడియాకు వెల్లడిచారు. సహాయ చర్యల్లో ఐటిబిపి, ఇతర విభాగాల సహాయం తీసుకున్నామని, తమ విపత్తు నిర్వహణ దళంతో పాటు అధికార యంత్రాగం మొత్తం పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. వీలైనంత త్వరగా అందరినీ సురక్షితంగా రక్షించడమే ధ్యేయమన్నారు. చమోలి, ఉత్తరకాశి, రుద్రప్రయాగ్, పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని 2,400 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రదేశాలకు 24 గంటల పాటు హిమపాతం హెచ్చరిక చండీగఢ్‌లోని డిఫెన్స్ జియోఇన్ఫర్మేటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డిజిఆర్ఇ) గురువారం సాయంత్రం 5 గంటలకు జారీ చేసింది. డెహ్రాడూన్‌లోని వాతావరణ శాఖ కార్యాలయం శుక్రవారం ఉదయం ఈ జిల్లాల్లో 3,500 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రదేశాలలో భారీ వర్షం, హిమపాతం నమోదవుతుందని అంచనా వేసింది. బిఆర్ఒ చేపడుతున్న నిర్మాణ పనుల సమయంలో మనా గ్రామం సమీపంలో సంభవించిన హిమపాతంలో అనేక మంది కార్మికులు చిక్కుకున్నారనే విచారకరమైన వార్త అందిందని సిఎం ధామి ఎక్స్‌లో పోస్టు చేశారు.

# అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క, వ్యయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన మానవ వనరులు, రెప్పపాటు కూడా అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా, శాంతి భద్రతలు పరిరక్షణ, మంచి వాతావరణాన్ని కల్పించడంతో తెలంగాణ రాష్ట్రం ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నదని, ఇటీవల దావోస్‌లో 1.80 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని వివరించారు.

వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఈ రంగానికి రూ. 52వేల కోట్ల నిధులను కేటాయించామని, రెండు నుంచి మూడు నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద సుమారు రూ.22 వేల కోట్లను రైతుల ఖాతాలో జమ చేశామని వివరించారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటికే రూ. 11,500 కోట్లు, రైతు బీమా కింద రూ. 1,500 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ పథకం కింద సబ్సిడీ మొత్తం రూ.11 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌గా రూ. 1,800 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రైతులకు ప్రయోజనం చేకూరుతుందని భట్టి వివరించారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగా వృద్ధి సాధిస్తుందని, అందుకే గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేపట్టామని, వెయ్యి మెగావాట్లు ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ కంపెనీలతో ఎంఒయు కూదుర్చుకున్నామని వివరించారు. మహిళలను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు.

హైదరాబాద్ నగరానికి సిఎం రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, హైదరాబాద్ నగరానికి మూసీ నది మణిహారంగా భావిస్తున్నామని తెలిపారు. మూసీ నదిని పునర్జీవింపజేసి ఆదాయంతో పాటు, పరిసరాల్లో నివసించే వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ నది అభివృద్ధి క్రమంలో నిర్వాసితులయ్యే వారికి బ్యాంకర్లు ఆర్థికంగా చేయూతను అందించాలని చెప్పారు. మూసి నిర్వాసిత మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించినట్టు వివరించారు.

కోటి మంది జనాభా ఉండే హైదరాబాద్ నగరంలో మహిళలకు ఆర్థిక చేయూతనిస్తామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఇండస్ట్రియల్, ఫార్మా, హౌసింగ్ క్లస్టర్లు పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని, రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వెల్లువెత్తుతాయని భట్టి చెప్పారు. అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలు, వర్గాలు అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ'లో బ్యాంకర్స్ పాత్ర కీలకమని, ప్రపంచాన్ని ఆకర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

# ఐదు చోట్ల మెత్తని భాగాలు

(మొదటి పేజీ తరువాయి)

ఐదు మెత్తని భాగాలను గుర్తించారు. దీంతో చిక్కుకుపోయిన వారు అక్కడే ఉన్నట్లుగా సహాయక సిబ్బంది భావిస్తున్నారు. మరోవైపు, ఆ మెత్తని భాగాలు మానవ దేహాలు కావచ్చు.. కాకపోవచ్చు అని అధికారులు పేర్కొంటున్నారు. మెత్తని భాగాలు ఉన్నచోట తవ్వకాలు జరపనున్నారు. తవ్విన తర్వాత మానవ దేహాలా కాదా అనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ఈ ఘటనలో గల్లంతైనవారి పరిస్థితిపై కాసేపట్లో అధికారిక సమాచారం వచ్చే అవకాశం ఉంది.

**తప్పుడు వార్తల్ని నమ్మొద్దు: కలెక్టర్**

టన్నెల్‌లో మృతదేహాలు లభించాయనేది అవాస్తవమని నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్ స్పష్టంచేశారు. తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఏదైనా సమాచారం ఉంటే.. తామే వెల్లడిస్తామన్నారు.



# దేశ రక్షణ బాధ్యత యువతపైనే

## గచ్చిబౌలి స్టేడియంలో "విజ్ఞాన్ వైభవ్ 2025" ప్రదర్శనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** దేశ రక్షణ బాధ్యత యువతపైనే ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.దేశ రక్షణలో హైదరాబాద్ దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో డిఆర్‌డిఒ ఆధ్వర్యంలో నిర్వహించి"విజ్ఞాన్ వైభవ్ 2025" ప్రదర్శనలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ మాట్లాడుతూ దేశ రక్షణలో తెలంగాణ పాత్ర కీలకంగా ఉందన్నారు. బిడిఎల్, హెచ్‌ఎఎల్, మిధాని వంటి కీలక సంస్థలు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నాయని తెలిపారు.ఈ సైన్స్ ప్రదర్శనపట్ల విద్యార్థులు,యువతకు దేశరక్షణ పట్ల అవగాహన కలుగుతుందని చెప్పారు. ప్రస్తుతం యువత ఐటి ఉద్యోగాలవైపే ఎక్కువగా మొగ్గు చూపుతోందని, సంప్రదాయ ఇంజనీరింగ్ విద్యపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**సైన్స్ అభివృద్ధిని అధ్యయనం చేయాలి : కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్**

మానవ పరిణామ క్రమాన్ని,సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నోబెల్ గ్రహీత సివి రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని, అందుకే 28న ఆయన గౌరవార్థం ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సైన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. తాను కూడా సైన్స్ విద్యార్థినేనని. మరి కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేసినట్లు చెప్పారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మానవ పరిణామ క్రమాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎంఎల్‌ఎ ఆరెకపూడి గాంధీ, డిఆర్‌డిఒ చైర్మన్ సతీష్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, రక్షణశాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్లాటు కొనుగోలుదారులపై భారం వేయొద్దు : సిపిఐ(ఎం)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లే అవుట్ క్రమ బద్ధీకరణ భాగంగా ఖాళీ స్థలాల ఛార్జీలను లేఅవుట్ ఓనర్ల నుండే వసూలు చేయాలని సిపిఐ(ఎం) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం 14 శాతం ఖాళీ స్థలాల ఛార్జీల భారం సామాన్య ప్లాట్ కొనుగోలుదారులపై పడుతోందని, ఓపెన్ స్పేస్ లను వదలకుండా లే అవుట్ వేసిన రియాల్టర్లు బాధ్యత వహించాలి తప్ప ప్లాటు కొనుగోలుదారులపై భారం వేయడం సమంజసం కాదని పేర్కొంది. అదేవిధంగా 10 శాతం ప్లాట్లు అమ్మిన లేఔట్లలో మిగతా 90 శాతం ప్లాట్లను లేఔట్ ఓనర్లు క్రమబద్ధీకరించుకునే అవకాశంతో పాటు కొత్తగా దరఖాస్తు పెట్టుకునే వారికి ప్రభుత్వం అవకాశం కూడా కల్పించిందని ఇది సరైందని కాదని వెల్లడించింది. 90 శాతం ఖాళీగా ఉన్న లేఔట్లలో ఓపెన్ స్పేస్ లకు అవసరమైన స్థలాన్ని స్థానిక సంస్థలు స్వాధీనం చేసుకుని మిగతా ప్లాట్లను మాత్రమే క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వం తక్షణమే మార్గదర్శకాలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. ఖాళీ స్థలాలను తీసుకోలేక పోతే ఓపెన్ స్పేస్ ఛార్జీలను లేఔట్ ఓనర్ల నుండే వసూలు కు చర్యలు చేపట్టాలి, ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించకుండా లేఅవుట్ల ఓనర్లకు క్రమబద్ధీకరించరాదని పేర్కొంది. భవిష్యత్తులో ప్లాట్ గ్ కొనుగోలుదారులపై ఖాళీ స్థలాల ఛార్జీల భారం లేకుండా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈ మేరకు శుక్రవారం సిపిఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు.

## ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో
# మహిళల కోసం 'మినీ పారిశ్రామిక పార్క్'

### మహిళల కోసం అభివృద్ధి చేస్తా
### ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'మినీ ఇండస్ట్రియల్ పార్క్'ను మహిళల కోసం అభివృద్ధి చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ పార్కుల్లో ఎస్‌సి, ఎస్‌టి మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. హైదరాబాద్ రెడ్ హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ టిసిసిఐ) భవన్‌లో శుక్రవారం ఎస్‌సి, ఎస్‌టి శాసనసభ్యులు, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్‌సి, ఎస్‌టి ఎంటర్ ప్రైజెస్ సంయుక్తా ఆధ్వర్యంలో నిర్వహించిన 'రౌండ్ రౌండ్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంఎస్ఎంఇ 2024, ఎ టోకెన్ ఆఫ్ గ్రాటిట్యూడ్ టూ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ'కు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలు ఎదిగితేనే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఖచ్చితంగా నెరవేరుస్తుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అంటేనే దళితులు, దళితులు అంటేనే కాంగ్రెస్ అన్నారు. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు.

**మార్చి చివరినాటికి రూ.300కోట్లు చెల్లిస్తాం..**

సబ్సిడీల ద్వారా పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి రూ.4500 కోట్లకు పైగా బకాయిలు అందాల్సి ఉందన్నారు. వీటిలో రూ.2200 కోట్లు ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకే అందాల్సి ఉందన్నారు. తాము అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించామన్నారు. మార్చి చివరి నాటికి రూ.300 కోట్లు చెల్లిస్తామని మంత్రి ప్రకటించారు.

**ఎంఎస్‌ఎంఇలకు ప్రత్యేకంగా పాలసీ**

దేశంలో ఎక్కువ మంది కార్మికులు ఎంఎస్‌ఎంఇ రంగంలోనే ఉపాధి పొందుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దురదృష్టవశాత్తు ఇప్పటి వరకూ ఎంఎస్‌ఎంఇలకు ప్రత్యేకంగా పాలసీ అంటూ ఏదీ లేదని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సూచనల మేరకు తాము ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చామన్నారు. క్షేత్ర స్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసి, నిపుణులను భాగస్వామ్యం చేసి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ పాలసీని రూపొందించామని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తల కోరిక మేరకు వారికి మరింత ప్రయోజనం చేకూరేలా ఈ పాలసీ ఆపరేషనల్ గైడ్‌లైన్స్‌ను రూపొందిస్తామన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ఎస్‌సి, ఎస్‌టి ఎంఎల్‌ఎలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తమిళనాడు, కర్ణాటకలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందన్నారు. అక్కడి ప్రభుత్వాలు దళిత పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తుందన్నారు. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణరావు, ఎంఎల్‌ఎలు వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్, కడియం శ్రీహరి, రాంచందర్ నాయక్, మందుల సామేల్, వెడ్మ భోజ్జు, నాగరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

## ఎన్‌ఐటి వరంగల్‌లో ఘనంగా
# 'స్ప్రింగ్‌స్ప్రీ-25' షురూ

### ముఖ్య అతిథిగా హాజరైన సినీ హస్య నటుడు డాక్టర్ బ్రహ్మానందం



**ప్రజాపక్షం / కాజీపేట :** ఎన్‌ఐటీ వరంగల్ వార్షిక సాంస్కృతిక ఉత్సవం స్ప్రింగ్‌స్ప్రీ25 శుక్రవారం మధ్యాహ్నం సంస్థ ఆడిటోరియంలో సినీ హస్య నటుడు డాక్టర్ కె. బ్రహ్మానందం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీనివాస చార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి. శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ (సాంస్కృతిక) స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమైన ఈ వేడుక విద్యార్థుల ఉత్సాహాన్ని మరింత పెంచింది. అనంతరం డాక్టర్ కె. బ్రహ్మానందం విద్యార్థులతో మాట్లాడారు. ఎన్‌ఐటీ వరంగల్‌లో తాను పొందిన ఆదరణకు ఆనందం వ్యక్తం చేస్తూ, శ్రోతల్లో ఉన్న ప్రతిభాశాలి విద్యార్థులలో భవిష్యత్తులో కలామ్స్, బ్రహ్మానందం లు ఉండబోతున్నారని తెలిపారు. అలాగే, విద్యార్థులు ఆరోగ్యాన్ని ప్రధానంగా పరిగణించాలన్న ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు ఉన్న మనిషి మంచి పనులు చేయగలడని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిరంతరం అనుసరించి, దృఢ సంకల్పం, కష్టపడి పనిచేస్తే విజయాన్ని తప్పక సాధించగలరని ఆయన సూచించారు. చివరగా 'మంచి చేద్దాం, మంచిగా జీవిద్దాం, ఆనందంగా ఉండండి' అని సందేశం ఇచ్చారు. సాంస్కృతిక ప్రతిభకు వేదికసాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించేందుకు స్ప్రింగ్‌స్ప్రీ'25 వేదికగా నిలుస్తున్నది. దేశం నలుమూలల నుండి విద్యార్థులు పాల్గొని సంగీతం, నృత్యం, నాటకం, ఇతర సాంస్కృతిక పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఎన్‌ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి స్ప్రింగ్‌స్ప్రీ'25 ఉత్సవానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవాన్ని అద్భుతమైన ప్రారంభంతో ఆరంభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, వారిలో ఉన్న ప్రతిభను ప్రదర్శించే గొప్ప వేదికగా స్ప్రింగ్‌స్ప్రీ'25 నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా పాల్గొనే విద్యార్థులు ఈ వేడుకలో తమ విశేష ప్రతిభను ప్రదర్శించి, ఎన్‌ఐటీ వరంగల్ ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు.

## ఎస్‌ఎల్‌బిసి ఘటనపై బిఆర్‌ఎస్
# రాజకీయం తగదు

### గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌ఎల్‌బిసి ఘటనను బిఆర్‌ఎస్ రాజకీయం చేయడం తగదని, అధికార, ప్రతిపక్ష పార్టీలు అందరూ కలిసి ముందుకు సాగాల్సిన సమయంలో ఆరోపణలు, విమర్శలు తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హితువు పలికారు. 2019 సంవత్సరం తర్వాత ప్రస్తుతం (2025 సంవత్సరం) టన్నెల్ పనులు మొదలవ్వగానే ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణ బేసిన్‌లోని ప్రాజెక్ట్‌లతో పాటు ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనులపైన గత సిఎం సరైన సమయాన్ని కేటాయించలేదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని శాసనమండలి ప్రాంగణంలోని హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుత్తాసుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అనేక సంఘటనలను, ప్రమాదాలను ఎదుర్కొన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సంస్థల ప్రతినిధులు, పలువురు సాంకేతిక నిపుణులు ఎస్‌ఎల్‌బిసిలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు పనిచేయడం లేదని బిఆర్‌ఎస్ ఆరోపించడం సబబు కాదని హితువు పలికారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పెట్టిన శ్రద్ధలో కనీసం 20 శాతం కృష్ణా బేసిన్ ప్రాజెక్ట్‌లపైన దృష్టి పెడితే ఆ ప్రాజెక్టులు పూర్తయ్యేవని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు చెల్లించిన అడ్వాన్సులను కృష్ణా ప్రాజెక్ట్‌లకు చెల్లిస్తే పనులు పూర్తయ్యేవని, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్ట్ ఎందుకు ఆలస్యం జరుగుతుందో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆత్మకు తెలియదా? అని ప్రశ్నించారు.

నీటిపారుదల ప్రాజెక్ట్‌ల వద్ద జరిగే ప్రమాదాలను, ప్రమాదాలుగా మాత్రమే చూడాలని, దీనిపై రాజకీయం చేయవద్దని సూచించారు. ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్ట్ విషయంలో 2014 సంవత్సరంలో మాజీ సిఎం కెసిఆర్ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారని, ఈ సమావేశంలో సాధ్యాసాధ్యాలపైన చర్చించి, దీనిని యధావిధిగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుత్తా గుర్తుచేశారు. మొదటి సారి నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు సమీక్ష నిర్వహించారని, ఆ తర్వాత రెండవసారి అధికారంలోనికి వచ్చిన తర్వాత ఆ శాఖ కెసిఆర్ వద్దనే ఉండడంతో ఎస్‌ఎల్‌బిసిని పెద్దగా పట్టించుకోలేదని ఆరోపించారు. నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ప్రస్తుత యంత్రాలను తీసుకురావాలన్నా, వారికి ప్రభుత్వమే డబ్బులు చెల్లించి, ఆ సంస్థను ప్రోత్సహించే పరిస్థితి ఉన్నదని వివరించారు. ఎస్‌ఎల్‌బిసి కోసం నల్లగొండ ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. ప్రమాదాలకు భయపడి ప్రాజెక్ట్‌లను నిలిపివేసే ప్రసక్తి ఉండబోదని, ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో ప్రమాదాలు జరుగుతాయని, కానీ భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఎస్‌ఎల్‌బిసి సొరంగం, ఎత్తిపోతల విషయంలో 1995 సంవత్సరంలో నాటి సిఎం చంద్రబాబు ఎంఎల్‌ఎలు, ముఖ్యులతో ఒక కమిటీ వేశారని, ఇందులో ఉజ్జిని నారాయణరావు, నర్ర రాఘవ రావు, నంద్యాల నర్సింహారెడ్డితో పాటు తాను ఆ కమిటీలో సభ్యునిగా ఉన్నానని, అనేక సమీక్షలు, సమావేశాలు, చర్చల అనంతరం అప్పటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్ట్‌లకు ప్రథమ ప్రధాన్యత ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఎసిబికి చిక్కిన హెడ్మాస్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** కొత్తగూడెం కూలీలైన్ హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయున్ని ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శుక్రవారం కరాటే శిక్షణా పాఠశాలకు రూ.30వేలు మంజూరు అయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్‌కు చెందాల్సిన రూ.30 వేలలో రూ.20 వేలను లంచంగా డిమాండ్ హెచ్‌ఎం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు లంచం తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నారు.

## మూడు ఎకరాల వరకు
# రైతు భరోసా నిధులు

### తక్షణమే విడుదల చేయండి
### ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా పథకంలో భాగంగా మూడు ఎకరాల వరకు లబ్ధిదారులకు తక్షణమే నిధులను విడుదల చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆర్థిక, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామ కృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ గోపిలతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల పేర్లు అందరికీ కనిపించేలా, గ్రామాల ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఈపిఎఫ్ కనీస పెన్షన్ రూ.1000కి పెంచకపోవడం దారుణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇపిఎఫ్95 పెన్షనర్లకు సంబంధించి కనీస పెన్షన్ రూ.1000లకు పెంచకపోవడం దారుణమని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర ఎం.నాగేశ్వరరావు అన్నారు. ఇది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నిర్లక్ష్య వైఖరి గర్హనీమని ఆయన పేర్కొన్నారు. ఈపిఎఫ్95 కింద 80 లక్షల మంది పెన్షనర్లు ఉండగా 10 ఏళ్ల జ్యాపం తర్వాత శుక్రవారం నిర్వహించిన ప్రావిడెంట ఫండ్ పెన్షన్లకు సంబంధించి కనీస పెన్షన్ పెంపుపై సిబిటి చర్చించకపోవడం విచారకరమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ
# మార్చి 10వ తేదీలోగా చేపట్టాలి

### పార్టీ జెండా మోసినవారికి ఖచ్చితంగా గుర్తింపు
### టిపిసిసి విస్తృత కార్యవర్గ సమావేశంలో సిఎం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీని మార్చి 10వ తేదీలోగా చేట్టాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు ఆదేశాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి చెప్పారు. "పార్టీ జెండా మోసినవారికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుంది. పార్టీ కోసం కష్టపడినవారికే నామినేటెడ్ పదవులు ఇచ్చాం. సుదీర్ఘకాలంగా పనిచేసినవారికి కొంతమందికి అవకాశాలు రాలేదు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపై ఉంది. రానున్న రోజుల్లో వారికి తప్పకుండా ప్రాధాన్యత కల్పిస్తాం. పదవులు వచ్చిన వారూ పార్టీ కోసం కష్టపడాలని, పనితీరు సరిగా లేనివారికి రెన్యూవల్ ఉండదు. మంచిని మైక్‌లో చెప్పాలని, చెడును చెవిలో చెప్పాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగింది. టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి, ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, పార్టీ సీనియర్ నాయకులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు. సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, ఇది ఒకరోజుతో ముగిసేదికాదని, నిరంతర ప్రక్రియ అన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. రూ.4200 కోట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసిందని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రైతు భరోసాను రూ.12 వేలకు పెంచడం తోపాటు భూమిలేని పేదల కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నామని, మన సక్సెస్ స్టోరీని మనమే చెప్పుకోవాలని సిఎం అన్నారు.

రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు మనమంతా కసితో పనిచేయాలని, మోదీని గద్దె దించే వరకు మనం కష్టపడాలన్నారు. రాహుల్ గాంధీ పట్టుదలతోనే కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేయగలిగామని, రాష్ట్రంలో అధికారంలో ఉంటేనే ఇన్ని చేయగలిగితే దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే ఇంకెన్ని చేయొచ్చో ఆలోచించాలన్నారు.

**రాష్ట్రంలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలతో పోరాటం చేయాలి**

ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలతో పోరాటం చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఇవన్నీ ప్రజలకు సక్రమంగా అందాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, పేదవారి కోసం పనిచేయాలని, పేదల మొఖంలో నవ్వులు చూడాలని, అప్పుడే మనం పని చేసినట్లన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎంతో పోరాట శక్తి ఉందని, అనేక రకాలుగా పోరాటాలు చేసామని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని, వారికి న్యాయం జరగాలని, పదవులు పొందిన వారు ప్రజల కోసం పనిచేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ కులగణన చేపట్టడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

**కిషన్‌రెడ్డికి చేతనైతే రాష్ట్రానికి సాయం చేయాలి.. విమర్శలు తగదు**

చేతనైతే రాష్ట్ర ప్రభుత్వానికి సాయం చేయాలని లేకపోతే విమర్శలు చేయవద్దని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. 'తెలంగాణ ముఖ్యమంత్రి నేనా.. రేవంత్‌రెడ్డా' అని కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రానికి సిఎం ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఎవరి పరిధిలో వారు సక్రమంగా పని చేస్తే గౌరవం ఇస్తామన్నారు. మతచిచ్చు పెట్టే బిజెపి తెలంగాణలో ఎన్నటికీ అధికారంలోకి రాదని, వారి పగటి కలలేనన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కేంద్ర నిధుల విషయంలో సాయం కోరితే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని ఓ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాల్సిన కేంద్రం వివక్ష చూపుతుంటే రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న వీళ్లు మౌనంగా కూర్చున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందే విషయంలో కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు.



## న్యూమెరస్ మోటర్స్ ఇ-స్కూటర్, డిప్లోస్ మాక్స్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వదేశీ ఎలక్ట్రిక్ వాహనాలలో ప్రత్యేకత కలిగిన నవీన తరపు ఒరిజినల్ పరికరాల తయారీదారు న్యూమెరస్ మోటర్స్, తమ మల్టీయుటిలిటీ ఇస్కూటర్, డిప్లోస్ విడుదల చేసింది. న్యూమెరస్ మోటర్స్ వైస్ ప్రెసిడెంట్ ఇంజనీరింగ్ సౌందరరాజన్ ఎస్ మాట్లాడుతూ దక్షిణాది మార్కెట్ల నుండి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి భారీ స్పందన లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నమ్మకమైన సమర్థవంతమైన ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ కోసం డిమాండ్ పెరుగుతూనే ఉందన్నారు. సౌకర్యవంతమైన రైడింగ్ అనుభవాన్ని అందించడానికి అధునాతన సాంకేతికతను ఆచరణాత్మక రూపకల్పనతో కలపడమే తమ లక్ష్యాన్ని డిప్లోస్ మాక్స్ ప్రతిబింబిస్తుందని తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా వాహనమైన ఇది సురక్షితమైనది, నమ్మదగినది అని, మా వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చడానికి అనుసంధానించబడిన సాంకేతికతతో మన్నికైనది. ఆవిష్కరణ అని తెలిపారు. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్ లో రూ. 1,12,199 ఎక్స్‌షోరూమ్ ధరకు అందుబాటులో ఉందని ఆయన వెల్లడించారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్-17,
కెజెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIQ No. 09/EE/CIRCLE-17/KZ/GHMC/2024-2025 కొటేషన్ల ఆహ్వాన ప్రకటన తేది: 27.02.2025

**NIQ No.** 09, **పని పేరు:** **ఎ)** తెలుగు తల్లి ఫ్లైవర్ కింద ఫౌంటైన్‌ల అభివృద్ధి, **బి)** ఫుట్‌పాత్ అభివృద్ధి (సిఎన్‌సి కటింగ్‌తో కూడిన మానవ కోట్ శిల్పాలు), **సి)** ఖైరతాబాద్ మోడల్ వార్డు కార్యాలయం నిర్మాణం, **డి)** మెరుస్తున్న సంకేతాల బోర్డు, **ఇ)** ఇతర అంశాలకు కొటేషన్లు ఆహ్వానించడమైనది, **ప్రారంభ తేదీ / డౌన్‌లోడ్‌కు ఆఖరి తేదీ & సమయం:** 01.03.2025న మ.12.00గం.ల నుండి 04.03.2025న మ.12.00గం.ల వరకు మాత్రమే. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు దిగువ సంతకందారు కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 10738-PP/CL/ADVT/1/2024-25, Date: 28-02-2025

ప్రజాపక్షం
శనివారం, మార్చి 01

# డీలిమిటేషన్ వివాదం

నరేంద్రమోదీ బిజెపి ప్రభుత్వం ఏదీ బాహాటంగా చెప్పి, చర్చించి చేయదు. కీలకమైన అంశాల్లో అంతా గోప్యం. తాను సరైన సమయం అనుకున్నప్పుడు, తనకు రాజకీయంగా లాభసాటి అనుకున్నప్పుడు అకస్మాత్తుగా బిల్లును పార్లమెంటు ముందుకు తెస్తుంది. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం ఫెడరల్ సూత్రాన్ని పాటించకపోవటంవల్ల నూతన విద్యావిధానం, సిబిఎస్ఇ సిలబస్ మార్పులతో హిందీని బలవంతగా రుద్దే ప్రయత్నం చేస్తున్నదని తమిళనాడు ధ్వజమెత్తుతున్నది. భాషా సమస్య ఆదినుంచీ తమిళనాడులో సున్నితమైన వ్యవహారంగా ఉన్న విషయం. హిందీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన విషయం బిజెపికి తెలియంది కాదు. అయితే దాని 'ఒక దేశం ఒక...' విధింపుల వరసలో 'ఒకే దేశం – ఒకే భాష(హిందీ అని అర్థం)' కూడా ఉంది. తమిళనాడులో ఇప్పటికే త్రిభాషా సూత్రంపై (హిందీ విధింపు) అలజడి జరుగుతుండగా ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మార్చి 5న అఖిలపక్ష సమావేశం పిలిచారు. దీనిపై ఆయన జాతీయ చర్చ లేవనెత్తుతున్నారు. ఇదే అంశాన్ని తాజాగా పంజాబ్ విద్యాశాఖమంత్రి లేవనెత్తారు. పంజాబీ భాషకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారని సిబిఎస్ఇపై, కేంద్రంపై ఆయన ధ్వజమెత్తారు. అంతకుముందు యూనివర్శిటీల వైస్‌ఛాన్సలర్‌ల నియామకంపై రాష్ట్రాల అధికారాన్ని హరిస్తూ యుజిసి ఒక ముసాయిదా సర్క్యులేట్ చేసింది. బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలన్నీ దాన్ని వ్యతిరేకించాయి, ఉపసంహరణను డిమాండ్ చేశాయి.

ఈ ఏకపక్ష ఆధిపత్యం కొనసాగింపే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) ఆలోచన. జనాభా నియంత్రణకై కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలన్న జాతీయ విధానాన్ని ఆరు దశాబ్దాలుపైగా సమర్ధవంతంగా అమలు జరిపి పునరుత్పత్తి రేటును తగ్గించి దేశానికి ఆదర్శంగా నిలిచినందుకు దక్షిణాది రాష్ట్రాలు డీలిమిటేషన్‌లో భారీ మూల్యం చెల్లించుకోబోతున్నాయి. జనాభా దామాషాన నియోజకవర్గాలను పునర్నిర్ణయం చేసే పక్షంలో జనాభా నియంత్రణను పాటించని ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ వంటి హిందీ భాషా రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు పెరుగుతాయి, దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతాయి. ఈ ఆందోళన చాలా కాలంగాఉంది. అందువల్ల 1971 జనాభాను ప్రాతిపదికగా తీసుకుని లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యం పరిరక్షించబడుతున్నది. 1973 నుంచీ సీట్ల సంఖ్య పెరగలేదు. 2001 దశవర్ష జనాభా లెక్కల సేకరణ సమయానికి కొద్ది సంవత్సరాల ముందే దక్షిణాదిరాష్ట్రాలు ఈ సమస్యను లేవనెత్తాయి. అయితే కోవిడ్ కారణంగా జనాభా లెక్కల సేకరణ వాయిదా పడింది. కోవిడ్ అంతర్ధానమై మూడేళ్లు దాటిపోయినా కేంద్రప్రభుత్వం ఎంతో కీలకమైన జనగణనపై నోరు మెదపటం లేదు. డీలిమిటేషన్ ప్రక్రియను 2026 తర్వాత చేబట్టే తొలి జనగణన లెక్కల ప్రకారం చేబట్టాలని 84వ రాజ్యాంగ సవరణ నిర్దేశించింది. సాధారణంగా అయితే 2021 సెన్సెస్ తర్వాత 2031లో సెన్సెస్ నిర్వహించాలి. 2021 సెన్సెస్ ఉద్దేశపూర్వకంగా జాప్యమవుతున్నందున 2026లో చేబట్టి ఆ తదుపరి డీలిమిటేషన్ చేబడతారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. అది సాధ్యమే.

పెరిగిన దేశ జనాభా ప్రకారం లోక్‌సభ సీట్లు పెంచుతారా? జనాభా దామాషాలో రాష్ట్రాల వారీ సీట్ల సంఖ్య నిర్ణయిస్తారా? సీట్లు పెరుగుతాయని అప్పుడప్పుడు పొడిపొడి మాటలు తప్ప, దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తం చేస్తున్న భయాందోళనలను నివృత్తి చేయటానికెట్టి ప్రయత్నమూ లేదు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గవని ప్రధానమంత్రి లోక్‌సభలో చెప్పినందున దక్షిణాత్యులు తమ ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన చెందాల్సిన పనిలేదని హోంమంత్రి అమిత్ షా మొన్న కోయంబత్తూరులో తమ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవ సభలో సెలవిచ్చారు. ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరుగుతాయో లేదో స్పష్టత ఇవ్వలేదు. జనాభా దామాషాలో సీట్లు పెంచితే తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు సీట్లు పెరగకపోగా ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య కోతపడుతుంది. ఉదాహరణకు తమిళనాడు, అవిభక్త బిహార్‌లను తీసుకుంటే, 1971–2024 మధ్య వాటి ఓటర్ల సంఖ్య – తమిళనాడులో 171శాతం పెరగ్గా, బిహార్‌లో 233శాతం పెరిగింది. ఇప్పుడు తమిళనాడుకు 39, ఉమ్మడి బిహార్‌కు (జార్ఖండ్ కలిపి) 54 సీట్లున్నాయి. డీలిమిటేషన్ చేబట్టి, జనాభా పెరుగుదలకనుగుణంగా నియోజకవర్గాలను పునర్విభజించినా, లోక్‌సభలో మొత్తం సీట్లను పెంచినా తమిళనాడు సీట్లు తగ్గుతాయి, బిహార్ సీట్లు పెరుగుతాయి. మిగతా దక్షిణాది రాష్ట్రాలదీ ఇదే పరిస్థితి. అందువల్ల లోక్‌సభలో సమతౌల్యం పాటించటానికి ఫెడరల్ సూత్రాలను పాటించటం అవసరం. ఏమైనా, మోదీ–షా నాయకత్వం గోప్యత విడనాడి ప్రతిపక్షాలతో చర్చించటం అలవాటు చేసుకోవటం అనేక సమస్యలకు పరిష్కారాలు చూపుతుంది.

# యూరప్‌లో మితవాదం – 'లిబరల్స్' బాధ్యత

టి.ఎస్.తిరుమూర్తి
(ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారిగా/ శాశ్వత ప్రతినిధిగా పనిచేశారు) (2020–22)

ఇటీవల జర్మనీలోని మ్యూనిచ్‌లో జరిగిన భద్రత మహాసభలో, ఉక్రేన్‌పై ఐరాస జనరల్ అసెంబ్లీ ఓటింగ్‌లో హేళన వందసార్లు మరణించింది. కొద్దిరోజులక్రితం సౌదీ అరేబియాలో అమెరికా, రష్యా విదేశీ వ్యవహారాల మంత్రుల నేతృత్వంలో ఉక్రేన్ యుద్ధంపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఉక్రేనియన్, యూరోపియన్ ప్రతినిధులను ఆహ్వానించలేదు – ఈ దశలో వారి అవసరం లేదని భావించారు. 2024 జూన్‌లో ఉక్రేన్, యూరోపియన్ యూనియన్(ఇయు), అమెరికాల కోరిక మేరకు స్విట్జర్లాండ్ బర్గెన్‌స్టోక్‌లో 'ఉక్రేన్‌లో శాంతిపై శిఖరాగ్ర సభ' నిర్వహించింది. రష్యాను ఆహ్వానించలేదు – ఆ సమయంలో రష్యా అవసరం లేదని వారు భావించారు.

మ్యూనిచ్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రసంగిస్తూ, యూరప్ తన మితవాద పార్టీల ''గొంతు నులుముతున్నదని'', ఎన్నికల తలుపులు ''మూస్తున్నదని'', వాక్ స్వాతంత్ర్యాన్ని, మత స్వేచ్ఛలను ''అణచివేస్తున్నదని'', ఇయు యేతర దేశాలనుంచి ''అదుపు లేకుండా'' వలసలు ప్రోత్సహిస్తున్నదని, తద్వారా అది ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థకు, స్వేచ్ఛలకు, ''ప్రాథమిక విలువల''కు ముప్పు తెస్తున్నదని నిందించారు. నవంబరు 2024కు ముందు (అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు) అమెరికన్‌లు, యూరోపియన్‌లు తమ దేశాల్లోని పచ్చి మితవాద, మితవాద పార్టీలు బ్యాలెట్‌ద్వారా చట్టబద్ధత పొందకుండా నిరోధించేందుకు ప్రయత్నించారు; తమ దేశాల్లో మితవాదుల పెరుగుదలవల్ల ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛలకు – ఆచరణలో తమ పశ్చిమ ఉదార విలువలకు ముప్పు కలుగుతుందని వారు భావించారు. రుమేనియా అధ్యక్ష ఎన్నికల్లో తొలి రౌండ్‌లో గెలుపొందిన పచ్చిమితవాద అభ్యర్థి కాలిన్ జార్జిస్కు ఎన్నికను రుమేనియా రాజ్యాంగ న్యాయస్థానం రద్దు చేసింది.

## అమెరికా మరిచిపోతున్నదేమిటి?

ఉక్రేన్–రష్యా యుద్ధం పరిష్కరించేందుకు తగినంత ప్రయత్నం చేయకుండా, రష్యాతో గెలుపు సాధ్యంకాని యుద్ధం కొనసాగిస్తున్నారని ఉక్రేన్‌ను, జర్మనీని, యూరోపియన్ దేశాల నేతలను 2025 ఫిబ్రవరిలో అమెరికా నిందిస్తున్నది. అయితే ఉక్రేన్ యుద్ధంలో తమ దేశం అప్పటికే 110 బిలియన్ డాలర్లకుపైగా వెచ్చించిందని – అందులో 65 బిలియన్ డాలర్లు ఆయుధాలు ఇతర మందుగుండు కొనుగోలుకే ఇచ్చిందని అమెరికా మరిచిపోతున్నది. యూరప్ అగ్రశ్రేణి దేశాలు ఉమ్మడిగా ఉక్రేన్‌కు ఇచ్చిన సహాయంకన్నా అది ఎక్కువ. 2022 మార్చిలో, రష్యన్, ఉక్రేనియన్‌ల మధ్య తుర్కియే (టర్కీ)లో అప్పటికే ప్రారంభమైన చర్చలను ఒక యూరప్ దేశ నాయకుడు అమెరికా ఆదేశంపై భగ్నం చేసిన వాస్తవాన్ని కూడా అమెరికా మరిచిపోతున్నది.

2022 సెప్టెంబరులో, జర్మనీ సన్నిహిత మిత్రులు నోర్డ్‌స్ట్రీమ్ పైపులైన్‌ను ధ్వంసం చేసి అది పనిచేయకుండా చేశారు. తద్వారా జర్మనీకి జీవనాడిలాంటి గ్యాస్‌ను రష్యా సరఫరా చేయటాన్ని నిరోధించారు. జర్మనీ సుముఖంగా లేకపోయినా ఒత్తిడి తెచ్చి దాని లియోపార్డ్ ట్యాంకులు, ఇతర మందుగుండు సామాగ్రిని ఉక్రేన్‌కు సరఫరా చేయించారు.

అంతేగాక, యూరప్ తన భద్రత బాధ్యతను తానే చూసుకోవాలని, తన రక్షణ వ్యయాన్ని గణనీయంగా పెంచుకోవాలని, ఉత్తర అట్లాంటిక్ కూటమి (నాటో)లో అమెరికా పాత్రకు మించి అది ఖర్చు చేయాలని కోరరాదని అమెరికా యూరప్‌కు బోధిస్తున్నది. నాటో వార్షిక బడ్జెట్‌లో 16శాతం అమెరికా భరిస్తున్నది. దానిసైన్యంలో అత్యధికులు అమెరికన్‌లే. ప్రచ్ఛన్నయుద్ధం అంతమైన తదుపరి, తమ సొంత భద్రత, రక్షణకు యూరోపియన్‌ల ప్రయత్నం పట్ల సుముఖత చూపనిది తానేనన్న విషయాన్ని అమెరికా మరిచిపోతున్నది.

ఇయు యేతర దేశాలనుండి వలసలను నిరోధించటానికీ లేదా పశ్చిమ జీవన రీతిని విచ్ఛిన్నం చేస్తున్న టెర్రర్ దాడులు నిలుపు చేసేటట్లు మిలిటెంట్ రాడికల్ ఇస్లాంను ఎదుర్కోవటానికి ఇయు తగినంత చేయటంలేదని నేడు అమెరికా ఇయును నిందిస్తున్నది.

కొద్ది సంవత్సరాల క్రితం ఐక్యరాజ్యసమితిలో, అమెరికా, యూరప్ ఇలా ప్రకటించాయి: 'టెర్రరిజం ప్రమాదం అమెరికాలో ''జాత్యహంకారం, ఉపజాతుల పరంగా ఉద్దేశపూర్వకమైన హింసాయుత తీవ్రవాదం'' (ఆర్ఇఎంవిఇ) నుంచీ, యూరప్‌లో మితవాద తీవ్రవాదం పెరుగుదలనుంచీ సంభవిస్తున్నదిగాని, రాడికల్ ఇస్లాం నుంచి, లేదా పశ్చిమ దేశాల వినాశకర వలసల విధానం నుంచీ కాదు'. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ (ఒఐసి)వారు టెర్రర్‌కు వ్యతిరేకంగా సమష్టిపోరాటాన్ని దెబ్బతీయటానికి ప్రయత్నించినపుడు, ఇస్లాంపట్ల భయానికి (ఇస్లామోఫోబియా) ప్రతిస్పందనగా 2020లో ఫ్రాన్స్‌లో టెర్రరిస్టు దాడులను యుఎన్ అలయెన్స్ ఆఫ్ సివిలిజేషన్ (యుఎన్ఎఒసి) త్రోసిపుచ్చినపుడు ఐరాసలోని వారి ''లిబరల్'' రాయబారులు మౌనం వహించారు.

## యూరప్‌తో సమస్య

తమ అంతర్గత విధానాలు తెచ్చిన ఇబ్బందిని గుర్తించటానికి యూరప్ తిరస్కరిస్తున్నది. హింసామార్గం చేబట్టిన అసమ్మతి వాదులను, రాడికల్స్‌ను, టెర్రరిస్టులను, కాందిశీకులు పౌరసత్వం స్వీకరణను ప్రోత్సహించటం ఆ విధానాల్లో ఉన్నాయి. కాందిశీకుల పౌరసత్వం స్వీకరణ సమస్య పర్యవసానం ఏమంటే అది ఆ దేశాల జనాభా కూర్పును మార్చివేసింది. దీన్ని వెనక్కు మళ్లించటం బహుశా సాధ్యం కాదు. యూరప్ లిబరల్ బాహాట సమాజాలను లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం(ఎల్‌టిటిఇ) టెర్రరిస్టులు, ఖలిస్థానీ వేర్పాటువాదులు, టెర్రరిస్టులు, అల్ ఖైదాకు చెందిన అప్రతిష్టపొందిన హాంబర్గ్ సెల్ (9/11 టెర్రరిస్టు దాడులకు పాల్పడిన పైలెట్లు ఇక్కడినుంచే వచ్చారు) లేదా యూరోపియన్‌లను తమ సొంత నగరాల్లో (పారిస్, నైస్, ఓస్లో, వియన్నా, మాడ్రిడ్, బ్రస్సెల్స్ లేదా ఇతరత్రా) హత్యచేసే ఇస్లామిక్ రాడికల్స్ తమకు అనువుగా ఉపయోగించుకున్నారు. అందువల్ల, తమ నాయకుల తప్పు ప్రాధాన్యతలకు ప్రతిస్పందనగా యూరప్‌లో ఎన్నికల్లో మితవాద పార్టీలు వరుసబెట్టి విజయాలు సాధించటంలో ఆశ్చర్యం లేదు. జర్మనీలో ఇటీవల ఎన్నికలు పచ్చి మితవాదులను దూరంపెట్టాయి. అది తాత్కాలికమే కావచ్చు. యూరప్‌లోపల చేజారుతున్న సమతౌల్యం కనుగొనటానికి ఇది ఆఖరు అవకాశం కావచ్చును.

మ్యూనిచ్‌లో వాన్స్ చెప్పినట్లు, ''మీ సొంత ఓటర్ల నుంచి భయంతో మీరు పరుగెడుతుంటే, మీకోసం అమెరికా చేయలిగిందేమీ ఉండదు''. 2020 ఎన్నికల ఓటమిని అంగీకరించటానికి ట్రంప్ 1.0 తిరస్కరించటాన్ని, 2021లో యు.ఎస్. కాపిటోల్ (కాంగ్రెస్ భవనం)పై దాడికి పాల్పడిన నేరస్థులకు ట్రంప్ 2.0 తొలిచర్యగా క్షమాభిక్ష మంజూరు చేయటాన్ని అమెరికా మరిచిపోతున్నది. ఈ సమస్యల్లో అమెరికా అప్రజాస్వామికత, లేదా దాని నేరం తక్కువేమీ కాదని యూరప్ వ్రేలెత్తి చూపుతున్నది. అయితే జర్మనీ నాజీ గతాన్ని, అది తిరిగి తలెత్తే ప్రమాదాన్ని, లేదా రష్యా దురాక్రమణను ఎత్తిచూపటం తమ దేశాల్లోని పచ్చిమితవాదులకు వ్యతిరేకంగా కఠిన చర్యలకు సాకులు కాజాలవు.

యూరప్ నేర నిరాకరణ స్థితిలో ఉన్నట్లు కనిపిస్తున్నది. భావజాలాన్ని, ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని, పశ్చిమ విలువలను ఆచరించటం ప్రశంసనీయమైన ధ్యేయాలే. అయితే తమ విలువలకు పూర్తి విరుద్ధమైన నైతిక విలువలు కలిగి ఉన్న వారి వలసలను అనుమతించటం ద్వారా ఇయు నాయకులు తమ సొంత లిబరల్ విలువలు క్రమేపీ అంతరించిపోవటంలో భాగస్వాములవుతున్నారు. తమ సొంత గుర్తింపు, జీవన విధానం, మతం సైతం కోల్పోతామని భయపడుతున్న ప్రజలు తమ వ్యతిరేకతకు వ్యక్తీకరణగా పచ్చి మితవాదులకు ఓటు వేస్తున్నారు. ఇది లిబరల్ విధానాలను కాఠిన్య విలువలు (ఇల్లిబరల్) తమకు అనుకూలంగా ఉపయోగించుకోవటానికి గొప్ప ఉదాహరణ. మ్యూనిచ్‌లో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ, తమ స్వదేశాల్లో ప్రజాతంత్ర విలువలను పెంపొందిస్తున్నామని పశ్చిమ దేశాలు చెప్పుకోవటాన్ని ప్రస్తావిస్తూ, వెలుపల, ముఖ్యంగా దక్షిణార్ధగోళ దేశాల్లో (గ్లోబల్ సౌత్ – అవి సాపేక్షికంగా పేద దేశాలు కూడా) అవి ప్రజాస్వామ్యవ్యతిరేక శక్తులను బలపరుస్తున్నాయని గుర్తు చేశారు. పశ్చిమ దేశాలు ఇటీవల గ్లోబల్ సౌత్‌లో ప్రభుత్వాలను మార్చటాన్ని ప్రస్తావించారు. 2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్థాన్‌లో రాడికల్ తాలిబన్ బలవంతంగా అధికారం చేజిక్కించుకోవటం; 2024 డిసెంబర్‌లో, సిరియా ప్రాంతంలో అల్‌ఖైదా మాజీ నాయకుడు అహ్మద్ అల్–షార సిరియా అధ్యక్షుణ్ణి తొలగించటం ఇందుకు ఉదాహరణలు. ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే పేరుతోనే జరిగాయి.

ఉక్రేన్ యుద్ధం విషయంలో – రష్యాను రూపుమాపటానికి యూరప్, అమెరికాలు కలిసికట్టుగా జెలెన్స్కీని గట్టిగా బలపరిచాయి. అయితే ఘటనలు నాటకీయంగా మలుపు తిరిగాయి. అమెరికా కొత్త చొరవలు, పాదుకున్న యూరోపియన్ వైఖరుల మధ్య ఘర్షణ ఐరాస జనరల్ అసెంబ్లీలో బయటపడింది. యూరోపియన్/ఉక్రేనియన్ ముసాయిదా తీర్మానానికి వ్యతిరేకంగా అమెరికా రష్యాతో ఓటు చేసింది – అయితే అది ఆమోదం పొందకుండా నిరోధించలేకపోయింది. యూరప్ తీర్మానం ఆమోదం ఎంతో కష్టపడి పొందిన గెలుపు మాత్రమే. అమెరికా తోడ్పాటు లేనప్పుడు ఉక్రేన్ యుద్ధం ముగిసినట్లే. భద్రతా మండలిలో మరింత నాటకీయత ఆవిష్కృతమై అమెరికా తీర్మానం ఆమోదం పొందింది.

## ట్రాన్స్ అట్లాంటిక్ భాగస్వామ్యం

మ్యూనిచ్‌లో, ఐరాస జనరల్ అసెంబ్లీలో కుదుపులు సంభవించినప్పటికీ, అమెరికా–యూరప్ మధ్య ట్రాన్స్ అట్లాంటిక్ భాగస్వామ్యం ముగిసినట్లు ప్రకటించటం తొందరపాటు అవుతుంది. యూరప్ నుంచి వెనక్కు మరలాలన్న అమెరికా ప్రభుత్వ పిలుపు వ్యూహాత్మకం కాదు, మెరుగైన ఒప్పందం కోసం తిరిగి చర్చలకై ఎత్తుగడగా కనిపిస్తున్నది. జర్మనీలో కొత్త మధ్యేమార్గ నాయకత్వం అధికారంలోకి వచ్చినందున, యూరప్ తన మార్గంలో దిద్దుబాట్లు చేసుకునేందుకు, తన సొంత భద్రతపై మరింత వెచ్చించేందుకు, తమ సమాజాల్లో రాడికల్ విలువలు తలెత్తటాన్ని ఎదుర్కొనేందుకు, మరింత స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించేందుకు, అమెరికాతో తన సంబంధాల్లో దిద్దుబాట్లు చేసుకునేందుకు యూరప్‌కు ఇది సమయం కావచ్చు. రష్యా, చైనా మధ్య ''పరిమితులులేని'' భాగస్వామ్యం దృష్ట్యా ట్రాన్స్ అట్లాంటిక్ భాగస్వామ్యం ఇప్పుడు మరింత సంగతం కావచ్చు. యూరప్‌తో బంధం నుంచి బయటకు వెళ్లగలిగిన అమెరికా సామర్థ్యం అతిశయించబడుతున్నట్లే, ఈ తుపానును ఎదుర్కోగల యూరప్ సామర్థ్యం తక్కువ చేయబడుతున్నది.

పశ్చిమ నాగరికత గూర్చి మీరేమనుకుంటున్నారు అని ఒక విలేకరి మహాత్మాగాంధీని ప్రశ్నించగా, ''అదొక మంచి భావన అని నాకనిపిస్తున్నద''ని ఆయన సమాధానమిచ్చినట్లు చెప్పబడుతున్నది.

*(ది హిందూ – ఫిబ్రవరి 26 – సౌజన్యంతో)*

# భారతదేశ ఆర్థిక వ్యవస్థ పయనం ఎటు?



సుంకవల్లి సత్తిరాజు
9704903463

మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అర్ధ శాస్త్రంలో కొన్ని పదాలను సవరించి వ్రాయాలేమో అనిపిస్తుంది. అభివృద్ధికి నిజమైన కొలమానం నిర్ధారించాలి.

విదేశాలతో దౌత్య సంబంధాలు, వాణిజ్య వ్యూహాలు వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి సహకరిస్తున్నాయి. కొన్ని దేశాలు స్వతంత్రంగా ఎదుగుతున్నాయి. కొన్ని దేశాలు ఇతర దేశాల బలహీనతలను ఆసరాగా చేసుకుని, ఆయుధాల వ్యాపారం చేస్తూ, ఇతర దేశాల సంపదను కొల్లగొడుతూ, తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకుంటున్నాయి. భారత దేశం అనాదిగా విదేశీయుల దౌర్జన్యానికి,దోపిడీకి గురవుతున్నా, నిరంతరం న్యాయంగా జీవించడానికే ప్రాధాన్యత నిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత భారత ఆర్థిక స్థితిగతుల్లో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడం వలన భారత్ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని పలువురు మేథావులు ఆందోళన చెందుతున్నారు. అమెరికా రెసి ప్రోకల్ టారిఫ్‌ల వలన భారత్ పై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్థిక విశ్లేషకులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. భారత్‌కు ఉచిత ఆర్థిక సహాయం చేయబోమని ట్రంప్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

ట్రంప్ మాటల్లో తెంపరితనం కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి అమెరికా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందన్న సంగతి గమనించాలి. వలసదారుల విషయంలోను, టారిఫ్‌ల విషయంలోను ట్రంప్ ప్రదర్శిస్తున్న ధోరణి దిగజారిపోతున్న అమెరికా ఆర్థికరంగ పరిస్థితికి దర్పణం పడుతున్నది. ఉద్యోగాలు వదులుకుంటే, 8 నెలల జీతం బహుమతిగా ప్రకటిస్తామని, వివిధ రకాల అలవెన్సులను అందిస్తామని అమెరికా చెబుతున్నది. అమెరికాలో జన్మించిన వలస దారుల పిల్లలకు సైతం అమెరికా పౌరసత్వం నిరాకరించిన ట్రంప్ ప్రస్తుతం గోల్డ్ కార్డ్ పేరుతో వ్యాపారం చేస్తున్నారు. విదేశీ వలస దారులు ఒక్కొక్కరు 44 కోట్లు చెల్లిస్తే అమెరికా పౌరులుగా సభ్యత్వం కల్పిస్తామని అగ్ర దేశం ప్రకటించడం ఆశ్చర్య కరం.కోటి మంది లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రహసనం అమెరికా ఎదుర్కొంటున్న దారుణమైన ఆర్థిక పతనానికి నిదర్శనం. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న అన్ని అగ్రరాజ్యాల ఆర్థిక పరిస్థితి ఇలాగే ఉం ది. దివాళా తీస్తున్న అమెరికా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడాని కే అమెరికా ఈ విధమైన ధోరణి ప్రదర్శిస్తున్నదని పలువురు విమర్శిస్తున్నారు.

రష్యా ఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధంలో గత మూడేళ్లగా ఉక్రెయిన్ కు భారీగా ఆర్థిక,ఆయుధ సహాయం చేయడం వలన అమెరికా తీవ్రంగా నష్టపోవడం వలనే యుద్ధానికి ముగింపు నివ్వడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని వెలువడుతున్న వార్తలు సత్యదూరం కాబోవు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక మందగమనం వలన అనేక దేశాలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత్ కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ప్రపంచ దేశా లు ఆర్థిక సంక్షోభం చవిచూస్తున్న తరుణంలో భారత్ ఆర్థికంగా ఎదగడం ఎలా సాధ్యమయిందో, ఏయే రంగాలు అత్యధికంగా ప్రజలకు ఉపాధి కలిగిస్తున్నాయో, భవిష్యత్తులో భారత్ ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో కూలంకషంగా చర్చించాలి. భారతదేశంలో అపారమైన సహజ వనరులున్నాయి. ఖనిజ సంపదకు లోటు లేదు. అపారమైన జల సంపద ఉంది. ఎన్నో నదులకు భారతదేశం పుట్టినిల్లు. భారత దేశంలో ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. ఆదాయ వనరులున్నాయి. హిందూ మహా సముద్రం, అరేబియా సముద్రం, బంగాళా ఖాతం సరిహద్దులుగా 7500 కి.మీ పొడవైన సముద్ర తీర ప్రాంతం మనకుంది.మానవ వనరులకు కొదవలేదు.విద్యావంతులకు కొరత లేదు. యువ తరం భారతదేశానికి పెద్ద వరం. భిన్నమైన భౌగోళిక స్వరూపాలతో, పచ్చని వ్యవసాయ క్షేత్రాలతో, దాదాపుగా ప్రపంచంలో పండే పంటలన్నీ మన దేశంలో పండుతాయి. అభివృద్ధికి అవసరమైన అన్ని అనుకూలాంశాలు భారత దేశంలో ఉన్నాయి. అయితే పరదాస్యం నుండి విముక్తి పొంది 78సంవత్సరాలకు దగ్గరవుతున్నా, ఆర్థికంగా బలోపేతమవుతున్నా ఇంకా భారతదేశం వర్ధమాన దేశంగా నే పరిగణింపబడడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. అణుశక్తి లోను,అంతరిక్షంలోను భారత్ ముందంజలో ఉంది. మన ఆర్థిక వ్యవస్థ విలక్షణంగా మిశ్రమ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది.

> ఏ దేశమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రజలందరి ఆదాయం వాస్తవంగా పెరగాలి. ఆర్థిక అంతరాలు కనీస స్థాయి కి తగ్గాలి. దేశంలో పేదరికం పోవాలి. అందరికీ ఉపాధి అవకాశాలు లభించాలి. పరిశుభ్రమైన త్రాగునీరు, పౌష్టికాహారం లభించాలి. ప్రజల ఆరోగ్యం మీద దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న విషయం మరువరాదు.

భారతదేశ ఆదాయంలో సుమారు 60 శాతం సేవా రంగానిదే కావడంవిశేషం. బ్యాంకింగ్, టెక్నాలజీ, హోటల్స్, టెలీ కమ్యూనికేషన్ మొదలైనవి సేవా రంగానికి సంబంధించినవి. భారత జి.డి.పిలో వ్యవసాయం సుమారు 18 శాతం కలిగి ఉంది. భారత ఆర్థిక వ్యవస్థలో 13 నుండి 14శాతం వాటాతో తయారీ రంగం గణనీయమైన భూమిక పోషిస్తున్నది. వచ్చే పది సంవత్సరాల్లో భారత్ జి.డి.పిలో తయారీరంగం భాగస్వామ్యం 21 శాతానికి చేరుకుంటుందని ఒక అంచనా. ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా కుదేలైపోతున్న సందర్భంలో భారత్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం విశేషం. దశాబ్దకాలం క్రితం వరకు 10వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టవంతమై, త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకుని మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని, 2030 నాటికి ఏడు ట్రిలియన్ల డాలర్లతో అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు ధీటుగా మారుతుందనే అంచనాలున్నాయి. భారతదేశం ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ తదుపరి స్థానంలో ఉంది. ఐ.ఎమ్.ఎఫ్ డేటా ప్రకారం ఆర్థికపరంగా భారత్ తర్వాత స్థానాలను యునైటెడ్ కింగ్ డమ్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ దేశాలు ఆక్రమించాయి. అమెరికా తలసరిఆదాయం 89 వేల డాలర్లు కాగా, భారత్ తలసరి ఆదాయం కేవలం 2936 యు.ఎస్ డాలర్లు( 2లక్షల 55 వేల రూపాయలు)గా అంచనా వేయబడింది. లగ్జెంబర్గ్, సింగపూర్, ఖతార్, ఐర్లాండ్ నార్వే, స్విట్జర్లాండ్‌లు అధిక తలసరి ఆదాయంతో ధనిక దేశాలుగా పేరొందాయి. రూపాయి విలువలో క్షీణత ఆందోళన కలిగిస్తున్నది.

బ్రిక్స్ దేశాలన్నీ కలసి స్వంత కరెన్సీ రూపకల్పన చేయాలనుకున్నా, ట్రంప్ ఈ దేశాలపై టారిఫ్ పెంచుతూ, తన అక్కసును వెళ్ళగక్కడం ద్వారా బ్రిక్స్ కూటమి ప్రస్తుతానికి తమ ప్రతిపాదనను విరమించుకున్నట్లే కనిపిస్తున్నది.

భారతదేశం ఆర్థికంగా బలోపేతమౌతున్నట్లు కనిపించినా, తలసరి ఆదాయం ఇప్పుడున్న స్థాయిని దాటి రెట్టింపు కాగలిగితేనే దేశం వాస్తవంగా అభివృద్ధి చెందినట్లుగా పరిగణించాలి. పేదరికాన్ని రూపుమాపలేని ఆర్థిక గణాంకాల పెరుగుదల వలన ప్రయోజనం శూన్యం.తలసరి ఆదాయాన్ని బట్టి చూస్తే గతంలో కంటే దేశం ఆర్థికంగా బలంగా ఉన్న మాట వాస్తవం. గతంలో కంటే దేశంలో విద్య,ఉపాధి అవకాశాలు మెరుగుపడిన మాట కూడా వాస్తవమే. ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వచ్చిన మాట సత్య దూరం కాదు. అయితే బ్రతుకు బండి ఎలాగోలా సాగించడం కాదు. ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెరగాలి. వాస్తవ పరిశీలనా దృక్పథంతో విశ్లేషిస్తే,భారతదేశం ఇంకా పేదరికంలోనే ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. విచ్చలవిడిగా పెరుగుతున్న అవినీతి అభివృద్ధి ఫలాలను ప్రజలకు దూరం చేస్తున్నది. కొంతమంది వ్యక్తులు ఆర్థికంగా బలపడినంత మాత్రా న అది అభివృద్ధి కాబోదు. దేశ జి.డి.పి పెరుగుదలలో అవినీతి పరుల భాగస్వామ్యాన్ని, అడ్డదిడ్డంగా పెరుగుతున్న కార్పోరేట్ దిగ్గజాల సంపదను వ్యవకలనం చేస్తే నిజమైన దేశ ఆర్థిక స్వరూపం నిర్ధారణ అవుతుంది.

అయితే ఆర్థిక శాస్త్రవేత్తల సిద్ధాంతాల ప్రకారం జి.డి.పిలో వృద్ధి రేటు,తలసరి ఆదాయం పెరుగుదల ఆయా దేశాల ఆర్థిక అభివృద్ధికి కొలమానంగా భావించడం జరుగుతున్నది. దేశం ఆర్థికంగా బలోపేతమైనంత మాత్రాన ప్రజలంతా ఆర్థికంగా ఎదిగినట్టుగా ఊహించుకోవడం సరి కాదు.సగటు ఆదాయం వ్యక్తుల నిజమైన ఆదాయం కాదు కదా? ఏ దేశమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రజలందరి ఆదా యం వాస్తవంగా పెరగాలి. ఆర్థిక అంతరాలు కనీస స్థాయికి తగ్గాలి. దేశంలో పేదరికం పోవాలి.అందరికీ ఉపాధి అవకాశాలు లభించాలి. పరిశుభ్రమైన త్రాగునీరు, పౌష్టికాహారం లభించాలి.ప్రజల ఆరోగ్యం మీద దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న విషయం మరువరాదు.

ప్రజలను వేధిస్తున్న మరో సమస్య నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం. నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటు ధరల్లోకి తీసుకురావాలి. అన్ని వ్యవస్థల్లో కేన్సర్ లా ప్రబలిపోయిన అవినీతిని పారద్రోలాలి. ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని పెంచాలి.

# మహనీయులకు మతం రంగు... బిజెపి వ్యూహాత్మక ఎత్తుగడలు

రాజకీయ లబ్ది పొందేందుకు బిజెపి ప్రతి అంశాన్ని వాడుకుంటున్నది. నిజం గడప దాటే లోపు అబద్ధం ఊరంతా తిరిగింది అన్న సామెతలా బిజెపి అబద్ధపు ప్రచారం ముందు నిజం మరుగున పడిపోతుంది. ఆ క్రమంలోనే మహానీయులకు మతం రంగు పూస్తున్నది. మనవారు గొప్ప మిగిలినవారు చేసింది ఏమీ లేదన్న ప్రచారంలో బిజెపికి పేటెంట్ ఇవ్వవచ్చునన్న విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో హోంశాఖ మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను తమ వాడిగా ప్రచారం చేసి కోట్లాది రూపాయలతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ విలీనం పటేల్ పాత్రతో మోకాలుకు బోడిగుండుకు ముడివేస్తున్న బిజెపి కమ్యూనిస్టుల వీరోచిత పోరాటాన్ని, అనన్య త్యాగాలను తక్కువ చేసి చూపించేందుకు పటేల్ మరణం తర్వాత ఆయన రాజకీయ రంగు మార్చే ప్రయత్నం చేసింది. ఇప్పుడు ఛత్రపతి శివాజీకి మతం రంగు పులుముతున్నారు.

ఛత్రపతి శివాజీని హిందువు ల ప్రతినిధిగా చూపుతూ ఆయన జయంతి ఉత్సవాలను బిజెపి శ్రేణులు నిర్వహించాయి. కాషాయి పతకాలతో పట్టణాలలో ఒక హడావుడి చేసే ప్రయత్నం చేసింది. ముస్లిం నవాబులకు వ్యతిరేకంగా పోరాడిన ఛత్రపతి శివాజీ మత పక్షపాతిగా వ్యవహరించలేదని అనేక చారిత్రిక సాక్ష్యాలు తెలుపుతున్నా యి. ముస్లిం రాజులపై విజయం సాధించిన తర్వాత కూడా పర మత స్త్రీలను గౌరవించడంతో పాటు అనేక అంశాలు రుజువు చేస్తున్నాయి. శివాజీ హిందువు కావచ్చు కానీ పరమత ద్వేషి కాదన్న చారిత్రిక ఘటనలు తెలుపుతున్న శివాజీకి మతం రంగు పూయడం బిజెపికి అవసరం. బిజెపి మతం మాటున రాజకీయ లబ్ది పొందేందుకు అన్ని వనరులను వినియోగించుకుంటున్నది. ఆ క్రమంలోనే ప్రతి ఘటనను మతం వైపు తిప్పుతుంది.

దేశంలోని ప్రధాన సమస్యలన్నింటిని భక్తి కార్యక్రమాలతో మరుగునపడేలా చేస్తుంది. సోషల్ మీడియా తో పాటు, తన కార్పొరేట్ అనుకూల మీడియాతో అబద్ధపు ప్రచారాలను, అసత్యాలను పదేపదే వల్లెవేయడం ద్వారా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తుంది. కొన్ని ప్రాంతాలలో కొన్ని ఘటనలకు సంబంధించి బిజెపి సానుకూల ఫలితాలు పొందడంతో ఇప్పుడు ప్రతి ఘటనకు మతం రంగు పులుముతుంది. దేశ ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కుదేలైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగం, వట్టిపోతున్న ఉపాధి కల్పన రంగం, పెరిగిన నిరుద్యోగం, అవినీతి వీటన్నింటిని ఒక్క భక్తి కార్యక్రమాలతో అప్రధానం చేస్తుంది. ఉదాహరణకు 40 రోజుల పాటు జరిగిన కుంభమేళాతో మొత్తం జనం దృష్టిని ఆ వైపుకు తిప్పడంలో సఫలీకృతం కావడంతో పాటు గంగలో మునిగితే సర్వ సమస్యలు పరిష్కారమవుతాయన్న భావాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తుంది. ప్రజల మెదళ్లను తన అనుకూ ల భావజాలంతో నింపే ప్రయత్నం చేస్తున్నది.

భారతదేశంలో హిందు జనాభా అధికంగా ఉండడంతో మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన బిజెపి రాజకీయాలు చేస్తున్నది. మెజార్టీ మతాన్ని తమ వంతుగా చెప్పుకోవడం ద్వారా ఎన్నిక ల్లో లబ్ది పొందుతున్నది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పాటే ఆధ్యాత్మికత పెరుగుతుంది.

నమ్మకానికి, మూఢనమ్మకానికి, మతానికి, మతోన్మాదానికి ఉన్న తేడాను గ్రహించడంలో విఫలమవుతున్నాం. కుల మతాల ఉచ్చులో మంచి, చెడును గుర్తించినా చెడును చెడు అనలేకపోవడంతో ఆ బలహీనతను మత, కుల సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఆ క్రమంలో నే శతాబ్దాలు, దశాబ్దాల తర్వాత మహానీయులకు మతం రంగు పులుముతున్నారు. ఇది భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారక ముందే ప్రజలు అప్రమత్తం కావాలి. ప్రజా చైతన్యం మాత్రమే ఇటువంటి వాటికి చెక్ పెట్టగలదు.

**ఏనుగు వెంకటేశ్వరరావు,** ఖమ్మం.

# వివక్షలేని సమాజ స్థాపన అసాధ్యమా!

ప్రపంచవ్యాప్తంగా వివక్ష కోరలు చాచింది. నువ్వు తక్కువ కులం వాడివి, నువ్వు కర్రెగా ఉన్నావు, నువ్వు దొడ్డుగా ఉన్నా వు, నువ్వు పేదోడివి, నువ్వు అబలవు లాంటి వివక్ష వచనాలు మన నిత్యజీవితంలో తరుచుగా ఉంటాం. కుల, మత, వర్గ, వర్ణ, జాతి, లింగ, హెచ్ఐవి/ఏయిడ్స్ అనారోగ్య వివక్ష లు నేటి డిజిటల్ యుగంలో కూడా కొనసాగడం విచారకరం. విశ్వవ్యాప్తంగా విస్తరించిన వివక్ష విష వృక్షాలను కూకటివేళ్ల తో పెకిలించడానికి యుఎన్ఏఐడిఎస్ నేతృత్వంలో 2014 నుంచి ప్రతి ఏట 01 మార్చిన జీరో డిస్క్రిమినేషన్ డే లేదా శూన్య వివక్ష దినం లేదా వివక్ష రహిత దినం పాటించుట ఆనవాయితీగా మారింది.

**శూన్య వివక్ష దినం–2025 ఇతివృత్తం:** 2025 శూన్య వివక్ష లేదా వివక్ష రహిత దినం ఇతివృత్తంగా వి స్టాండ్ టుగెదర్ లేదా మనం ఐక్యతతో నిలబడదాం అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. విశ్వమానవాళి చేయి చేయి కలిపి మానవ హారం పడుతూ వివక్ష భావనలను మంట కలపడానికి కృషి చేయాలి. పక్షపాతాలు, సామాజిక కంళంకాలు, అన్యాయాలకు వ్యతిరేకంగా కూడా ప్రచారం చేయడం జరుగుతుంది. వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు, ఎన్జీవో సంస్థలు, యువజన సంఘాలు లాంటివి పరస్పర సహకారంతో ముందుకు సాగితే వివక్ష తొలగి పోవడం జరుగుతుంది.

**శూన్య వివక్ష సమాజ స్థాపనకు మార్గాలు:** శూన్య వివక్ష దినం వేదికగా అన్ని వర్గాల పౌరులను గౌరవంగా చూసుకోవ డం, మానవ హక్కులను కాపాడుకోవడం, మర్యాదలను నిలుపుకోవడం, పని ప్రదేశాల్లో వివక్ష, విద్య/ఆరోగ్య,/ఉద్యోగాల్లో అసమానతలు, లింగ అసమానతలను చెరిపేయడం, వివక్ష నిర్మూలన చట్టాలను కఠినంగా అమలుచేయడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది.

వివక్ష అనే దురాచారాల పట్ల అవగాహన కల్పించడం, సమానత్వ భావనలను కాపాడడం, అన్ని వర్గాల ప్రజలను జాగృత పరచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది.

పౌర సమాజాన్ని జాగృత పరచి శూన్య వివక్ష లేదా వివక్ష రహిత ప్రపంచ మానవ సమాజాన్ని సృష్టించుకుందాం, వివక్షకు వ్యతిరేకంగా గళాలను వినిపిద్దాం.

**(01 మార్చి శూన్య వివక్ష దినం సందర్భంగా)**

# రైతులపై బిజెపి ప్రతీకార ధోరణి

కనీస మద్దతు ధరకు 'చట్టపరమైన గ్యారంటీ' ఇవ్వాలి – కాంగ్రెస్ నేత అభయ్ దూబే డిమాండ్





**న్యూఢిల్లీ :** కేంద్రంలో సారథ్యం వహిస్తున్న బిజెపి ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న మొండివైఖరిపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన గ్యారంటీని ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మరోసారి డిమాండ్ చేసింది. దేశంలోని రైతులకు వ్యతిరేకంగా బిజెపి 'ప్రతీకారంతో' పనిచేస్తున్నదని ఆరోపించింది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరను ఖరారు నిర్ణయించాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. మద్దతు ధర పారదర్శకంగా, ప్రభావవంతంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఒక కమిటీని నియమించిందని కాంగ్రెస్ నాయకుడు అభయ్ దూబే గుర్తుచేశారు. ఫిబ్రవరి 22 వరకు ఈ కమిటీ ఏడుసార్లు సమావేశాలు, 39సార్లు సబ్‌కమిటీ సమావేశాలు నిర్వహించిందని తెలియజేశారు. ఒకవైపు ఈ దేశానికి చెందిన వ్యవసాయ శాఖ మంత్రి ఫిబ్రవరి 22న విమానంలో భోపాల్ నుంచి ఢిల్లీకి వెళ్లే ప్రయాణంలో విమానంలో సీటుపై కూర్చోడానికే చాలా ఇబ్బంది పడ్డారని సోషల్ మీడియాలో హంగామా సృష్టిస్తున్నారని, మరోవైపు రైతులు గత కొన్నేళ్లుగా బాధపడుతున్నా వారి గురించి ఎవరూ మాట్లాడటం లేదని ఆయన ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక ధోరణిని అనుసరిస్తున్నదని దూబే ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇవ్వాల్సిన బోనస్‌లను నిలిపివేశార, భూమి హక్కులను తొలగించే ప్రక్రియను ప్రారంభించారని, ఖర్చుకు 50శాతం కనీస మద్దతు ధరను చెల్లించడానికి తిరస్కరించారని అభయ్‌దూబే విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్నదని, తొలుత రైతుల భూమి హక్కులను లాక్కోవడానికి ఆర్డినెన్స్‌లను తెచ్చిందని, ఆపైన వ్యవసాయానికి సంబంధించి క్రూరమైన నల్ల చట్టాలను రూపొందిస్తూ రైతుల మార్గంలో ముళ్లు, రాళ్లు, గోళ్లు వేస్తున్నదని. వారు తలనిండా అహంకారాన్ని నింపుకుని పంటలకు ధరపై చట్టపరమైన హక్కులను కోరినప్పుడల్లా తేదీల తర్వాత తేదీలు ఇస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని అభయ్‌దూబే ఆరోపించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వ్యవసాయంపై తన నివేదిక (202425)ను డిసెంబరు 17, 2024న హౌస్‌కు సమర్పించిందని, ఈ నివేదికలో 2024 నవంబర్ 13సమావేశాన్ని ఉటంకిస్తూ ఒక వేళ రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చినా వారు ప్రయోజనం పొందలేరని ఆ నివేదికలో స్పష్టంగా వెల్లడించారని దూబే చెప్పారు.స్వామినాథన్ కమిటీ సి2+50 శాతం మద్దతు ధరను ఇవ్వాలని చేసిన సిఫారసును అమలు చేయలేదని పార్లమెంటరీ కమిటీ కూడా స్పష్టం చేసిందని ఆయన తెలియజేశారు. సోయాబీన్‌ను రెండు ప్రధాన రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఆ రెండు రాష్ట్రాలని వివరించారు. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో రైతులు పండించిన సోయాబీన్‌కు క్వింటాల్‌కు రూ.4,892 లభిస్తుందని హామీ ఇచ్చినప్పటికీ దానికంటే తక్కువ మద్దతు ధరమాత్రమే లభిస్తున్నదని కాంగ్రెస్ నేత అభయ్‌దూబే ఆరోపించారు. వ్యవసాయం ఖర్చును ప్రధానమంత్రి మోదీ రూ.25,000కు పెంచారన్నది వాస్తవమని దూబే నిందించారు.

## రైతుల నిరసన పిటిషన్ల విచారణ

# 'మార్చి 19 తర్వాతే'



**న్యూఢిల్లీ :** తమ పంటలకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీ సహా పలు డిమాండ్లను లేవనెత్తి ఆందోళన కొనసాగిస్తున్న రైతులు, కేంద్రం మధ్య రెండు రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ రైతుల నిరసన కొనసాగించడాన్ని విభేదించిన సుప్రీంకోర్టు శుక్రవారం ఈ అంశంపై విచారణను మార్చి 19తర్వాతకు వాయిదావేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మార్చి 19న మూడవ విడత చర్చలు జరపాల్సిన నేపథ్యంలో విచారణను మార్చి 19తర్వాతకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. రైతు నాయకుడు జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ కు వైద్య సహాయం అందించని పంజాబ్ ప్రభుత్వ అధికారులపై కోర్టు ధిక్కారణ చర్య కోరుతూ దాఖలైన పిటిషన్లు సహా పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టాల్సి ఉన్నది. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్‌సింగ్ మాట్లాడుతూ సమావేశంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు పాల్గొన్నారని చెప్పారు. రైతుల ఆందోళనకు వేదికను ఏర్పాటు చేయడం, ఆందోళన కొనసాగిస్తున్న రైతుల సమస్యలను వినడం, కమిటీ మధ్యంతర నివేదికను అందజేసినందుకు అత్యున్నత న్యాయస్థానం నియమించిన హైపవర్ కమిటీ పనితీరును ధర్మాసనం ప్రశంసించింది. సకాలంలో తన నివేదికను అందించిన కమిటీ జస్టిస్ (రిటైర్డ్) చైర్మన్ నవాబ్ సింగ్, ఇతర సభ్యులకు గౌరవవేతనం ఖరారు చేసే నివేదికను ధర్మాసనం తన వద్దే ఉంచుకుంది. నిరసన తెలుపుతున్న రైతుల మనోవేదనలకు పరిష్కారాన్ని సమర్థవంతంగా చూపించే ఉద్దేశంతో 2024 సెప్టెంబరులో అత్యున్నత న్యాయస్థానం ఒక కమిటీని ఏర్పాటుచేసింది. జనవరి 22న డల్లేవాల్ తన నిరాహారదీక్షను విరమించకుండా కొనసాగించడాన్ని గుర్తించిన తర్వాత పంజాబ్ ప్రభుత్వ అధికారులపై కోర్టు ధిక్కారణ చర్యను కోరుతూ దాఖలైన పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం ఉపసంహరించుకుంది. నిరసన కొనసాగిస్తున్న రైతులను కేంద్ర ప్రతినిధులు కలిసిన తర్వాత మరో సమావేశాన్ని ఛండీగఢ్‌లో నిర్ణయించారని ధర్మాసనం పేర్కొంది. జనవరి 15న సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిరాహారదీక్ష కొనసాగిస్తున్న రైతు నేత ఆరోగ్యస్థితిని తెలియజేయాలని కోరింది. 2024 నవంబరు 26 నుంచి ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్న డల్లేవాల్ సంయుక్త కిసాన్ మోర్చా(నాన్ పొలిటికల్) కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో పంజాబ్ ప్రభుత్వం ఆయనకు వైద్యసహాయం అవకాశం కల్పించినప్పటికీ ఆయన తిరస్కరించారు. రైతులు తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీ సహా పలు డిమాండ్లపై సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) బ్యానర్ల కింద 2024 ఫిబ్రవరి 13నుంచి పంజాబ్‌హర్యానా రాష్ట్రాల పరిధి శంభు, ఖనౌరి సరిహద్దు కేంద్రాల వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు.

## ఎస్‌సి కమిషన్‌లో పోస్టులు భర్తీ చేయండి

**న్యూఢిల్లీ:** జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేసి దళితుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని ప్రధాని మోదీని కోరారు. పోస్టులను ఖాళీగా ఉంచడమంటే... అది బిజెపి ప్రభుత్వ దళిత వ్యతిరేకమన్న భావనను స్పష్టం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎస్‌సి కమిషన్ ఓ రాజ్యాంగ సంస్థ అని, దాన్ని బలహీనపరచడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే అని, దళితుల సామాజిక హక్కుల్ని కాలరాసినట్లు అవుతుందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.ఎస్‌సి కమిషన్‌లో అధికారులు లేకుంటే ఫిర్యాదులపై ఎవరు చర్యలు తీసుకుంటారని అడిగారు. తక్షణమే పోస్టులను భర్తీ చేయాలని, అప్పుడే ఆ సంస్థ సమర్థవంతంగా పని చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ కమిషన్ అధిపతిగా కిషోర్ మక్వానా ఉన్నారు. వైస్ చైర్మెన్, ఓ సభ్యుడి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## వికటన్ వెబ్‌సైట్ బ్లాక్

**చెన్నై:** తమిళ మీడియా సంస్థ వికటన్ వెబ్‌సైట్‌ను కేంద్రం బ్లాక్ చేసింది. న్యాయ పోరాటం చేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య భేటీ జరగగా... ట్రంప్ వద్ద మోదీ సంకెళ్లతో కూర్చుకున్నట్లు వికటన్ వెబ్‌సైట్ ఓ కార్టూన్ వేసింది. ఈ నెల 10న ఆ కార్టూన్‌ను ప్రచురించారు. 15వ తేదీ నుంచి ఆ వెబ్‌సైట్ అందుబాటులో లేదని వికటన్ సంస్థ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొంది. కేంద్ర సమాచార, ప్రసారశాఖ తీసుకున్న నిర్ణయం వల్ల వెబ్‌సైట్ బ్లాక్ అయినట్లు వికటన్ తెలిపింది. సమాచారం ఇవ్వకుండానే సైట్‌ను బ్లాక్ చేశారని వెల్లడించింది. ఈ నెల 20న విచారణ చేపట్టారు. భావ స్వేచ్ఛతో ఆ కార్టూన్ వేసినట్లు విచారణ సమయంలో వికటన్ తన వాదన సమర్థించుకుంది. వెబ్‌సైట్ బ్లాక్ చేసిన అంశంలో న్యాయ నిపుణుల అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు వికటన్ పేర్కొంది. తిరిగి వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని ఆ సంస్థ తెలిపింది.

## తొక్కిసలాటపై పిటిషన్... 'సుప్రీం' తిరస్కరణ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటపై విచారణ జరపాలంటూ ఆనంద్ లీగల్ ఎయిడ్ ఫోరం ట్రస్టు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. మరణాల సంఖ్య రైల్వే శాఖ దాచిపెడుతున్నట్లు పిటిషన్‌లో ఆరోపించింది. అయితే విచారణ అనంతరం శుక్రవారం సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం రైల్వే స్టేషన్ తొక్కిసలాటలో సుమారు 200 మంది మరణించినట్లు పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ సమయంలో... మీరు చెప్పిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందా అని సుప్రీంకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. 200 మరణాలు సంభవించినట్లు చెబుతున్నారు... దానికి ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని నిలదీసింది. కొంత సమయం విచారణ జరిగిన తర్వాత కోర్టు ... ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించే వరకు వేచి చూద్దామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా, ఈ నెల 15న న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో కుంభమేళాకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఒక్కసారిగా ఫ్లాట్‌ఫాంపైకి రావడంతో ఆ తొక్కిసలాట జరిగింది. ఆ ఘటనలో సుమారు 18 మంది మరణించారు.

## జనాభా ఆధారంగా పునర్విభజన వద్దు: స్టాలిన్

**చెన్నై:** కేవలం జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ సీట్లను నిర్ణయించొద్దని సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని కోరారు. అలాంటి ప్రయత్నం ఏదైనా జరిగితే దాన్ని వ్యతిరేకిస్తామని అన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించే ప్రక్రియ ద్వారా తమ రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. తమ డిమాండ్ స్పష్టంగా ఉందని, కేవలం జనాభా ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరపవద్దు అని, జనాభా నియంత్రణకు దక్షిణా రాష్ట్రాలు తీవ్ర చర్యలు తీసుకున్నాయని, ఇప్పుడు సరిహద్దులు పునర్విభజన ద్వారా ఆ రాష్ట్రాలను శిక్షించవద్దు అని స్టాలిన్ తన 72వ పుట్టిన రోజు సందర్భంగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తమిళ భాష, సంస్కృతిని కాపాడుకునేందుకు కూడా పోరాటం చేస్తానన్నారు.

## ముంబయిలోని హైరైజ్‌లో మంటలు



**ముంబయి :** దక్షిణ ముంబయిలోని బైకుల్లా ప్రాంతంలోని హైరైజ్‌లో శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో 57 అంతస్తుల నివాస భవనం పై అంతస్తులలో చిక్కుకున్న 50 మందికి పైగా ప్రజలను రక్షించినట్లు అధికారులు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రోడ్డులోని సాలెట్ 27 జంట భవనాల్లో ఒక దానిలోని 42వ అంతస్తులో ఉదయం 10.45 గంటల ప్రాంతంలో సంభవించిన మంటల్లో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక దళ అధికారి ఒకరు తెలిపారు. అగ్నిమాపక దళం, ముంబై పౌర యుటిలిటీ బెస్ట్, పోలీసులు, 108 అంబులెన్స్ సేవలు, ఇతర సంస్థల బృందాలు వెంటనే రంగంలోకి దిగాయని, మంటలకు గల కారణం ఇంకా తెలియలేదని ఒక అధికారి తెలిపారు. రెండున్నర గంటలకు పైగా శ్రమించిన తర్వాత, అగ్నిమాపక దళం మధ్యాహ్నం 1.10 గంటల ప్రాంతంలో ఆ భవనంలోని 42వ అంతస్తులో మంటలను అదుపులోకి తెచ్చిందని ఆయన తెలిపారు. భవనం భద్రతా సిబ్బంది సహాయంతో భవనం పై అంతస్తుల్లో చిక్కుకున్న 50 నుండి 60 మందిని కూడా వారు రక్షించారని అధికారి తెలిపారు. 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న గదిలో విద్యుత్ వైర్లు, ఫర్నిచర్, ఇతర సామగ్రికే మంటలు పరిమితమయ్యాయి.

## 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు



**న్యూఢిల్లీ :** స్పేడెక్స్ ప్రయోగాలు మార్చి 15 నుంచి చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వి.నారాయణన్ వెల్లడించారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహం దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంది. వివిధ ప్రయోగాలు చేపట్టేందుకు రెండు నెలల్లో 10 నుంచి 15 రోజుల అనుకూల సమయం లభిస్తుంది. ప్రస్తుతం వాటిని విడదీసి, రీడాకింగ్ చేసేందుకు అనుకరణ ప్రయోగాలు చేస్తున్నాం. ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం అని ఇస్రో ఛైర్మన్ వి.నారయణన్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మార్చి 15 నుంచి ఈ ప్రయోగాలను చేపడతామన్నారు. ఉపగ్రహాల్లో తగినంత ఇంధనం ఉందని.. తదుపరి అనేక ప్రయోగాలు చేయాలనుకుంటున్నామని ఇస్రో చీఫ్ వెల్లడించారు. అంతేకాదు, రెండు నెలల తర్వాత వచ్చే అనుకూల సమయంలోనూ మూడో దశ ప్రయోగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డాకింగ్, దృఢత్వ ప్రయోగాల అనంతరం రెండు ఉపగ్రహాల మధ్య విద్యుత్ శక్తి బదిలీ ప్రయోగాలు చేయాలనే ప్రణాళికలు వేసుకున్నట్లు ఇస్రో గతంలోనే చెప్పింది. ఇదిలా ఉంటే, అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌ను ఇస్రో చేపట్టింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ (స్పేడెక్స్) విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది.

## మసీదుపై ఆత్మాహుతి దాడి!

ఐదుగురు మృతి.. 20 మందికి గాయాలు

పాకిస్తాన్ ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో ఘటన

**పెషావర్:** పాకిస్తాన్‌లోని ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన బాంబు పేలుడు ఘటనలో కనీసం ఐదుగురు మృతి చెందగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఫలితంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ఆత్మహుతి దాడిగా అధికారులు భావిస్తున్న ఈ ఘటనలో జమైత్ ఉలెమా ఇస్లామ్ (జెయుఐ) చీలిక వర్గం నాయకుడు హమీదుల్ హక్ హక్కానీ మృతి చెందాడు. అకోరా ఖట్టాక్ పట్టణంలోని మదర్సా–ఎ–హక్కానీ కేర్‌టేకర్‌గా కూడా వ్యవహరిస్తున్న హమీదుల్ హక్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ దాడి జరిగినట్టు అధికారులు భావిస్తున్నారు. అతనిని హతమార్చడానికి మసీదులో ఆత్మాహుతి దాడి జరిగిందని ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. జెయుఐ చీఫ్ మౌలానా సమీ ఉల్ హక్ మృతి తర్వాత, సైమీ వర్గానికి హమీదుల్ హక్ నాయకుడయ్యాడు. అతనికి ఆరుగురు భద్రతా సిబ్బందితో రక్షణ ఏర్పాట్లు చేసినట్టు ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జుల్ఫికర్ హమీద్ మీడియాకు తెలిపారు. దాడిలో మృతుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ప్రకటించారు. ఇలావుంటే, 2021లో అఫ్ఘానిస్థాన్ పాలనా అధికారాన్ని తాలిబన్లకు అప్పగించిన అమెరికా సైన్యం వెనుదిరిగినప్పుడు, ఆయుధాలను అక్కడే విడిచిపెట్టిందని పాకిస్తాన్ గుర్తుచేసింది. ఆ ఆయుధాలతో తాలిబన్ ఉగ్రవాద మూకలు దాడులకు పాల్పడుతున్నాయని పాకిస్తాన విదేశాంగ కార్యాలయ అధికార ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ విమర్శించారు. పాకిస్తాన్‌లో ఎక్కువ శాతం ఉగ్రదాడుల్లో అత్యధికంగా, అఫ్ఘాన్‌లో అమెరికా వదలిన ఆయుధాలనే వాడుతున్నట్టు తెలిపారు.

## ఆయుధాల అప్పగింతకు ఇదే చివరి అవకాశం..

గడువు పొడిగించిన మణిపూర్ గవర్నర్

**ఇంఫాల్:** మణిపూర్ ప్రజలు ఆయుధాలను అప్పగించేందుకు రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా చివరి అవకాశం ఇచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆయుధాలు అప్పగిస్తుండటంతో గడువును పొడిగించారు. ఫిబ్రవరి 20 నుంచి అమలులోకి వచ్చిన వారం రోజుల గడువు గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును మార్చి 6 సాయంత్రం 4 గంటల వరకు గవర్నర్ పొడిగించారు. కొండ, లోయ ప్రాంతాల ప్రజలు అదనపు సమయం కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 'స్వచ్ఛందంగా ఆయుధాలను అప్పగించడానికి ఏడు రోజుల గడువు ముగిసింది. ఈ వ్యవధిని పొడిగించాలని లోయ, కొండ ప్రాంతాల ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. కాగా, పొడిగించిన గడువులోగా భద్రతా దళాల నుంచి దోచుకున్న, చట్టవ్యతిరేకంగా కలిగి ఉన్న ఆయుధాలను అప్పగించే వారిపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని గవర్నర్ అజయ్ కుమార్ భల్లా మరోసారి భరోసా ఇచ్చారు.మరోవైపు 2023 మే నుంచి మణిపూర్‌లోని మైతీ, కుకీ జాతుల మధ్య ఏడాదిన్నర కాలం పైగా ఘర్షణలు కొనసాగాయి. ఫిబ్రవరి తొలి వారంలో సీఎం ఎన్ బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను కేంద్రం విధించింది.

## అణగారిన వర్గాలకూ 'న్యాయం' అందాలి

ఎన్ఎఫ్ఎస్‌యు 3వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు రాష్ట్రపతి ముర్ము ఉద్బోధ




**గాంధీనగర్ :** తాము పట్టుబడి శిక్షించబడతామనే భయం నేరస్తుల మధ్య నెలకొల్పడం, తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం సామాన్యప్రజలలోనెలకొనడం సుపరిపాలన మనుగడకు గీటురాళ్లని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. భారతీయ న్యాయ సంహిత కొత్త చట్టాలను ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో ఒక సరికొత్త ఉద్యమ ఘట్టం అని, సమర్థవంతంగా అమలు జరిగినప్పుడే న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉన్నదనే భావన కలుగుతుందని రాష్ట్రపతి నొక్కిచెప్పారు. గాంధీనగర్‌లో శుక్రవారం జరిగిన నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ( ఎన్ఎఫ్ఎస్‌యు) మూడవ స్నాతకోత్సవ కార్యక్రమంలో ద్రౌపది ముర్ము ప్రసంగించారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవ్వ్రత్. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పాటిల్ హాజరైన ఈ కార్యక్రమంలో ముర్ము ప్రసంగిస్తూ మనదేశంలో న్యాయం ఆధారంగా నిర్మితమైన సామాజిక వ్యవస్థ ఎంతో ఉత్తమమైనదని చెప్పక తప్పదని ఆమె అన్నారు. ఆర్థిక కారణాల వల్ల న్యాయం జరుగదనే అపోహలు ఎవరిలోనూ తలెత్తకుండా చూడాలని ఎన్ఎఫ్ఎస్‌యు నుంచి గ్రాడ్యుయేట్లు అయిన విద్యార్థులను ఆమె కోరారు. మీరు దేశంలోని చివరి వ్యక్తికి కూడా న్యాయం అందేలా పనిచేయాలని రాష్ట్రపతి విద్యార్థులకు ఉద్బోధించారు. న్యాయం ఆధారంగా నిర్మితమైన సాంప్రదాయం, అభివృద్ధి కలయికతో కూడిన అభివృద్ధి చెందిన దేశం నిర్మాణ ప్రక్రియలో మేం భాగస్వాములై ఉన్నాం అనే బలమైన ఆలోచనను కలిగిఉండాలి. సమాజంలోని అన్నివర్గాలకు న్యాయం అందుబాటులో ఉండేలా కృషిచేయాలి. ప్రత్యేకించి అణగారిన వర్గాలకు న్యాయం దక్కడంలో మా పాత్ర తప్పక ఉండాలన్న విశాల దృక్పథంతో యూనివర్సిటీ నుంచి పట్టభద్రులుగా బయటకు వెళుతున్న తరుణంలో విద్యార్థులు కలిగి ఉండాలి అని ముర్ము సూచించారు. నూతన క్రిమినల చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ) గురించి రాష్ట్రపతి ఈ సందర్భంగా విద్యార్థులకు విపులీకరించారు. బ్రిటీష్‌కాలం నాటి చట్టాల స్థానంలో ఈ సరికొత్త చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. న్యాయం డెలివరీ విధానంలో ఈ నూతన క్రిమినల్ చట్టాలను ప్రవేశపెట్టడం భారతదేశంలో సరికొత్త ఉద్యమ ఘట్టం అని అభివర్ణించారు. ఈ నూతన క్రిమినల్ చట్టాల ద్వారా నేర విచారణ, సాక్ష్యం సంబంధిత మార్పులు అనేకం చోటుచేసుకున్నాయని ద్రౌపది ముర్ము తెలియజేశారు. పటిష్ట ఫోరెన్సిక్ విధానం రూపొందించడంలో ఎన్ఎఫ్ఎస్‌యు పాత్ర ఎంతో కీలకమైనదన్న విశ్వాసం ఏర్పడిందన్నారు. నేరస్తులు నేరాలకు పాల్పడాలంటే భయపడేలా శిక్షల రేటు పెరగడంలో ఎన్ఎఫ్ఎస్‌యు పటిష్ట ఫోరెన్సిక్ విధానాన్ని రూపొందించడం అభినందనీయం అన్నారు. యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ జెఎం.వ్యాస్ 1560మంది విద్యార్థులకు పైగా డిగ్రీలను ప్రదానం చేశారు. వీరిలో 70మంది విదేశీ విద్యార్థులు కూడా ఉన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్ బడ్జెట్ రూ.3,22,359 కోట్లు



**అమరావతి:** రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం రూ.3.22,359 కోట్లతో 2025–26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టారు. తొలుత ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏర్పాటైన మంత్రివర్గ సమావేశం బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. అనంతరం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ పత్రాలు అందజేశారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీలో పయ్యావుల కేశవ్, శాసనమండలిలో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. రూ.48,341.14 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు విడిగా ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,51,162 కోట్లు, మూలధన వ్యయం అంచనా రూ.40,635 కోట్లు, రెవెన్యూ లోటు రూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ వ్యయం 2,24,342 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.24,072 కోట్లు, రెవెన్యూలోటు రూ.48,311 కోట్లు. ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.73,362 కోట్లు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.01 శాతంగా, ద్రవ్యలోటు 4.57 శాతంగా ఉన్నాయి. ప్రస్తుత బడ్జెట్ అంచనాల్లో జీఎస్డీపీలో రెవెన్యూలోటు 1.82 శాతంగా, ద్రవ్యలోటు 4.38 శాతంగా ఉండవచ్చునని అంచనా వేసింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసకర పరిస్థితుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఎంతో క్లిష్టతరమైన అంశంగా పరిగణిస్తున్నామని మంత్రి పయ్యావుల అన్నారు. ఆంధ్రప్రదేశ్ రుణ సామర్థ్యం సున్నాకు చేరుకుందని, దేశంలోనే అప్పు తీసుకునే వీలు లేని ఏకైక రాష్ట్రంగా మిగిలిందన్నారు. ఈ పరిస్థితుల్లో బడ్జెట్‌ను ఎలా రూపొందించాలని తలలు పట్టుకుంటున్న స్థితిలో... ముఖ్యమంత్రి చంద్రబాబు ధైర్యం చెపుతూ 'అణుదాడిలో విధ్వంసమైన హిరోషిమా నగరం లేచి నిలబడగా లేనిది... ఆర్థిక విధ్వంసానికి గురైన ఏపీని తిరిగి నిలబెట్టలేమా' అని చెప్పిన మాటల స్ఫూర్తితో ఈ బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. వృద్ధిరేటును 15 శాతానికిపైగా సాధించడం, తలసరి ఆదాయాన్ని పెంచడం, పేదరికాన్ని రూపుమాపడం ద్వారా అభివృద్ధి ఫలాలను అత్యంత అణగారిన వర్గాలకు అందించడమే లక్ష్యంగా బడ్జెట్ కూర్పు చేసినట్లు వెల్లడించారు. అప్పులు చేయడమే తప్ప, వాటిని తీర్చడం పూర్తిగా మరిచిన గత ప్రభుత్వ తప్పుడు విధానాలను సరిచేస్తున్నామన్నారు. వీటిలో ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గత ఏడాది జూన్ 12 నాటికి దాదాపు రూ.23,556 కోట్లు బకాయిలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిలిపివేయగా, వాటికి మ్యాచింగ్ గ్రాంట్‌గా చెల్లించాల్సిన రూ.99,371 కోట్ల బకాయిలు చెల్లించి వాటిలో 74 పథకాలను పున:ప్రారంభించామన్నారు. ఇవిగాక నీటిపారుదల, రహదారులకు సంబంధించిన రూ.12,735 కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీల బలోపేతం కోసం రూ.2,793 కోట్ల నిధులను, ఎన్టీఆర్ భరోసా, ఎన్టీఆర్ వైద్య సేవ, దీపం 2.0 పథకాలకు రూ.31,613 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఇక రాష్ట్రానికి అత్యంత కీలకమైన అమరావతి, పోలవరం ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వ సహకారంతో మళ్లీ పట్టాలెక్కించామన్నారు. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్థిక వృద్ధి మళ్లీ గాడిన పడింది. 2024–25 ఆర్థిక సంవత్సరపు మొదటి ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తి 12.94 శాతం వృద్ధి చెందింది. కీలకమైన అన్ని రంగాలు బలం పుంజుకున్నాయి. వీటి లో వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.86 శాతం, పరిశ్రమలు 6.71 శాతం వృద్ధి సాధించగా, సేవల రం గం 11.70 శాతం వృద్ధి సాధించగలిగాయని వివరించా రు. గతంలో రూ.3వేలు ఉండే సామాజిక పెన్షన్‌లను రూ.4 వేలకు పెంచి ఇస్తున్నాం. పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేశాం. దీపం 2.0 పథకం కింద ఉచితంగా సిలెండర్లు పంపిణీ, అర్చకులు, ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం పెంపు, మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ నియామకాలకు శ్రీకారం చుట్టడం వంటివి చేపట్టామన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చెప్పినట్లుగా వ్యవసాయం గాడి తప్పితే మరేదీ సక్రమంగా సాగడానికి అవకాశముండదన్న మాటలను సీరియస్‌గా పరిగణించి ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి కేటాయింపులు చేశామని తెలిపారు. మహిళలుమహారాణులు అని నమ్మే తమ ప్రభుత్వం దీపం 2.0 పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రతి తల్లి తన పిల్లలను పాఠశాలకు పంపేలా వారిని ప్రోత్సహించే లక్ష్యంతో మరో సూపర్ సిక్స్ హామీలో భాగంగా 2025–26 విద్యాసంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించి 1 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. ఇందుకోసం చంద్రబాబు నాయకత్వంలో అందరం మనవంతు తోడ్పాటునందించి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనను సాకారం చేసుకుందామని మంత్రి పయ్యావుల కోరారు.

## బస్సులో అత్యాచార ఘటన

# నిందితుడి అరెస్టు



**పూణే:** మహారాష్ట్రలోని పూణేలో అత్యంత రద్దీగా ఉండే బస్‌స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో పార్కింగ్ చేసిన బస్సులో 26 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఘటన జరిగిన 75 గంటల్లో నిందితుడు రామ్‌దాస్ (36)ను పోలీసులు పట్టుకొన్నారు. శ్రీరూర్‌లోని చెరుకు తోటలో రామ్‌దాస్ దాక్కున్నట్లు సమాచారం అందడంతో డ్రోన్లు, జాగిలాలతో పోలీసులు గాలించారు. నిందితుడి ఫొటోను విడుదల చేసి... ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష రివార్డును ప్రకటించారు. ఈక్రమంలో గురువారం అర్ధరాత్రి నిందితుడికి ఆకలేసి ఒక ఇంటికి వెళ్లగా... ఆ ఇంట్లోని వ్యక్తి నిందితుడిని గుర్తుపట్టి పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకొని రామ్‌దాస్‌ను అరెస్టు చేశారు. పూణేలోని స్వర్‌గేట్ బస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కాగా పోలీసుల దర్యాప్తులో నిందితుడి గురించి కీలక విషయాలు వెల్లడయ్యాయి. నిందితుడు రామ్‌దాస్ నేర స్వభావం కలవాడని... అనేక చోరీలకు పాల్పడినట్లు తేలింది. 2019లో ఓ ట్యాక్సీ కొనుగోలు చేసినప్పటినుంచి పూణేఅహల్యానగర్ మార్గంలో తిప్పుతున్నాడు. అయితే అప్పటినుంచి అతడు నగలతో కనిపించిన వద్ధులను తన ట్యాక్సీలో ఎక్కించుకొని, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి వారిని బెదిరించి... నగలు, డబ్బు దోపిడీ చేసేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిపై దొంగతనం, దోపిడీ, చైన్‌స్నాచింగ్ మొదలైన కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2019లో ఓ నేరం కేసులో జైలు శిక్ష అనుభవించి.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా అతడు తరచూ స్వర్‌గేటు బస్టాండ్ వద్ద తిరుగుతూ.. అక్కడికి వచ్చిన ప్రయాణికులకు తనను తాను పోలీస్‌గా పరిచయం చేసుకునేవాడని అన్నారు. యువతిపై అత్యాచారానికి ముందు కూడా నిందితుడు ఇన్‌షర్ట్ వేసుకొని... నీట్‌గా రెడీ అయ్యాడని, ఆమెకు కూడా తనను పోలీసుగా పరిచయం చేసుకొని, అక్కా అంటూ మాట కలిపి నమ్మించాడని పేర్కొన్నారు.

# ప్రతి ఇంటికీ తాగునీరు

### తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ డివిజన్ పరిధిలో ఏ ఒక్క ఇంటికి తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పనిచేయాలని, నీటి సరఫరా కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కోదాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో కోదాడ డివిజన్‌లో మంచినీటి సరఫరా పరిస్థితిపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రూరల్ వాటర్ సప్లై విభాగం ఇఇ, డిఇలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, అత్యావసర పరిస్థితుల్లో నీటి సరఫరా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. కోదాడ డివిజన్‌లోని అన్ని గ్రామాల వారిగా నీటి సరఫరా కోసం పైపులైన్లు లీకేజీలు, మరమ్మతులు, సరఫరా సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలాల్లో, మున్సిపాలిటిల్లో బోర్ల పనితీరును పరిశీలించాలని, తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటి సరఫరాను జరపాలన్నారు. సరఫరాలో ఎక్కడ లోపం లేకుండా చివరి ఇంటి వరకు నీరందించేలా చూసుకోవాలని, అవసరమైతే లోకల్ సోర్స్ ద్వారా తాగునీరు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీలో లేబర్ మొబిలైజేషన్ కోదాడ డివిజన్ చాల తక్కువగా ఉందని, అన్ని గ్రామాల్లో సుమారు 100 మంది కూలీలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో జరిగే అన్ని పనులపై అవగాహన కలిగిఉండాలన్నారు. నర్సరీలలో జర్మినేషన్ సరిగా కనిపించడం లేదని, చలవ పందిళ్లను ఏర్పాటు చేయాలని, ఎంజిఎన్ఆర్జిఎస్ కింద చేపట్టిన సిసిరోడ్లు చేసే వారిలో పంచాయతీ కార్యాలయాల్లో అవసరమైన పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు సేవ చేయడం గొప్ప భాగ్యంగా భావించి పనిచేయాలని, ఉద్యోగులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి మాత్రమే అందాలని, రాష్ట్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సూర్యాపేట జిల్లా ముందుండాలని అన్నారు. విధి నిర్వహణ ఎంత ముఖ్యమో కుటుంబ బాధ్యత కూడా అంతే ముఖ్యమని, ఉద్యోగులందరు తప్పక హెల్మెంట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇవో అప్పారావు, ఆర్డీవో సూర్యనారాయణ, మిషన్ భగీరథ, ఇంట్రాగ్రిడ్ అధికారులు శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, డిపివో నారాయణరెడ్డి, డిఎల్‌పివో యాదయ్య, తహసిల్దార్ వాజీద్‌అలీ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** యాసంగిలో రైతులు సాగు చేసిన వరి ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్స్ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా ప్రతి రైస్‌మిల్ ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్స్‌తో యాసంగిలో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలు విషయంలో సాకులు చెప్తూ ఇబ్బందులకు గురి చేయకుండా సజావుగా నిర్వహించాలని, ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో జరిగిన పొరపాట్లు తిరిగి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, భోగవెల్లి వెంకటరమణచౌదరి తదితరులు పాల్గొన్నారు.



## కరెంట్ సమస్య పరిష్కరించాలి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని న్యూ గుండ్లపల్లి గ్రామంలో కరెంట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ యాదగిరిగుట్ట కరెంట్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బండి జంగమ్మ మాట్లాడుతూ గ్రామంలో ట్రాన్స్ ఫార్మర్ ఓల్టేజి సమస్య వలన ప్రతి రోజు పలుమార్లు కరెంట్ పోవడం వలన విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నా రు. గతంలో విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో పల్లెపాటి రాంచందర్ ఇంటి ముందు ఇనుప స్తంభం కూలి పోయే ప్రమాదం ఉంది ఆ స్తంభానికి లైన్ కూడా ఉన్నది కాబట్టి వెంటనే సిమెంట్ స్తంభం వేయాలన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారు, గోరేటి రాములు, పబ్బాల స్వామి, భగత్ సింగ్ యూత్ అధ్యక్షులు పాకలపాటి రాజుపాల్గొన్నారు.

## ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి

### రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని రైతుసంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తమ మాటలతోనే రైతులను మభ్యపెట్టిందని రైతులు బిఆర్ఎస్‌ను ఇంటికి పంపించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మిర్చి రైతులకు మద్దతు ధర,రైతుల రుణమాఫీ,సన్నరకం ధాన్యానికి బోనస్,రైతు భరోసాల విషయంలో పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారందరికీ న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్,యల్లావుల రమేష్,జడ వెంకన్న,జక్కుల రమేష్,సుందరి పద్మ,జక్కుల శ్రీనివాస్,యల్లావుల ఉమ,చెన్నబోయిన సైదులు,చక్రాల స్టాలిన్,యల్లావుల సురేందర్,కుడితొట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏరాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 40 పరీక్షా కేంద్రాల్లో 7,717 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు 40 చీఫ్ సూపరిడెంట్స్,3 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4 రూట్ ఆఫీసర్స్, 40 డిపార్టుమెంటల్ ఆఫీసర్స్,14 సెంటర్ కస్టోడియన్స్, 40 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, ఆర్డీఓ శ్రీనివాస రావు, డి. ఈ. ఓ అబ్దుల్ గని, డిప్యూటీ జెడ్పీ సీ ఈఓ నాగేంద్రం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిద్దప్ప, విద్యుత్ శాఖ అధికారి ఈ. రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓ, ఆర్టీసీ, పోలీస్, పోస్ట్ ఆఫీస్ శాఖల సహాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మస్థైర్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కరాటేతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైస్ మిల్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సుమన్ షోటోఖాన్ కరాటే అకాడమి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సినీ హీరో సుమన్‌లు పాల్గొని విద్యార్థులకు కరాటే బెల్ట్స్, సర్టిఫికెట్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు కరాటే శిక్షణ ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ, బూడిద సైదులు పాల్గొన్నారు.

## ఎస్‌సి హాస్టళ్లు ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు ఉండవెల్లి మండల అబివృద్ధి అధికారి తిరుపతి శుక్రవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో ఎస్సీ బాలుర హాస్టల్లను ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఉదయం పూట టిఫిన్ ఎలా ఉన్నదని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో చదువుకుని ఉన్నత స్థాయిలో ఎదగాలని విద్యార్థులను వారి ఆకాంక్షించారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు దుస్తులు కాస్మోటిక్ చార్జీలు ప్లేటు బాక్సులు విద్యార్థుల హాజరు వంటి వాటిపై పరిశీలన చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నీటి వసతులు ఏర్పాట్లను పరిశీలించి వీటి సమస్యలు లేకుండా చూడాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ శంకర్ వంట సిబ్బంది పాల్గొన్నారు.



## పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చకిలం హేమచందర్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఈనెల 5 నుంచి జరిగే ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చకిలం హేమచందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల జారీలో ఏలాంటి పొరపాట్లు లేకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. డిఐఈఓ భాను నాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 12 ప్రభుత్వ కళాశాలలు, 20 ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనరల్ మొదటి సంవత్సరంలో 6688 మంది విద్యార్థులు, జనరల్ ద్వితీయ సంవత్సరంలో 6666 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలను పర్యవేక్షణ కోసం రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 32 మంది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 32 మంది చీఫ్ సూపరింటెండ్స్, 32 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 850 మంది ఇన్విజిలేటర్లు నియమించినట్లు తెలిపారు. బోర్డు నిబంధనల ప్రకారం 9 గంటల తరువాత ఒక నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలో అనుమతి ఉండదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 32 పరీక్షకేంద్రాల్లో సూర్యాపేట పట్టణంలో 13, కోదాడలో 8, హుజూర్‌నగర్‌లో 2, తుంగతుర్తిలో 2, నెమ్మికల్‌లో 1, మఠంపల్లిలో 1, నడిగూడెంలో 2, తిరుమలగిరిలో 2, నేరేడుచర్లలో 1గా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఇసి సభ్యులు జా నపాటి కృష్ణయ్య, గుడిపాటి లక్ష్మ య్య, జిల్లా బల్క్ అధికారి విజయ్ నాయక్, కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ళ యాదయ్య పాల్గొన్నారు. అ నంతరం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చకిలం హేమచందర్‌ను లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు

### గద్వాల జిల్లాలో పలువురు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి :** జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. పలువురు జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్‌లు కల్పిస్తూ బదిలీలు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో వెంకటేశ్వర్లు (కలెక్టరేట్ నుండి ఆర్డీఓ), కర్నం నగేష్ (ధరూర్ నుండి గద్వాల తాహసిల్దార్ కార్యాలయం), ఎండి సికిందర్ (గద్వాల తహసిల్దార్ కార్యాలయం నుండి కలెక్టరేట్ ), దుర్గాసింగ్ (గద్వాల తహసిల్దార్ ఆఫీ సు నుండి అలంపూరు తహసిల్దార్ ఆఫీస్). బి.ఆంజనేయులు (వడ్డేపల్లి నుండి అలంపూర్). కరీం (అలంపూరు కార్యాలయం నుంచి మల్దకల్) , నాగిరెడ్డి (మల్దకల్ నుండి గట్టు), టి.క్రిష్ణ (గట్టు నుంచి ఆర్డీఓ కార్యాలయం), సర్దార్ మియా (మానవపాడు నుండి వడ్డేపల్లి), తిరుమలేష్ (కలెక్టరేట్ నుండి వడ్డేపల్లి), తిరుమలేష్ (కలెక్టరేట్ నుండి అయిజ), ఎన్. మద్దిలేటి (అయిజ నుంచి మల్దకల్), మద్దిలేటి (మల్దకల్ నుంచి రాజోలి), కిరణ్‌కుమార్ (అయిజ తహసిల్దార్ కార్యాలయం నుంచి గద్వాల ఆర్డీఓ కార్యాలయం) కు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి :** గద్వాల జిల్లాలో పనిచేస్తున్న ఏడు మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తూ బదిలీ చేసినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వడ్డేపల్లి తాహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎండి షేక్షావలి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఇస్తూ అయిజ తాహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. అయిజలో పనిచేస్తున్న టైపిస్టు యు.బాబుకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ మానవపాడు కు బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎం.మహేందర్‌కు సీనియర్ అసిస్టెంవగా కలెక్టరేట్‌గా డి.సెక్షన్‌కు బదిలీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో టైపిస్టు క్యామ నగేష్ సీనియర్ అసిస్టెంట్‌గా కలెక్టరేట్ ఎ సెక్షన్ కు బదిలీ చేశారు. ఆర్డీఓ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భరత్‌కుమార్ అయిజకు బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న వి.నర్సింహులు ధరూర్‌కు, కలెక్టరేట్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న లక్ష్మి బాయి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

## ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల వార్షిక పరీక్షలు 2025 మార్చి 5వ తేదీ నుండి మార్చి 25వ తేదీ వరకు జరుగుతాయని, జిల్లాలో 29 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 6208 , ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6350 మొత్తంగా 12558 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. చీఫ్ సూపర్‌డెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్ అధికారులు ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణకు ఉదయం 8 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపులో అత్యంత భద్రత తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసీ వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సంబంధిత అధికారి చే జారీ చేయబడిన ఐడి కార్డులు ఉంటేనే తప్ప ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించడం జరగదు అన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. టెలీ మానస్ ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడి లకు లోను కాకుండా ఉండడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రోజా రమణి, జిల్లా ఎగ్జామ్స్ కమిటీ అధికారి మంజుల, ప్రభజస్టిస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పోచంపల్లి ఇక్కత్ పట్టు చీర



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లకు అలంకరించేందుకు కానుకగా అధికారికంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు,పట్టు పంచాలను బహుకరించేందుకు మగ్గంపైనేసి సిద్ధం చేసినట్లు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు శుక్రవారం తెలిపారు. ప్రతి ఏటా పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరను బ్రహ్మోత్సవాలకు లక్ష్మీ నరసింహ స్వామి, అమ్మవార్లకు అలంకరించేలా గతంలోనే ఆలయ పాలకవర్గం ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ ఈసారి బ్రహ్మోత్సవాలకు కళ్యాణ మహోత్సవంలో స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అలంకరించేందుకు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను తయారు చేసినట్లు తెలిపారు. యాదాద్రి ఆలయ అధికార సిబ్బంది పట్టు వస్త్రాల తయారీ పరిశీలనకు వచ్చినట్లు మగ్గంపై నేసిన చీరలను వారికి చూపించినట్లు వారు కోరిన తేదీన ఆలయ ఈవోకు అందజేయనున్నట్లు తెలిపారు. పది రోజులు నియమ నిష్ఠలతో చేనేత కార్మికుడు తన సొంత సృజనతో గతంలో చూడని విధంగా కొత్త కళతో రంగులతో పట్టు చీరలు తయారుచేసినట్లు వివరాలు వెల్లడించారు. నేటి నుండి ప్రారంభం కానున్న యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఊరేగింపుగా ఈ పట్టు వస్త్రాలను బహుకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీఈవో భాస్కర్ శర్మ, ఏఈవోలు రమేష్ బాబు, కృష్ణ సూపరింటెండెంట్ డి.నరేష్, సంఘ ఉపాధ్యక్షులు భోగ నరసింహ, అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారతరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రయ్య, కోశాధికారి సంగెం చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు కర్నాటి అంజమ్మ, గుండు పాండు పాల్గొన్నారు.

## మూసీనది ప్రక్షాళన చేసి రైతులను ఆదుకోండి



యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూరు:** మూసీనది ప్రక్షాళన చేసి రైతులను ఆదుకోవాలని, రైతులు పండించిన పంటలు దిగుబడి రాక పెట్టుబడులకు సరిపోక నానా అవస్థలు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మూసి ప్రక్షాళన చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతు సంఘం 3వ మహసభలో పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డాక్టర్ స్వామినాథన్ కమిటీ సూచనల మేరకు అన్ని రకాల పంటలకు అయ్యే ఖర్చులకు అదనంగా మరో 50 శాతం కలిపి మద్దతు ధరను నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వాన్ని చేసిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు పరచాలని అన్నారు. గందమల్ల చేరువును రిజర్వాయర్ చేయాలని ఎన్నో ఆందోళన చేసాం అని, యాదాద్రి జిల్లాలో బాగా పాల ఉత్పత్తి ఉందని ప్రతి రైతుకు పాడి పశువులు కొనుక్కోవడానికి వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వాలని పాడి రైతులకు సబ్సిడీ పై దాన సప్లై చేస్తూ పాడి రైతులకు చెల్లించవలసిన బోనస్ డబ్బులు చెల్లించాలని కోరారు. మండలాలలో మార్కెట్ కమిటీ ఉండాలని, ఎరువులు క్రిం సంహారక మందులు గోదాములు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పరిపతి సహకార సంఘం బ్యాంకు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని, గొలుసు కట్టు చెరువులను నింపాలని అన్నారు. రైతులు పండించిన పంటను నిల్వ కొరకు స్టోరేజి గోదాములు నిర్మించాలని, 60 సంవత్సరాలు నిండిన పత్తి రైతుకు రూ.6000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు ససంఘం జిల్లా కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, ఆలేటి బాలరాజు, నల్ల యుద్ధం రెడ్డి, రేగు యాదయ్య, పైల్ల రామ్ రెడ్డి, గంగాధర్, రాజయ్య, బీరకాయల మల్లేష్, ఆడెపు నర్సింహులు, పుల్ల కొమురయ్య, మారబోయిన దేవరాజు, నల్ల రాములు, సొప్పరి సోములు, బీరకాయల పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనాథలైన చిన్నారులు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా :** రెండు నెలల క్రితం తల్లి, శుక్రవారం తండ్రి మృతి చెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలారు. మల్దకల్ మండలం చర్లగార్లపాడుకు చెందిన కుమ్మరి భారతి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వీరేష్ కుండలు తయారు చేస్తూ పిల్లలను పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు తాళలేక వీరేష్ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలారు. అనాథలైన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విన్నవించారు.

## సైబర్ మోసగాళ్ళతో జాగ్రత్త : ఎస్‌పి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** మీ క్రెడిట్ కార్డ్ పరిమితిని పెంచడానికి మీకు ఫోన్ కాల్ ద్వారా లేదా ఎస్ ఎం ఎస్ సి చేస్తున్నట్లయితే అది సైబర్ మోసగాళ్ళ పని అయ్యి ఉంటుదని వారి పట్ల జాగ్రత్త గా ఉండలని జిల్లా ఎస్పీశరత్ చంద్ర పవార్ సూచించారు. శుక్రవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ క్రెడిట్ కార్డ్ పరిమితిని పెంచే ఆఫర్‌తో సైబర్ మోసగాళ్ళు బ్యాంక్ ఉద్యోగిగా నటిస్తూ మాట్లాడి మిమ్మలను నమ్మించి సివివి ఓటిపి ఇతర వివరాల వంటి తెలుసుకొని క్రెడిట్ కార్డ్ హోల్డర్ యొక్క సున్నితమైన డేటాను పొంది మీ క్రెడిట్ కార్డు లో ఉన్న లిమిట్ ను ఖాళీ చేస్తారని అన్నారు.అటువంటి కాల్స్ వస్తే నమ్మకండి, ముఖ్యంగా మీ కార్డు సివివి నంబరు ఓటిపి వంటి వివరాలను ఎవ్వరికీ చెప్పవద్దని తెలిపారు. ఏలాంటి సంఘటనలు జరిగిన వెంటనేసైబర్ క్రైమ్ ని డబ్ల్యూ డబ్ల్యూ సైబర్ క్రైమ్ గౌట్ ఇన్ లేదా 1930 టోల్ ఫ్రీ నంబరు కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు..

# మహిళల జీవితాలలో మార్పుదిశగా అడుగులు

ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును మహిళా సమాఖ్యలు పరిశీలించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళల జీవితాల్లో మార్పు దిశగా ఖమ్మం జిల్లాలో అడుగులు పడ్డాయని భవిష్యత్తులో మహిళల అభివృద్ధికి మరింత మెరుగ్గా పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని నిర్వహించిన గౌతమి జిల్లా మహిళా సమా ఖ్య సాధారణ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రిలో అందుతున్న సేవలు, ఏమైనా సమస్యలు ఉన్నాయా, వైద్యులు సరిగ్గా చూస్తున్నారా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల పనితీరుపై, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు అవుతున్న నేపథ్యంలో మహిళలతో వివిధ అంశాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అవుట్ పేషంట్ కోసం నిర్దేశించిన సమయంలో తప్పకుండా వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో హాజరవుతున్నారో లేదో గమనించి సమాచారం అందించాలని మహిళా సమాఖ్య సభ్యులకు కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి యూనిట్లు, మహిళా డెయిరీ, మహిళా మార్ట్ ఏర్పాటు ద్వారా ఖమ్మంజిల్లాలో మహిళా సాధికారతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ జిల్లాలో లేనివిధంగా మన ఖమ్మం జిల్లాలో మహిళా గ్రూపులు యాక్టివ్‌గా పని చేస్తున్నాయన్నారు. డిపివో విష్ణువందన, డిఎంసి డిహెచ్ఈడబ్ల్యూ సఖీన్‌లు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం క్రింద చేపట్టే పనులను వివరించారు. జిల్లాలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చేస్తున్న పనులను మహిళా సమాఖ్య సభ్యులకు వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మహిళలు తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, సీజన్ మారే సమయంలో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. రాబోయే వేసవి కాలంలో వడగాలులు, వడదెబ్బలు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, అదనపు డిఆర్‌డివో నూరుద్దీన్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు అందించిన సేవలకు ధన్యవాదాలు**

**పదవీ విరమణ కార్యక్రమంలో కలెక్టర్**



ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ గత 30 ఏళ్లుగా ప్రజలకు నిర్విరామంగా అందించిన సేవలకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదవి విరమణ పొందుతున్న 15 మంది అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా.పి.శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎస్. దశరథం, ఏన్కూరు పిహెచ్‌సిలో సిహెచ్‌వోగా పని చేస్తున్న శివరాజు, కల్లూరు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్వర్ణలత, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఉసిరికాయలపల్లిలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న బి.జగన్ నాయక్, తిరుమలాయపాలెంలో కామటిగా పనిచేస్తున్న బి.బాల్య, సదాశివునిపేటలో వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ విభాగంలో తల్లాడ ఎంపివోగా పనిచేస్తున్న చంద్రమౌళి, జెడ్పిహెచ్ఎస్ కొణిజర్లలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సిహెచ్ మంగమ్మ, రెవెన్యూ శాఖ బోనకల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న టి.పుల్లయ్య, కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్న అంటోని, పౌర సరఫరాల శాఖలో డిటిగా పనిచేస్తున్న ఎ. సీతారామచంద్రరావు, ఇంటర్మీడియట్ విద్యా శాఖలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కె.శ్రీరామారావు, జూనియర్ లెక్చరర్ బి.వెంకటేశ్వర్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎం. ఝాన్సీరాణి, కో ఆపరేటివ్ శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శంకర్ పదవి విరమణ పొందారు. వారిని కలెక్టర్, అదనపు కలెక్టర్లు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కార్యాలయ సబార్డినేట్లు, విధి నిర్వహణలో తమకు చాలా మద్దతును అందిస్తారని తెలిపారు. ప్రతి ఉద్యోగి 30 ఏళ్లుగా ప్రభుత్వానికి వివిధ స్థాయిల్లో సేవలు అందించారని వారు చేసిన సేవలకు కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్వజ్ఞ'లో శ్రీకార్ ది సైన్స్ ఎగ్జిబిషన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో జాతీయ సైన్స్‌డేను పురస్కరించుకుని సర్వజ్ఞ శ్రీకార్ ది సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, బయాలజీ వంటి వివిధ అంశాలకు సంబంధించి ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమలు మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వారి సృజనాత్మకతకు, శాస్త్ర పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలిచాయన్నారు. సైన్స్ రంగంలో రామన్ విశిష్ట కృషికి నోబెల్ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. సైన్స్ అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదని మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి , జీవితాలను మెరుగు పర్చుకోవడానికి ఒక సాధనం అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలు, ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కొదుమూరు కేంద్రంగా లింగనిర్ధారణ పరీక్షలు

గుట్టు రట్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**ప్రజాపక్షం/చింతకాని :** పుట్టబోయేది ఆడబిడ్డ, మగబిడ్డో నిర్ధారణ చేసి ఆడపిల్ల ఐతే అబార్షన్ కూడా మేమే చేస్తామంటూ ఓ ముఠా చింతకాని మండలం కొదుమూరు కేంద్రంగా అమాయక గిరిజన మహిళలను లక్ష్యంగా చేసుకుని లక్షలాది రూపాయలు దండుకుంటున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రట్టు చేశారు. కొదుమూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ రాచబంటి మనోజ్, అల్లీపురం గ్రామానికి చెందిన స్కానింగ్ అసిస్టెంట్ కాత్యాయణి మరో ఇద్దరితో కలిసి కొదుమూరులోని ఓ ఇంట్లో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. గురువారం స్కానింగ్ పరీక్షలు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వైద్య శాఖ అధికారులు, చింతకాని పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుని పరీక్షా పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఆర్ఎంపి చారీ, కాత్యాయణి, రాచబంటి మనోజ్‌పై పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం పలు సెక్షన్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతకాని ఎస్సై నాగులమీరా తెలిపారు.

బతికుండగానే చంపేసిన అధికారులు

## రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపికలో చిత్రవిచిత్రాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అధికారుల తీరు చాలా సందర్భాల్లో గమ్మత్తుగా, నిర్లక్ష్యంగా ఉంటుంది. వారి చేతలు, నిర్ణయాలు ఆశ్చర్యం గొలుపుతుంటాయి. ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. 25 ఏళ్ల క్రితం పెళ్లయిన ఓ జంట రేషన్‌కార్డును ఇటీవల పెళ్లయిందని తొలగించారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం బైరావునిపల్లి గ్రామంలో మూడు కుటుంబాలకు చెందిన రేషన్‌కార్డులను తొలగించారు. ఈ రేషన్ కార్డుల తొలగింపు గురించి ఎవరు ఫిర్యాదు కూడా చేయలేదు. వారు మాకు రేషన్‌కార్డు అవసరం లేదని దరఖాస్తు చేయలేదు. కానీ ఎందుకు తీసేశారో అర్థం కాకపోగా వారు చెప్పిన కారణాలు కూడా హాస్యాస్పదంగా ఉన్నాయి. గరిడేపల్లి నర్సయ్య అనే వ్యక్తి బతికుండగానే ఆయన మరణించాడని కార్డులో నుంచి పేరును తొలగించారు. బాలిన పుష్పకు 25 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పుష్పకు నూతనంగా వివాహం కావడం వల్ల రేషన్ కార్డు తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా బైరవునిపల్లి గ్రామంలో వీరబాబుకు 26ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆయన రేషన్‌కార్డును కూడా రద్దు చేశారు. అసలు ఈ రేషన్‌కార్డులను రద్దు చేయడంతో పాటు రద్దు చేసేందుకు చూపిన కారణాలు హాస్యాస్పదంగా ఉన్నాయి. బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి తమ రేషన్‌కార్డులను ఎందుకు తొలగించారో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. తహసీల్దార్‌కు రేషన్‌కార్డుల తొలగింపు విషయమే తెలియదట మరి తహసీల్దార్‌కు తెలియకుండానే రేషన్‌కార్డులు ఎలా తొలగించారని ప్రశ్నిస్తే అందుకు సిబ్బంది నిర్లక్ష్యమని కారణం చెబుతున్నారట. ఇప్పటికైనా రేషన్‌కార్డులను పునరుద్ధరించకపోతే ఆందోళన చేపడతామని బాధితులు హెచ్చరిస్తున్నారు. ఈవిషయమై నేలకొండపల్లి తహసీల్దార్ మాణిక్యరావును వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు అందిందని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## లకారం వద్ద స్వచ్ఛత హీసేవ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంనగర పాలక సంస్థ పరిధిలోని లకారం ట్యాంక్‌బండ్ వద్ద స్వచ్ఛత హీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం లకారం ట్యాంక్‌బండ్ వద్ద స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ట్యాంక్‌బండ్ పరిసరాలను శుభ్రం చేశారు. చెరువులోని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్, త్రీహెచ్ ఫౌండేషన్, న్యూవిజన్ స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు :**

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులు నిర్వహించారు. డివిజన్‌కు 20 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని కాలువలను శుభ్రం చేసి వ్యర్థాలను తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. కొన్ని ప్రాంతాల్లో జెసిబిల ద్వారా వ్యర్థాలను, మట్టికుప్పలను తొలగించారు.

## పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ పదవి విరమణ పొందిన సిహెచ్ రామ్‌పాదంను కమిషనర్ అభిషేక్ అగస్త్య సన్మానించారు. శుక్రవారం కార్పోరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పదవి విరమణ పొందిన సిహెచ్ రామ్ పాదం దంపతులను కమిషనర్ అభిషేక్ అగస్త్య శాలువతో సత్కరించి పదవి విరమణ పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆఫీస్ వాహనంలో రామ్‌పాదంను ఇంటి వరకు పంపించారు.

## 'రెజొనెన్స్'లో ఇంజీనియస్ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్‌లో కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ఇంజీనియస్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హార్టికల్చర్, సెరీ కల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎంవి మధుసూదన్, పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్ రావు, కొండా కృష్ణవేణిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సైన్స్ పట్ల అవగాహన కలిగి దేశాభివృద్ధికి దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. సర్ సివి రామన్ భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు తీసుకెళ్లారన్నారు. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ చేసి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను ఫీల్డ్ ట్రిప్స్‌కు తీసుకెళ్లి ప్రత్యక్ష అనుభూతిని కల్పించుటకు హార్టికల్చర్, సెరీకల్చర్ శాఖ తరపున సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మైక్రో, రైన్ ఇరిగేషన్స్‌ను విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లలో రెజొనెన్స్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని పెంచిందన్నారు. పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి లు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు తమ పాఠశాల నిరంతరం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలో నిర్వహించిన క్విజ్, సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు



జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం / పాల్వంచ :** వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం పాల్వంచలోని ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐటిఐ విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ కేంద్రంలోని అన్ని తరగతి గదులను పరిశీలించి శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ.. శిక్షణ ఎలా ఉంది, ఏ కోర్స్ శిక్షణ తీసుకుంటున్నారు అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కేంద్రంలో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వృత్తి విద్యలో శిక్షణ పొందిన విద్యార్థులు పరిశ్రమల స్థాపన ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదగొచ్చని ఆయన అన్నారు. పదవ తరగతి తరువాత ఐదు సంవత్సరాల పాటు విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు అని, అలాంటి వారికి తక్షణ ఉపాధి కల్పించే వృత్తి విద్యా కోర్సులు ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. ఇది వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సిబ్బంది డిమాండ్ బాగా ఉందని, విద్యార్థులు వృద్ధి విద్య కోర్సులు, శిక్షణ పూర్తి చేయడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి అయిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ధృవపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్, శిక్షణ కేంద్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలోచనలతోనే ఆవిష్కరణలు

ఐడియాథాన్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నేటి సమాజంలో మనం చూసేవన్నీ ఒకప్పుడు ఆలోచనలతోనే ఆవిష్కరణలయ్యాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఎస్‌బిఐటి కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఐడియాథాన్‌కు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వనరుల కొరత ఉన్న ఆలోచనలు అమలుకు నోచుకోలేకపోయాయని ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని ఇంటర్‌నెట్ యుగంలో ప్రపంచం ఓ కుగ్రామంలా మారిందన్నారు. వచ్చిన ఆలోచనలపై పట్టుదలతో అడుగులు వేస్తే విజయం సిద్దిస్తుందన్నారు. మానవ మేధస్సు ఓ కర్మాగారమని అందులో నుంచి ఉద్భవించే ఆలోచనలు అద్భుతాలని కలెక్టర్ తెలిపారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఓ అద్భుతమైన ఆలోచన ప్రపంచ గతినే మారుస్తుందని ఇంటర్‌నెట్ అందుకు సాక్ష్యమని గుర్తు చేశారు. ఈతరం విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తున్నారని రానున్న రోజుల్లో అద్భుతాలు సృష్టించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి (టాస్క్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఐడియాథాన్ స్పందనతో సమాజశ్రేయస్సుకు ఉపయోగపడే ఎన్నో ఆలోచనలు పుట్టుకొచ్చాయని టాస్క్ రిలేషన్ షిప్ మేనేజర్ దినేష్ తెలిపారు. జిల్లా స్థాయిలో 10 కళాశాలలు పాల్గొనగా 313 ఆలోచనలు పంపారని అందులో 56 ఎంపిక చేయగా 186 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రాజెక్టు మేనేజర్ బి.బాలు ప్రవరాఖ్య తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన టీమ్‌ను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ ఎన్. అర్జున్, గేమిఫ్లైంగ్ ఎడ్యుకేషన్ ఫౌండర్ శ్రీరామ్, సంకీర్త్, అకాడమీక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివ ప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడిలు, ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్ సెల్ ఇంచార్జి డా.స్ఫూర్తి, అశ్వని, హరిణి, టిపిఓ ఎన్. సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కీచక అధ్యాపకుడిని కఠినంగా శిక్షించండి

పోక్సో కేసు నమోదు చేయాలి

విద్యార్థి, మహిళా సంఘాల ఆందోళన



**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకులే కీచకులుగా మారిపోతుండటంపై విద్యార్థి మహిళా సంఘాలు కన్నెర్ర చేశాయి. ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడాన్ని విద్యార్థి మహిళా సంఘాలు తీవ్రంగా నిరసించాయి. విద్యార్థి మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ గౌరవ ప్రదమైన అధ్యాపక వృత్తిలో ఉండి వృత్తికే మచ్చ తెచ్చేవిధంగా కొందరు వ్యవహరిస్తున్నారని ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలన్నారు. విద్యార్థినులకు తరగతి గదిలోనే రక్షణ లేకపోతే ఎలా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికే ప్రైవేటు విద్యాసంస్థల జోరుకు ప్రభుత్వ విద్యా రంగం విలవిలలాడుతుందని అటువంటి సమయంలో కళాశాలలో ఇటువంటి ఘటనలు జరిగితే మరింత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని వారు తెలిపారు. లెక్చరర్‌ను కఠినంగా శిక్షించేందుకు ఎస్‌సి, ఎస్టి, అట్రాసిటీ కేసుతో పాటు పోక్సో కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అధ్యక్షురాలు పోటు కళావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పిడిఎస్‌యు నాయకులు మంద సురేష్, మస్తాన్, లక్ష్మణ్, డివైఎఫ్ఐ నాయకులు చింతల రమేష్, ఐద్వా అధ్యక్షురాలు మెరుగు రమణ, సుధాకర్, శివ, అజయ్, మనోజ్, వినోద్, తాటి నిర్మల, వెంకటలక్ష్మి , పూజిత, నాగసులోచన తదితరులు పాల్గొన్నారు.

## భవితకు పునాది విద్య



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల భవితకు పునాది విద్య మాత్రమేనని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అజిత తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని యుపిహెచ్ కాలనీలో గల బాలాజీ నగర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్షల సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అజిత మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతిభ కలిగిన విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా చేయూతనందిస్తున్నారని తెలిపారు. ట్రస్టు ద్వారా ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్యను అభినందించారు. ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయలు శ్రీనివాసరావు, శ్యాంసుందర్, రాములు, భారతి, కస్తూరి గాంధీ, ఝాన్సీరాణి, రాజశేఖర్, కైలసరావు, నాగిరెడ్డి, శేఖర్‌బాబు, రజియాభాను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 'త్రివేణి'లో జాతీయ సైన్స్ దినోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో సైన్స్ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. సహజ నీటిశుద్ధి పద్ధతులు, కృత్రిమ అవయవాల నిర్మాణం, రోబోటిక్ ఇంజనీరింగ్ టెక్నిక్స్, ఆహార పదార్థాల కల్తీ నివారణ, శరీర అవయవాల పనితీరు తెలిపే నమూనాలను ప్రదర్శించారు. గురువారం నిర్వహించిన త్రివేణి ప్రైమరీ విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా జిల్లాసైన్స్ ఆఫీసర్ జగదీష్, కృష్ణవేణి కళాశాల ఐఐటి కెమిస్ట్రీ అధ్యాపకులు లక్ష్మణ్ పాల్గొని చిన్నారులు ప్రదర్శించిన నమూనాలను ఆసక్తిగా తిలకించారు. శుక్రవారం హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో సివిరామన్ చేసిన సేవలకుగాను నోబెల్ బహుమతి పొందారన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌వో కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అద్దె బస్సు డ్రైవర్లను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలి



తొలగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) అద్దె బస్సులకు డ్రైవర్లుగా పనిచేస్తున్న డ్రైవర్లను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. పదేళ్లుగా ఆర్టిసి సంస్థ లాభాల్లో నడవడానికి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రయాణించేందుకు కృషిలో అద్దె బస్సు డ్రైవర్లు కీలక భూమికి పోషించారని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. అద్దె బస్సు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొని రామానుజం మాట్లాడుతూ 1957 పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్టం ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని కానీ అద్దె బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించడం కుదరదని చెప్పడం దారుణమన్నారు. పదేళ్లుగా చిన్న ప్రమాదం జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్లిన వారిని కాదని కొత్త వారిని తీసుకోవడం వల్ల ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం అవుతుందని రామాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిసిలో అద్దె బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారి ధృవపత్రాలను పరిశీలించి అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఆర్‌ఎంకు వినతి పత్రం సమర్పించినట్లు రామాంజనేయులు తెలిపారు. ఆర్‌ఎం హామీ మేరకు మరోసారి ధృవపత్రాల పరిశీలన జరగాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు వీరన్న, వేణు, అంజి, మహేష్, లక్ష్మణ్, సుధాకర్, సైదులు, హరిప్రసాద్, అమరేందర్‌రెడ్డి, రాము, పృథ్వీ, చలపతిరెడ్డి, రవి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలలో ఆల్ఫోర్స్ ప్రతిభ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల ఆల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్ విద్యార్థులు వివిధ ప్రతిభా పాటవ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ సాధించి బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి వారిని అభినందిస్తూ మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పలు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించాలని, అందులో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించాలని, తద్వారా అనుభవం పొందుతారన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలలో శ్రీజన్ రెడ్డి (9వ) ద్వితీయ బహుమతి , కె.విక్రాంత్ (9వ)జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలో ద్వితీయ బహుమతి గెలుపొందారని హర్షం వ్యక్తం చేస్తూ విధ్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

## ఆల్ఫోర్స్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో శుక్రవారం ఘనంగా జాతీయ సైన్స్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సి.వి రామన్ భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విధ్యార్థులన్నారు. వేడుకల్లో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోలీసులకు సన్మానం




**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తూ పదవీకాలం ముగిసిన కమ్యూ నికేషన్ విభాగంలో పనిచేస్తున్న ఎస్సై జి.నరసింహారావు, సిసిఆర్బీలో చేస్తున్న యండి. మన్సూర్, రూ రల్ పోలీస్‌లో చేస్తున్న కె.అంజయ్యలు సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు సేవలందించి శుక్రవారం పదవీ విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్సు హాలులో ఈ కార్యక్రమం నిర్వ హించగా పోలీస్ కమిషన్ అభిషేక్ మహంతి హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అని వార్యమని, ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉన్న పోలీసు ఉద్యోగం సంపూర్ణం చేసి పదవీ విరమణ చేసి పదవీ విరమణ పొందడమే గొప్ప విజయమన్నారు. అనంతరం పూలమాల వేసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, సిసిఆర్‌బి ఎసిపి విజ య్ కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ అసోసోయేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఆలయంలో సిసి కెమేరాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ధర్మపురి సిఐ రామ్ నర్సింహారెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను సిఐ రామ్‌నరసింహారెడ్డి, గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. అపరిచిత వ్యక్తులను దొంగతనాలను అరికట్టడంలో సిసి కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఆలయం ,మసీదు ,చర్చిల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐ సతీష్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి తిరుపతి గౌడ్ ,వైస్ చైర్మన్ కొమురయ్య , నక్క కొమురయ్య ,చికినీకాంతం నాగయ్య ,గంధం నరసయ్య ,అల్లాడి వేణు ,అల్లాడి గోపి ,గట్ల శ్రీధర్ ,ఆలయ అర్చకులు బజరంగం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవం



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** చిన్నారులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ వర్క్ ఉపాధ్యాయులు, తల్లి దండ్రులను ఎంతగానో అలరించాయి. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుగ్గారం మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ వర్క్శ తయా రు చేశారు. సైన్స్ డేలో భాగంగా వివిధ తరగతుల విద్యార్థిని విద్యార్థులు తయారు చేసినటువంటి సైన్స్ ప్రాజెక్ట్ వర్క్ లలో రెస్పిరేటరీ సిస్టం వాటర్ ప్యూరిఫై సిస్టం,సౌండ్ ఫంక్షన్స్, అదేవిధంగా వాటర్ సైకిల్ ,చేపల ఎక్వేరియం తదితర ప్రాజెక్టు వర్కులను చూసి తల్లిదండ్రులు, గ్రామస్తులు, పూర్వపు విద్యార్థినీ, విద్యార్థులు పిల్లల ప్రతిభ పాటవాలను హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ పాటవాలకు ప్రోత్సాహక బహుమతులను ఇదే పాఠశాలలోని పూర్వ విద్యార్థులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు షబానా సుల్తానా, త్రితేజ, సురేష్ చంద్ర ,మాదూరి శ్రీనివాస్, రొట్టె శ్రీనివాస్, కల్పన, అమూల్య, పోచయ్య లతోపాటు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పూర్వపు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అపోహలు నమ్మొద్దు

పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

* బాగా ఉడికిన చికెన్, ఎగ్‌లను భుజించొచ్చు

\- మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సోషల్ మీడియాలో సృష్టించే అపోహలు నమ్మొద్దని ..బాగ ఉడక పెట్టిన గుడ్డు, చికెన్ తింటే ఎటువంటి వైరస్ సోకదని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా పౌల్ట్రీ రైతుల ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాలో పాల్గొని, అందరితో చికెన్ తిన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పౌల్ట్రీ రైతులకు మక్కలు, విద్యుత్‌ను సబ్సిడిపై పంపిణీ చేసినట్లు తెలిపారు. పౌల్ట్రీ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. పౌల్ట్రీ రైతులను ఆదుకోవాల్సినబాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కానీఈ ప్రభుత్వం సోయి లేకుండ ప్రవర్తిస్తుందన్నారు. గతంలో ఇదే తరహాలో చికెన్ తినవద్దని అపోహాలు వస్తే కెసిఆర్‌తో పాటు ప్రజాప్రతినిధులు చికెని తిని అపోహాలను దూరం చేశారన్నారు. దీంతో ప్రజలకు నమ్మకం కల్పి ంచినట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రోటిన్ ఇచ్చేది చికెన్, కోడిగుడ్డు మాత్రమే అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్నారు. రైస్,రోటి కంటే చికెన్ గుడ్డు ఆరోగ్యానికి మేలన్నారు. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పౌల్ట్రీ సిద్దిపేట జిల్లాలోనే ఉందన్నారు. అనంతరం ఫౌల్ట్రీ రైతులు మాజీ మంత్రి హరీష్‌రావును శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఫౌల్ట్రీ రైతులు, వ్యాపారులతో కలసి మాజీ మంత్రి హరీష్‌రావు చికెన్ భుజించారు.ఈకార్యక్రమంలో పౌల్ట్రీ రైతుల ప్రతినిధులు కృష్ణారెడ్డి, గంప శ్రీనివాస్, లతీఫ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హామీలపై నిలదీయాలి

* హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గానికి తాను ఒక్కడినే ఎమ్మెల్యేను కాదని, తాను ఎమ్మెల్యేగా గెలిచేందుకు కష్ట పడిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యేనేనని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజురాబాద్ కేసి క్యాంప్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మా ట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రభు త్వం ఇచ్చిన హామీలపై ప్రతి కార్యకర్త ఎప్ప టికప్పుడు నిలదీయాలని పిలుపునిచ్చారు. అలాగే మార్చి 10వ తేది వరకు అన్ని గ్రామాల్లో వివిధ క మిటీలు వేయాలని, అతి త్వరలోనే నియోజకవర్గ ప్రజలందరిని కలుపుకుని ఆత్మీయ సమ్మే ళనం ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఐలయ్య, హుజురాబాద్ పిఏసిఎస్ చైర్మన్ ఎడవల్లి కొండల్‌రెడ్డి, మండలంలోని కాట్రపల్లి, చిన్నపాపయ్యపల్లి, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, కునుకుల గిద్ద, జూపాక, బొత్తలపల్లి, రాంపూర్, వివిధ గ్రామ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్సులకు సీళ్లు

పర్యవేక్షించిన ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఎక్క, బుద్ద ప్రకాష్ జ్యో తి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో బ్యాలె ట్ బాక్సులు పెట్టిన రూమ్‌లకుస్ట్రాంగ్ రూములకు శుక్రవారం తెల్లవారు జామున సీళ్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం రాత్రి నుండి బ్యాలెట్ బాక్సులు రావడం మొదలైందని, శుక్రవారం తెల్లవారుజాము వరకు వివిధ జిల్లాలకు చేర్చామని, ఎన్నికల అధికారుల కృషి, వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. మార్చి 3 నుంచి జరిగే కౌంటింగ్ ప్రక్రియ సైతం సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు.. పోలింగ్ స్టేషన్‌ల వారీగా లెక్కింపు ఉంటుందని, స్టాంగ్ రూంల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, సిసి కెమెరాలతో నిఘా ఉంటుందని తెలియజేశారు.

# రంజాన్ నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రతి మసీదు వద్ద పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ

రంజాన్ మాసం ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రశాంతంగా రంజాన్ మాసం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రంజాన్ మాసం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు డి.వేణు, జె.అరుణ శ్రీలతో కలిసి సంబంధిత అధి కారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పవిత్ర రం జాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో సైతం అవసరమైన ఏర్పాట్లు కోసం అధికా రులకు సూచనలు జారీ చేశామన్నారు. షాపులను 24 గంటలు నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించి పోలీసు శాఖ సూచనలు అందిస్తుందన్నారు. ప్రతి మసీదు పరిసరాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,మసీదు సమీపంలో ఎక్కడైనా దేవాలయాలు ఉంటే అక్క డ ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా సామరస్యంగా ఉండేలా పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమా వేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, డిసిఎస్ఓ రాజేందర్, డిపిఓ వీర బుచ్చయ్య, ఎసిపి కృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సజావుగా ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీ క్షించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షల ఉదయం 9 గంటల నుం చి 12 గంటల వరకు నిర్వహణకు జిల్లాలో కట్టుది ట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికా రు లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పగడ్బందీగా పరీక్ష లు నిర్వహించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 23 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహిం చాలని, ఉదయం పూట ప్రత్యేక బస్సులను నడపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, ఆర్టీసి, విద్యుత్, పంచాయతీ, మునిసిపల్, పోస్టల్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొదుపే భవిష్యత్తుకు భరోసా

జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ఆర్థిక క్రమశిక్షణతో కూడిన పొదుపే భవిష్యత్తుకు భరోసా అని జగి త్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్‌లత అన్నారు. ఈ సందర్భంగా రిజర్వు బ్యా ంకు ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24నుంచి28 వరకు దేశవ్యాప్త ంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్న తరుణం లో శుక్రవారం జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాలులో వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ త మ ఆదాయ, వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎదు టి వారిని చూసి ఆడంబరాలకు పోయి తమ ఆర్థిక స్థోమతకు, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తున్నారని తద్వారా వాటి కోసం అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్నారని కొన్ని కొన్ని సందర్భాల్లో ఆర్థిక సమస్యలు ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని ఆమె చెప్పారు. ప్రతి వ్యక్తి తమ కుటుంబ బడ్జెట్ రూపకల్పన చేసుకోవాలన్నారు. తద్వా రా తాము చేసే ఖర్చులు తగ్గించి పొదుపు చేయ డానికి దోహదపడుతుందని ఆమె సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ మాట్లా డుతూ ప్రతి వ్యక్తికి సంపాదన ముఖ్య మే కానీ ఎంత సంపాదిస్తున్నమన్నది ముఖ్యం కాదని ఎలా ఖర్చు చేస్తున్నామన్నదే ప్రధానమని, దానిపైనే మన వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. పొదుపు చేయడా నికి బ్యాంకులు, పోస్టాఫీసులు, ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రమే ఎంచుకోవాలని అప్పుడే మీ పొదుపు డబ్బులకు సరైన భద్రత, భరోసా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ, బిసి సంక్షేమ అధికారిణి సునీత, జిల్లా ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 28న ‘చలో ఢిల్లీ’

జగిత్యాలలో ఎఐటియుసి గోడపత్రిక ఆవిష్కరణ




**ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి:** మార్చి 28న ఎఐటియుసి చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలనీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాడిశెట్టి కిరణ్ పిలుపునిచ్చారు. జగిత్యాలలో శుక్ర వారం చలో పార్లమెంటు పోస్టర్ రిలీజ్ చేశారు.ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సంక్షేమ చట్టంలో నిబంధనలు ఆయా రాష్ట్రాలకు అనుకూలంగా మార్పులు చేసుకునే నిబంధనలు ఉన్నాయని తెలిపారు.నష్టపరిహారంతో పాటు, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, వలస కార్మికులు (ఒక రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాల్లో పనిచేసేవారికి) దేశంలో ఎక్కడైనా వరించే విధంగా గుర్తింపు కార్డులు ఉండాలని, సంక్షేమ బోర్డులను రద్దు చేసే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్నారు. ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మార్చి 28న‘చలో ఢిల్లీ’ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరండని ఏఐసిబిసిడబ్ల్యు పిలుపు నిచ్చారు., జిల్లా సెక్రటరీ రామిల్ల రాంబాబు, సలహా దారు మునిగురి హన్మంత్, సహాయక కార్యదర్శి మల్లారపు నర్సయ్య, ఉపాధ్య క్షుడు మామిడి రాజన్న, క్యాషియర్ పూదరి మల్లేశం, ప్రవీణ్, పనగంటి మల్లారెడ్డి, సతీష్ రావు, వెన్న మహేష్, అందె ప్రశాంత్,వెన్న మనీతేజ, తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా వాల్టా చట్టం ఉల్లంఘన

* రోజుల తరబడి దోచుకెళ్తున్న మట్టి దొంగలు

* జెసిబి, టిప్పర్లు సీజ్ చేసిన అధికారులు, పోలీసులు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట అర్బన్ మండలంలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి మట్టిని యదేచ్చగా తరలిస్తున్నారు. రోజుల తరబడి మట్టిని దొంగలు దోచుకెళ్తుంగా,ఆయా గ్రామాల ప్రజల ఫిర్యాదుతో శుక్రవారం రెవెన్యూ అధికారులు, త్రీటౌన్ పోలీసులు జెసిబితోపాటు,మూడు టిప్పర్లను సీజ్ చేశారు. త్రీటౌన్ పోలీసులు,రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బక్రిచెప్యాల, వెల్కటూర్ గ్రామల మధ్య వ్యవసాయ పొలంలో నుండి గత మూడు రోజులుగా ఇష్టారీతినా మట్టిని టిప్పర్లలో తరలిస్తుండడంతో దుమ్ముతో ఇబ్బంది పడిన గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో మట్టిని తరలిస్తున్న ప్రాంతానికి చేరుకొని వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ పట్టా భూమి అయినా సరే ఎవరైనా మట్టిని తరలించాలంటే మైనింగ్, రెవెన్యూ నుంచి అనుమతులు తీసుకోవాలని,లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# సమర్థవంతంగా పది పరీక్షలు

14.138 విద్యార్థులు

79 కేంద్రాలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

జిల్లా కలెక్టర్ మనుచౌదరి





**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** జిల్లాలో 10వ తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందు అన్ని ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవా రం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్ జిల్లా కలెక్టరేట్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21న నుండి ఏప్రిల్ 4వ తేదీవరకు 10వ తరగతి పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సం బంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సుచిం చారు. జిల్లాలో 79 పరీక్ష కేంద్రాల్లో 14138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.వీరిలో రెగ్యులర్ స్టూడెంట్లు 141,24 విద్యార్థులు ప్రైవే టు విద్యార్థులు 14 మంది ఉన్నారు. పరీక్షలను నిస్పాక్షపాతంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్కాడ్, సిట్టింగ్‌స్కాడ్‌లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలన్నారు. స్ట్రాంగ్ రూ ంల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసుకొని, ఇందు కోసం కస్టోడియన్ డిపార్టుమెంటు అధికారులను నియమించాలని ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ముం దుగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, ఆడిషనల్ డిసిపి సుభాష్, డిఇఒ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమా ర్, డిపిఓ దేవకిదేవి. విద్యుత్, ఆర్టీసి, పోస్టల్, ఆర్‌డబ్లుఎస్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

# లక్ష్యానికి అనుగుణంగా వస్త్ర ఉత్పత్తి

* హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

* వివిధ శాఖల ప్రభుత్వ ఆర్డర్లు, ప్రొడక్షన్‌పై సమీక్ష

* హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** లక్ష్యానికి అనుగుణంగా వస్త్రం ఉత్పత్తి చేయాలని హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమకు చెందిన పరిశ్రమల యజమానులు, ఆసాములు, కార్మికులు, టెక్స్‌టైల్ పార్క్ పరిశ్రమల యజమానులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం హ్యాండ్లూమ్స్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముం దుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల వివరాలను వెల్లడించారు. ఇప్పటిదాకా ఎంత ఉత్పత్తి చేశారో ఆరా తీశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ శాఖలు, సమగ్ర శిక్ష అభియాన్, మహిళా శక్తి చీరల ఆర్డర్లపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా శాఖలకు ఆయా శాఖల నుండి సిరిసిల్ల పరిశ్రమకు అందించిన ఆర్డర్లలో 50శాతం మార్చి 15వ తేది లోగా అందజే యా లని ఆదేశించారు. ఈ సందర్భంగా హ్యాండ్లుమ్స్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రా మయ్య ర్ మాట్లాడుతూ జిల్లాలోని యజమానులు, ఆసాములు, కార్మికుల్లో అర్హులైన వారందరికీ బ్యాంకుల నుండి రుణాలు అందజేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన బకాయిలను త్వరలోనే అందజేస్తామని ప్రకటించారు. విద్యుత్‌బ్యాక్ బిల్లింగ్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిఎం టిజిఎస్‌కో రఘునందన్, ఎడిటిజిఎస్ కో సందీప్ జోషి గౌతం, ఏడి హ్యాండ్లుమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ సాగర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడికి మిత్రుల చేయూత

* రూ.1.63 లక్షల సాయం అందజేత



**ప్రజాపక్షం/ధర్మపురి :** కూరగాయల షాప్‌లో పని చేస్తున్న ఓ నిరుపేదకు క్యాన్సర్‌వ్యాధి సోకడంతో ఫేస్‌బుక్ మిత్రులు అండగాఉండి రూ.లు1.63 లక్షలు విరాళాలు సాయంగా అందించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రానికి చెం దిన నరేందుల దామోదర్ ఓ కూరగాయల షాపులో పని చేస్తూ పేదరికంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. వ్యాధి సోకడంతో కుటుంబం ఖర్చులతో పాటు వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ ఫిబ్రవరీ 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి సాయం అందించాలని మిత్రులను కోరాడు. దాతలు స్పందించి దామోదర్ భార్య గంగాభవానీ బ్యాం క్ ఖాతాకు రూ.లు 1.63 లక్షలు విరాళాలు పంపించారు. వాటి నుండి తక్షణ వైద్య ఖర్చులకు రూ.లు 50వేలను స్థానిక సిఐ రాం నర్సింహారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బాధిత కుటుంబానికి పంపిణీ చేయించారు. మిగతా విరాళాలను భవిష్యత్ వైద్య ఖర్చులకు తన భార్య సేవింగ్ అకౌంట్‌లో నిల్వ ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉదయ్ కుమార్, యూనియన్ బ్యాంక్ మేనేజ్ ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫోకస్

## లింక్ దొరికింది!



సూపర్ కండక్టివిటీ కోసం అన్వేషణ జరుపుతున్న సమయంలో, ఎప్పుడో తప్పిపోయిన ఒక లింక్ బయటపడింది. దానినే శాస్త్రవేత్తలు 3వ అయస్కాంతతత్వంగా పేర్కొంటున్నారు. 'ఆల్టర్ మాగ్నెటిజం' అనేది శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్న ఓ రకమైన అయస్కాంతత్వం. ఇక్కడ పదార్థంలోని అయస్కాంత కదలికలు 'యాంటీఫెరో మాగ్నెటిజం' మాదిరిగానే ప్రత్యామ్నాయ దిశలో ఉంటాయి. అయితే, స్ఫటిక నిర్మాణంలో అదనపు ట్విస్ట్‌తో ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంది. ముఖ్యంగా ఫెర్రో అయస్కాంతత్వం, యాంటీఫెరో అయస్కాంతత్వం కంటే ఈ అయస్కాంతత్వం మూడవ తరగతి'ని సృష్టిస్తుంది. ఇది నెట్ మాగ్నెటైజేషన్ లేకుండా ప్రత్యామ్నాయ భ్రమణాల ద్వారా వర్గీకరించబడుతుంది. అయినప్పటికీ దాని ఎలక్ట్రానిక్ బ్యాండ నిర్మాణంలో బలమైన స్పిన్ ధ్రువణాన్ని ప్రదర్శిస్తోంది. నేచర్ జనరల్‌లో ప్రచురించిన నివేదికను అనుసరించి, కొత్త హైస్పీడ్ మాగ్నెటిక్ మెమరీ పరికరాల రూపకల్పనలో విప్లవాత్మక మార్పులు చేయగలుగుతాయి. మెరుగైన సూపర్ కండక్టింగ్ మెటీరియల్‌ల అభివృద్ధిలో ఇప్పటి వరకూ సమాధానం లభించని అంశాలను పరిష్కరించగలుగుతాయి.

## గాజుగా మారిన మెదడు!

క్రీస్తు శకం 79లో సంభవించిన వెసువియస్ పర్వత విస్ఫోటనం కారణంగానే రోమన్ నగరమైన పాంపీ నామరూపాలు లేకుండా పోయిందని శాస్త్రవేత్తల అభిప్రాయం. అయితే, సమీపంలోని ఈ విస్ఫోటనం అక్కడికి సమీపంలోని హెర్క్యులేనియం ప్రాంతాన్ని కూడా ప్రభావితం చేసింది. ఇటీవల జరిపిన తవ్వకాల్లో లభించిన ఒక యువకుడి అస్థిపంజరంలో, మెదడుకు చెందిన గాజు అవశేషాలు బయటపడడం శాస్త్రవేత్తలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది. వారి అంచనా ప్రకారం, వెసువియన్ పర్వత విస్ఫోట సమయంలో ఉప్పొంగిన లావా కింద చుట్టుపక్కల ప్రాంతాలన్నీ సమాధి అయ్యాయి. అక్కడి నుంచి తవ్వితీసిన ఒక అస్తిపంజరాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించారు. అందులో మెరిసే నమూనాలను పరిశీలించినప్పుడు, వాటిని నాడీ కణాలుగా గుర్తించారు. అక్కడ గాజు ఎలా ఏర్పడిందనే అంశంపై మరింత లోతుగా అధ్యయనం కొనసాగించారు. 'సైంటిఫిక్ రిపోర్ట్స్'లో వచ్చిన నివేదికను అనుసరించి, సదరు యువకుడి మెదడు గాజుగా మారింది. సాధారణంగా కరిగిన ఇసుక వంటి ద్రవం త్వరగా చల్లబడినప్పుడు గాజు ఏర్పడుతుంది. తయారీదారులు కిటికీలు, పైకప్పులను ఈ విధంగా తయారు చేస్తారు. ఇసుక ఎడారిలో వెలుతురు పడినప్పుడు, 'ఫుల్గురైట్స్' అని పిలిచే గాజు ముద్దలు ఏర్పడతాయి. ఈ ప్రక్రియ సహజంగా కూడా జరుగుతుంది. అయితే, యువ రోమన్ మెదడు అవశేషాలు కనుగొనబడటానికి ముందు, గాజులాంటి జీవసంబంధమైన మృదు కణజాలాలు మరెక్కడా కనిపించకపోవడం గమనార్హం. 'నిజంగా గాజులాంటి మెదడు ఉందని మేము గ్రహించినప్పుడు, అది ఎలా సాధ్యం అనేది శాస్త్రీయ ప్రశ్న' అని రోమా ట్రె విశ్వవిద్యాలయంలో భూవిజ్ఞాన శాస్త్రవేత్త, అగ్నిపర్వత శాస్త్రవేత్త గైడో గియోర్డానో అన్నాడు. తన సహచరులతో కలిసి అతను ఈ అధ్యయనానికి డిఫరెన్షియల్ స్కానింగ్ క్యాలరీ మెట్రీ అనే సాంకేతికతను ఉపయోగించాడు. ఇది ఇప్పటికే గాజులాంటి మెదడు ముక్కలను వేడి చేయడం ద్వారా, అది ఏ ఉష్ణోగ్రత వద్ద ఏర్పడిందో నిర్ధారిస్తారు. 510 డిగ్రీల సెల్సియస్ (950ఓ ఫారెన్‌హీట్) కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద ముక్కలు నిర్మాణాత్మక మార్పులకు లోనయ్యాయని, ఇది మెదడు కణజాలం గాజుగా మారడానికి ప్రధాన కారణమని తాజా అధ్యయనం అభిప్రాయపడింది. హెర్క్యులేనియంను సమాధి చేసిన వేడి అగ్నిపర్వత బూడిద, రాతి లేదా వాయువు యొక్క వేగవంతమైన దాడి మెదడు భాగాలను గాజుగా మార్చడానికి కారణం కాదని పరిశోధకులు పేర్కొన్నారు. ఇలాంటి పైరోక్లాస్టిక్ ప్రవాహాలు 465 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద గరిష్టంగా పెరుగుతాయని కనుగొన్నట్టు తెలిపారు. మొత్తం మీద మెదడు గాజు శిలాజాలం ఇప్పుడు శాస్త్రవేత్తలకు భూవిజ్ఞాన అధ్యయనాలపై కొత్త అన్వేషణలకు మార్గం చూపుతున్నది.



## అన్వేషణ 'అనంతం'



ఈ విశ్వం అనంతమని అంటున్నారు. అందుకేనేమో, ఈ విశ్వాన్వేషణ కూడా అనంతంగా కొనసాగుతునే ఉంది. నిరంతరం ప్రశ్నలు వేసుకుంటూ... వాటికి సమాధానాలు వెతుక్కుంటూ ఉన్నాడు. ఒక కాలంలో అంతుబట్టని రహస్యాలు తర్వాతి కాలంలో ఛేదించాడు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతునే ఉంది. మత ఛాందసవాదులు చేసే ఎన్నో వితండ వాదనలకు శాస్త్రబద్ధమైన సమాధానాలు లభిస్తునే ఉన్నాయి. ఈ సృష్టి ఎలా జరిగిందనే ప్రశ్నకు సమాధానం కష్టం కాబట్టి, కొంత మంది సృష్టించిన మతం వేళ్లానుకోవడమేకాదు.. గత కొన్ని దశాబ్దాలుగా వెర్రితలలు వేస్తున్నది. ఫలితంగా విశ్వాన్వేషణ మరింత వేగవంతం కావాల్సిన అవసరం ఏర్పడింది. ఎంతో మంది శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. విశ్వం ఆవిర్భావం ఎవరో సృష్టించింది కాదని, 'బిగ్ బ్యాంగ్'తో మొదలైందని ఇప్పటికే పరిశోధకులు తేల్చిచెప్పారు. ఖగోళ శాస్త్రం స్పష్టం చేస్తున్న ఈ సిద్ధాంతాన్ని కొంత మంది సనాతన మత వాదులు ఇప్పటికీ నమ్మకపోవడం దురదృష్టకరం. 15 బిలియన్ సంవత్సరాల క్రితం 'బిగ్ బ్యాంగ్'తో నేటి ప్రకృతి ఆవిర్భావం మొదలైదందని, అప్పుడు ఆకాశం, కాలం, శక్తి, పదార్థం అనే తేడాలు లేవని పరిశోధనలు పేర్కొంటున్నాయి. స్టీఫెన్ హాకింగ్ వంటి ఎంతో మంది ప్రసిద్ధ శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని నమ్ముతున్నారు. విశ్వసృష్టి మొదటి దశలో గరుత్వాకర్షణ శక్తి, రెండో దశలో బలమైన పీడనం ఏర్పడ్డాయి. క్రమేణ విశ్వ విస్తరణ వేగం పెరిగింది. విశ్వం చల్లబడే కొద్దీ క్వార్క్‌ల నుండి ప్రోటానులు, న్యూట్రాన్లు వచ్చాయి. ఇంకా చల్లబడగా అణువులు రూపొందాయి. అలావున్న విశ్వపరిణామంలో ఎక్కడబట్టినా శక్తి (ఎనర్జీ) ప్రాధాన్యతే వుండేది. పదార్థ విజృంభణ ఆ తరువాతే వచ్చింది. చల్లదనం ఎక్కువ అవుతుంటే గురుత్వాకర్షణశక్తికి మూలంగా పదార్థం ఆసరా యిచ్చింది. పదార్థం ఘనీభవించి వివిధ రూపాలు దాల్చింది. హైడ్రోజన్, హీలియం, లిథియం అణువులు ఏర్పడేటందుకు వీలుగా ఎలక్ట్రాన్లను నూక్లి వశపరచుకుంది. అప్పటినుండే విశ్వం కనిపించసాగింది. వెలుగు యధేచ్ఛగా విహరించింది. విశ్వంలో వుండే ఈ ప్రోటాన్లనే మైక్రోవేవ్ రేడియేషన్ అంటున్నాం. అది నిరంతరం వ్యాపిస్తునే ఉందని, కాబట్టి, విశ్వానికి అంతం అనేది లేదని శాస్త్రవేత్తలు దాదాపుగా ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ అన్వేషణ రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతుంటే, ఛాందసవాదులు మాత్రం విజ్ఞాన శాస్త్రానికి అతీతంగా, మతవాదాన్ని ముందుకు తీసుకురావడం తిరోమన విధానాలకు తార్కాణం.

## ముప్పు తప్పింది..

భూమిని '2024 వైఆర్4' అనే గ్రహశకలం 2032లో ఢీకొట్టే అవకాశాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా', యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇఎస్ఎ) శాస్త్రవేత్తలు అధికారికంగా తోసిపుచ్చారు. 'అనడోలు ఏజెన్సీ'ని ఉటంకిస్తూ 'అజర్ బైకన్24'లో ప్రచురితమైన తాజా విశ్లేషణను అనుసరించి, గత కొన్ని నెలలుగా జరిపిన అధ్యయనాల ద్వారా, ఆ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం 0.001శాతానికి తగ్గింది. 40 నుండి 90 మీటర్లు (131 నుండి 295 అడుగులు) వెడల్పు ఉన్న ఉన్న గ్రహశకలం భూమికి దగ్గరకా వస్తున్న విషయాన్ని గత సంవత్సరం చివరిలో బయటపడింది. ఈ గ్రహశకలాన్ని చిలీలోని రియో హుర్టాడోలోని ఆస్టరాయిడ్ టెరెస్ట్రియల్‌ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్ (ఎటిఎల్ఎఎస్) టెలిస్కోప్ ద్వారా కనుగొన్నారు. దీని తీవ్రత, భూమిని ఢీకొనే సంభావ్యత ప్రారంభంలో హెచ్చుతగ్గులకు గురైంది. ఒక దశలో ఖగోళ శాస్త్రవేత్తలు ఈ ఆస్టరాయిడ్ మార్గాన్ని మరింత క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాద అవకాలు 3 శాతం వరకూ ఉన్నట్టు ప్రకటించారు. అయితే, ఇఎస్ఎకు చెందిన వెరీ లార్జ్ టెలిస్కోప్ (విఎల్‌టి) తోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఇతరత్రా అధ్యయన కేంద్రాల నుంచి వచ్చిన సమాచారాన్ని విశ్లేషించిన తర్వాత, '2024 వైఆర్4' భూమిని ఢీకొనే ప్రమాదం మరింత తగ్గినట్టు స్పష్టమైంది. ఈ ప్రమాదం పూర్తిగా తొలగిందని నూరు శాతం ఖచ్చితంగా చెప్పడానికి వీల్లేకపోయినా, ఈ గ్రహశకలం 2032 డిసెంబర్ 22న సురక్షితంగా భూమిని దాటుతుందని అంచనా వేస్తున్నామని నాసాకు చెందిన సెంటర్ ఫర్ నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్ స్టడీస్ చీఫ్ పాల్ చోడాస్ వ్యాఖ్యానించాడు. ఒక గ్రహశకల కదిలే మార్గాన్ని ఊహించడం లేదా అంచనా వేయడంలో చాలా ఇబ్బందులు ఉంటాయి కాబట్టి, ఏ విషయాన్నీ ఖచ్చితంగా చెప్పలేమని అన్నాడు. అయితే, ప్రస్తుత అధ్యయనాలను అనుసరించి, ప్రమాదం జరిగే అవకాశాలు దాదాపు లేవని స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా సోషల్ మీడియా తెగ భయపెడుతున్న ముప్పు తప్పిందన్న వార్త అందరికీ ఊరటనిస్తుంది.



## తిమింగలాల సంగీతం!

చక్కటి కంఠస్వరాన్ని 'కోకిల'తో పోల్చడం మనకు తెలిసిందే. అయితే, ఇకపై 'తిమింగలాల పాట' లేదా 'తిమింగలాల సంగీతం' అనాలేమో! ఎందుకంటే తిమింగలాలు చక్కగా పాడతాయని కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆరు సంవత్సరాలు నార్త్ పసిఫిక్ జలాల్లో, తిమింగలాలపై అధ్యయనం చేసిన శాస్త్రవేత్తల బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఈ బృందం నివేదికను అనుసరించి, 'హంప్ బ్యాక్ వేల్స్', 'బ్లూ వేల్స్', 'ఫిన్ వేల్స్'కు సంగీత పరిజ్ఞానం ఉందని, పియానో వాటించినప్పుట్టు రాగాలు ఆలపిస్తాయి. ప్రత్యేకించి మంచి ఆహారం లభించినప్పుడు, ఆనందంతో పరవశమై, సంగీతాలాపాన చేస్తాయి. సంగీతానికి మనుషులు, పక్షులు, జంతువులు అనే తేడా లేదని ఈ అధ్యయనం మరోసారి రుజువు చేసింది.



## రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలి: గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** కేంద్ర ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. అఖిలభారత తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభల కరపత్రం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని మూసి పరిరక్షణ చేయాలన్నారు. రైతులు వేసిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. గంధమల్ల రిజర్వాయర్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం నాయకులను మార్కెట్ కమిటీలలో నామినేట్ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపు యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డి గూడెం స్టేజి వద్ద జరిగే ఏఐకేఎస్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బండి జంగమ్మ, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబొయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారు, గోపగాని రాజు, మాటూరు మల్లయ్య, పాకలపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్‌ని ఆదరించాలి.. మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలి..



**ప్రజాపక్షం/ హనుమకొండప్రతినిధి:** కంప్యూటర్‌తో పోటీ పడుతున్న యుగం లో మూఢవిశ్వాసాలకు చోటు ఇవ్వకుండా విద్యార్థులు సైన్స్ పై ఆధారపడాలని హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి కోరారు. ఫిబ్రవరి 28 రోజున సైన్స్ దినోత్సవ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ తో పోటీపడుతున్న కాలంలో ప్రచార సాధ్యమాలలో మూడ మూఢనమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యతిస్తూ సైన్స్ ను తక్కువ చేయడం బాధాకరం అన్నారు. పూర్వం నుండి సోక్రటీస్, గెలీలియో, బ్రోనో ఆధునిక సమాజంలో చార్లెస్ డార్విన్, ఐన్ స్టీన్,లీవ్ ప్రచరీస్, స్టీఫెన్ హాకింగ్, మనదేశంలోసివి రామన్ లను ఆదర్శంగా తీసికోవాలన్నారు. సైన్స్ ను నమ్మి సైన్స్ తమ మతం అని, దానిని ప్రచారం చేస్తామని నినదించిన నోబుల్ బహుమతి గ్రహీత సివి రామన్ ఆలోచనలు, ముందు చూపును నేటితరం డాక్టర్స్, ఇంజనీర్స్, సైంటిస్టులు, ఇతర ఉన్నత విద్యావంతులు మూడ నమ్మకాలను విశ్వసించకుండా సైన్స్ ను అభివృద్ధి కొరకు పాటు పడాలన్నారు. సిపిఐ జిల్లా నాయకులు బత్తిని సదానందం, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, దామెర సుదర్శన్, రైతు నాయకులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువులలో నీళ్లు నింపి ఎండుతున్న వరి పొలాలను కాపాడాలి

### మాజీ ఎంఎల్ఎ, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** దేవాదుల ద్వారా చెరువులలో నీళ్లు నింపి ఎండుతున్న వరి చేనులను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో ఎండిన పంట పొలాలను సీపీఐ, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. గ్రామంలో ఎండిపోయి నెర్రెలు బారిన బర్రెలు, గొర్రెలు, పశువులు మేయడం వారికి కనిపించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లాలో దేవాదుల ద్వారా నీరు తీసుకొచ్చి చెరువులు నింపడంలో ఇరిగేషన్ అధికారుల, వ్యవసాయ అధికారుల సమన్వయ లోపం, వారి వైఫల్యం వలన పొట్ట దశకు వచ్చిన వరి చేనుకు ఈ దశలో నీరు లేకపోవడం వలన వడ్లకొండ, గానుగుపహాడ్, మరిగడి, పెద్దపహాడ్, ఎర్రకుంట తండా, గ్రామాల నుండి రైతులు పెద్ద సంఖ్యలో కలెక్టర్ కార్యాలయం ముందు వచ్చి ధర్నా చేసే పరిస్థితి రావడానికి ఇరిగేషన్ అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. జనగామ జిల్లాలోని అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి ఉన్నందువలన పంటలేసినటువంటి ప్రతి రైతు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారన్నారు. సుమారు నాలుగు, ఐదు వందల ఫీట్ల లోతు వేసినా కూడా బోర్లు ఎత్తిపోయాయయన్నారు. వడ్లకొండ గ్రామంలోని రెండు, మూడు వందల ఎకరాల పొలాలు ఎండిపోయినట్లు రైతులు ఆవేధన వ్యక్తం చేశారన్నారు. కనీసం ఈ రెండు, మూడు రోజులలో గనుక అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని నీళ్లు వదిలినట్లయితే కొంత మేర కన్నా పంటలు దక్కుతాయని ప్రభుత్వాన్ని, అధికారులను ఆయన వేడుకున్నారు. ఇక్కడి నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత వహించి నీరు తీసుకొచ్చేంత వరకు ప్రత్యేక కృషి చేస్తే తప్ప ఇది సాధ్యం కాదన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రైతుల ప్రధాన సమస్య నీటి సమస్య కావున చెరువులు నింపడం కోసం అధికారుల మీద ఒత్తిడి పెంచి తక్షణమే గనుక చర్యలు తీసుకోకపోతే రైతులు తీవ్రమైన పోరాటాలకు సిద్ధమైతే దానికి ప్రజా ప్రతినిధులు, అధికారులందరు బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన రెండు రోజులలో నీటిని వదిలి చెరువులు, కుంటలు నింపినట్లయితే ఎండిపోయినవి పోనూ మిగతా వరి పంటను రక్షించిన వాళ్లం అవుతామన్నారు. రైతులు అధైర్యపడకుండా పోరాటం ద్వారా సాధించుకుందామని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోటె శ్రీశైలం, రైతు సంఘం రాష్ట్ర కమిటి సభ్యులు ఆది సాయన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పరి సోమయ్య, బెదిగం చంద్రయ్య, కృష్ణ, వెంకటాద్రి, సీపీఐ నాయకులు గుర్రం మధు, సుదర్శన్, డాక్టర్ పుప్పాల ఐలయ్య, నువ్వుకంటి నర్సింహులు, చల్లగుండ సురేందర్ రెడ్డి, నామాల యాదగిరి, ఉప్పలయ్య, గైని కిష్టయ్య, కాడబోయిన రవి, నర్సయ్య, గుత్తి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## శివన్న అడుగుజాడల్లో పోరాటాలు కొనసాగిస్తాం



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి:** భక్తి శివన్న అడుగుజాడల్లో సీపీఐ కార్యకర్తలు, నాయకులు పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని ధనోర గ్రామంలో భక్తి శివన్న 25వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సీపీఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం భక్తి శివన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో అనేక సార్లు జైలు జీవితం అనుభవించారన్నారు. జమిందార్, జాగిర్దర్, దేశ్‌ముక్‌ల వేల ఎకరాల భూములను భీంపూర్ మండలంలోని పేదలకు పంచారని తెలిపారు. 'రోటీ కపుడా జౌర్ మఖాన్' 'దున్నేవాడికి భూమి' అనే నినాదంతో అనేక ఉద్యమాలు చేసి కడవరకు సీపీఐ ఉద్యమంలోని పాల్గొని ఆయన చేసిన సేవలు మరువలేవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు బుర్రి సటువాజి, మాజీ సర్పంచ్ పెద్దింటి భూమన్న, సభా అధ్యక్షులు, సీపీఐ భీంపూర్ మండల కార్యదర్శి పెద్ది సత్యనారాయణ, దనోరా శాఖ కార్యదర్శి మేకల రవి, నాయకులు అందుగుల స్వామి, మంత్రి భూమయ్య, మడవి పూజ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం అరికట్టాలి

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధిః** రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలుచేపడుతున్న ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం అరికట్టాలనీ, అలాంటి కళాశాలలపై ప్రభుత్వం తీవ్ర చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహయకార్యదర్శి సి.రాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ డిఐఈఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ కళాశాలలు, ఇతర కార్పోరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులను మభ్య పెడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని విమర్శించారు. ఇంటర్ విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం వారిని నివారించే ప్రయత్నం కూడా చేయడం లేదు. కావున ఇంటర్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కార్పోరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసి, వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకి పంపాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండు చేశారు. లేని యెడల ఆయా విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న శ్రీ చైతన్య, నారాయణ, శ్రీ వశిష్ఠకి సంబంధించిన వారిని విద్యార్థి తల్లిదండ్రులు తరిమి కొట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకత్వం కూడా ఎక్కడికక్కడ అడ్డుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, విద్యావ్యాపారాన్ని అడ్డుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యావ్యాపారాన్ని చేస్తున్న కార్పోరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవద్దని కోరడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మణ్ జిల్లా నాయకులు ప్రవీణ్, గణేష్, తదితరులు ఉన్నారు.

### నారాయణ, శ్రీచైతన్య కళాశాలలపై చర్యలకు డిమాండ్



**కరీంనగర్‌ప్రతినిధిః** ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కరీంనగర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో సూపరెండెంట్ మల్లికార్జున్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారని పేర్కొన్నారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా విధ్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పీఆరోవోలను, నిరుద్యోగ యువతను పెట్టుకుని వివిధ ఆకర్షణీయమైన ప్రకటనలతో రాయితీల పేరుతో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ఇంటర్ విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోయారు. కార్పోరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, మచ్చ అభిషేక్, అక్షయ్ కుమార్, మహేష్ తదితరులున్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ




ప్రజాపక్షం/నర్సాపూర్ (జి) : నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల శుక్రవారం రోజన నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి పరిశీలించారు.ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ల కు చేరుకున్న జిల్లా ఎస్పీ అక్కడి అధికారులకు పలు సూచనలు చేస్తూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలని పోలీస్ స్టేషన్ అదికారులకు,సిబ్బందికి సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు,సిసి కెమెరాలు,సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్లో ఉన్న తీవ్రమైన నేరాల సి.డి.ఫైల్స్,స్థిరాస్థి చోరీలు,ఐటీ కేసులు ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు.అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో కల నేర ప్రవృత్తి కల వారిని ప్రతి రోజు తనిఖీ చేయాలని,ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని,పోలీస్ స్టేషన్ల పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలి.పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు.అలాగే ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియామాలు పాటించాలని తాగి వాహనాలు నడపవద్దని అన్నారు.అలాగే బ్లూ కోట్స్,పెట్రోల్ కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని,డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ స్టేషన్ అధికారులు,సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ త ఏఎస్పీ రాజేష్ మీన ఐపీఎస్,నిర్మల్ గ్రామీణ సీఐ కృష్ణ,నర్సాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి కిరణ్,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోలేటి పార్కులో ఫోటోషూట్లకు అనుమతి ఇవ్వాలి: విజయ భాస్కర్



ప్రజాపక్షం/ రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్షిప్ లో ఉన్న పార్కులో ఫోటోషూట్లు, ఫోటోలు దిగడానికి అనుమతించాలని ఎఐటియుసి నాయకులు శుక్రవారం జిఎం విజయ భాస్కర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి మాట్లాడుతూ గడిచిన కొన్ని నెలలుగా సింగరేణి యాజమాన్యం పార్కులో ఫోటోషూట్లను నిషేధించిందని తెలిపారు. గోలేటి పట్టణ ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల కోరిక మేరకు ఫోటోలు దిగడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. పార్కులో అందరినీ అనుమతిస్తే గోలేటి పార్క్ కు మంచి గుర్తింపు లభిస్తుందని, స్థానిక ప్రజలు వినోదాన్ని ఆస్వాదించేందుకు ఇది ఉపకరిస్తుందని పేర్కొన్నారు. జిఎం విజయ భాస్కర్ స్పందించి ప్రజల కోరిక మేరకు ఫోటోలు దిగడానికి అనుమతిస్తామని హామీ ఇవ్వడంతో ఎఐటియుసి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్ బాబు, మారం శ్రీనివాస్, పి. రాజయ్య, నాయకులు జాంగిర్ భాష, ఎస్ నరేష్, ఆవుల మల్లేష్, ఎండి సమి పాల్గొన్నారు.

## అక్రమ ఇంటి నెంబర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ మునిసిపల్ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు జరుపుతూ యథేచ్చగా ఇంటి నెంబర్లను వేయించుకొని రిజిస్ట్రేషన్లు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బిజెపి నాయకులు మునిసిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో ప్రభుత్వ భూములలో యథేచ్చగా నిర్మాణాలు జరుపుతూ, ప్రభుత్వం నుండి లబ్ది పొందిన ఇండ్లను సైతం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్న వారికి మోటివేషన్ ధృవపత్రాలు అందించకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. అక్రమ భూములను యథేచ్చగా అధికారికంగా ధృవపత్రాలు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుప్తి ప్రసాద్, నాయకులు గుడుగుట్ల శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, సిద్దార్థ్ పాల్గొన్నారు.

## సిసిరోడ్డు పనులు పరిశీలించిన డిఇ



ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుండి మండలకేంద్రంలోని పాత బస్టాండు వరకు కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ డీఈ ప్రభాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ 20 లక్షలు మంజూరు కావడంతో సీసీరోడ్డు పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు పనులను నాలుగు కాలాలు నిలిచి ఉండేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. డీఈ వెంట ఏఈ మొగులయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు అనీస్‌పటేల్, గాండ్ల రమేష్, జమీల్, రాములురాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 1 నుండి సెమిస్టర్ పరీక్షలు

ప్రజాపక్షం/బైంసా: బైంసా పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సెంటర్(140) బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నుండి 5వ సెమిస్టర్ 3వ,1వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య తెలిపారు.ఈ పరీక్షలు ఈ నెల 1వ తేదీ నుండి 21 వరకు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని,ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తోపాటు ఏదైనా గుర్తింపు కార్డుని తీసుకొని పరీక్షకు హాజరు కావాలని అధ్యయన కేంద్రం సమన్వయకర్త రఘునాథ్,కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

### గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్/మాక్లూర్: మండల కేంద్రమైన మాక్లూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఎలియా తండాలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. స్తానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి పిహెచ్‌సి నిర్వహణ తీరును గమనించారు. అన్నిరకాల ఔషధాలు సరఫరా అవుతున్నాయా అన ఆరా తీశారు. రక్తపోటు, డయాబెటిక్ పరీక్షలు ప్రతి రోజు సగటున ఎంత మందికి నిర్వహిస్తున్నారు. రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వాక్సినేషన్ రూంను సందర్శించి శీతలీకరణ ఉంచిన వాక్సిన్‌లను, స్టోర్ రూంలో మందుల గడువు తేదీలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కనీసం రెండురోజులకు ఒకసారైనా ఆసుపత్రి పరిసరాలు శుభ్రం చేసేలా సిబ్బందిని కేటాయించాలని స్తానిక ఎంపివోను ఆదేశించారు. స్తానికంగా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఏలియా తండాలో గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకులాన్ని సందర్శించి, విద్యార్థుల కోసం వండిన బోజనాన్ని పరిశీలించారు. కొత్త బియ్యం కేటాయించడం వల్ల అన్నం కాస్త మెత్తగా అవుతుందని నిర్వాహకులు తెలుపగా, గురుకులానికి కేటాయించిన బియ్యం నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి నాణ్యమైన సన్నబియ్యం కేటాయించాలని ఆదేశించారు. స్టోర్ రూంలో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు, వంటనూనె ప్యాకెట్లు, పసుపు, కారంపొడి ప్యాకెట్లను, ఇతర సరుకులను పరిశీలించారు. విద్యార్తులకు మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట మాక్లూర్ డిప్యూటి తహసీల్దార్ పద్మలత, గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యారాణి తదితరులున్నారు.

## సైన్స్ తోనే మానవాళికి విజ్ఞానం

ప్రజాపక్షం/జైనూర్: సైన్స్ అభివృద్ధితోనే మానవాళికి విజ్ఞానం లభించిందని, విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జైనూర్ సిఐ రమేష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఒకెజిఎస్ స్కూల్ లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిఐ రమేష్, విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఒ జ్ఞానేశ్వర్, ఎస్ఐ సాగర్, మాజీ వైస్ ఎంపిపిలు షేక్ రషీద్, చిర్లే లక్ష్మణ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫేరోజ్ ఖాన్, యువజన నాయకులు జన్నవార్ పవన్ కుమార్, కనక గంగారాం, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



## అధికారులను నిర్బంధించిన రైతులు



ప్రజాపక్షం/బోధన్: నిజామాబాద్ జిల్లా సాలూరా మండలం, సాలూర క్యాంప్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులను నిర్బందించారు. నిజాంసాగర్ డి28 కెనాల్ ద్వారా సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాలు ఎండిపోతుంటే రైతులు తట్టుకోలేక శుక్రవారం నిజాం సాగర్ డి43 కెనాల్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు రైతులు అడ్డుకొని సాలూరా క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాళం వేసి బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని రైతులను సముదాయించి తాళం తీసి అధికారులను బయటకు తీశారు.

## శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగ

### కలెక్టర్ కుమార్ దీపక్




ప్రజాపక్షం/నస్పూర్: జిల్లాలో రంజాన్ పండుగను ప్రజలకు శాంతియుత వాతావరణంలో సామరస్యంగా జరుపుకోవాలని, సంతోషంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాసరావు, హరికృష్ణ, మంచిర్యాల, జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు లతో కలిసి మండలాల తహశిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు, ముస్లిం మత పెద్దలతో రంజాన్ పండుగ వేడుక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగలను ప్రజలంతా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. రంజాన్ మాసం, ఈద్‌ఉల్‌ఫితర్ పండుగ నిర్వహణ కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, రేషన్ ఇతర సౌకర్యాలపై శ్రద్ధ వహించాలని, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్, త్రాగునీటి సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రార్థన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా జరుగాలని, రంజాన్ మాసంలో ఏ ప్రాంతాలోనూ అనవసరమైన లోడ్ షెడ్డింగ్ను అనుమతించకూడదని, ఇఫ్తార్, సెహ్రీ సమయాలలో నిరంతయారంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలందరు పండుగలను సామరస్యంతో శాంతియుత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు (6238) మంది విద్యార్థులు (30) సెంటర్లు

మార్చ్ 5 నుంచి 23 వరకు పరీక్షలు

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ నిర్వహించడానికి అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతించరాదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగు నీరు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో పరీక్ష పేపర్లను తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, రబ్బర్, హాల్ టికెట్లను మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ప్రతి సెంటర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్ళతో బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు కాంపౌండ్ వాల్ లేని వాటికి బారికేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీసు యాక్ట్



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి: జిల్లాలో నెల రోజుల పాటు 30,30 (ఎ) పోలీసు యాక్ట్ అమలు లో ఉన్నట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు ( మార్చ్ 1వ తేది నుండి 31 వరకు ) జిల్లా వ్యాప్తంగా 30(30 ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు,ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు ,నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్ సభలు సమావేశాలు నిర్వహించరాదని శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా ప్రజాధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు ,ప్రజాప్రతినిధులు ,వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబందిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## బస్టాండ్‌లో గంజాయి మొక్క కలకలం



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో శుక్రవారం గంజాయి మొక్క కనిపించడం కలకలం రేపింది. బస్టాండ్ లో బస్సులు వెళ్లే దారి పక్కన చెత్తలో గంజాయి మొక్క పెరిగింది. రోజుకు వేల మంది ప్రయాణికులు ఇక్కడకు వస్తుండగా, ఇలాంటి మత్తు పదార్థాల మొక్క బహిరంగ ప్రదేశంలో పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ విషయాన్ని స్థానికులు అంబేద్కర్ చౌక్ లోని పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మొక్కను తొలగించారు. ఈ ఘటనపై ఆర్టీసి డిఎం విశ్వనాథ్ ను సంప్రదించగా గంజాయి మొక్క పెరగడంపై తమకు ఎటువంటి సమాచారం లేదని, చెత్తలో సహజంగా పెరిగి ఉండొచ్చని తెలిపారు.

## రంజాన్ ఉపవాసాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు

### కలెక్టర్ అభిలాష అభినవ్




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ముస్లిం సోదరులు ఉపవాసం ఉండే సమయాల్లో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో ఎస్పీ జానకి షర్మిల తో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేకర పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని,మసీదుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలి అని సూచించారు. ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీరు, అందుబాటులో ఉంచాలని, ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణ సముదాయాలను అదనపు సమయాల్లో తెరిచి ఉండే విధంగా అనుమతించడం జరుగుతుందన్నారు. ముస్లింల సహాయార్థం టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతు, రంజాన్ మాసంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మసీదుల వద్ద ప్రార్థనా సమయాల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దుకాణాలను అదనపు సమయాల్లో తెరిచి ఉంచేందుకు అనుమతులు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి,మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, మున్సిపల కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్,జాదవ్ కృష్ణ,రాజేష్ కుమార్,ముస్లిం మత పెద్దలు,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## తూకంలో భారీ మోసం..

### ప్రశ్నించిన పత్తి రైతుపై మిల్లు యజమాని దాడి





ప్రజాపక్షం/చెన్నూరు : పత్తి కొనుగోళ్లలో ఓ పత్తిమిల్లు నిర్వాహకుల భారీ మోసం ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ పత్తి వాహనాన్ని ఓ పత్తిమిల్లులో తూకానికి చెన్నూరు మండలంలోని ఎల్లక్కపేటలో గల ఆదిశంకరాచార్య పత్తిమిల్లు తూకం దాదాపు క్వింటా నర తేడా రావడంతో మోసపోతున్నామని గమనించిన ఓత్కులపల్లి గ్రామానికి చెందిన జక్కుల రవి అనే రైతు ఇదేంటని ప్రశ్నించగా, అతనిపై మిల్లు నిర్వాహకులు దాడి చేయడం తీవ్ర కలకలం రేపింది. మిల్లు నిర్వాహకుల మోసంపై అధికారులకు పిర్యాదు చేసేందుకు మిల్లు నుండి రైతు వెళ్తుండగా ఎక్కడ తమ మోసం బయటపడుతుందో అనే భయంతోనే తూకం బిల్లును లాగేసుకునే ప్రయత్నం చేస్తూనే మిల్లు నిర్వాహకులు తమపై దాడి చేసారని రైతు రవి ఆవేదన వ్యక్తం చేశాడు. మిల్లు నిర్వాహకులు చేస్తున్న భారీ మోసం బయట పడడంతో అధికారుల తీరుపై, మిల్లు నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వాహనానికి ఏకంగా క్వింటా నర గండి కొడుతున్న ఇట్టి మిల్లు నిర్వాహకుల చేతిలో వేల మంది రైతులు మోసపోయారని, యాడాదంతా కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్న పత్తి రైతులను ఇలాంటి మోసలకు పాల్పడుతున్న మిల్లు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, మోసపోయి దాడికి గురైన రైతు రవికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## చదువుకు పేదరికం అడ్డుకాదు...




సిఐ వెంకటరాజాగౌడ్

ప్రజాపక్షం/రామాయంపేట: చదువుకు పేదరికం అడ్డుకాదని రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ అన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలోని స్నేహ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలు ముగిసేవరకు టీవీలు, ఫోన్‌లు చూడకుండా ఉండాలన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. తహశీల్దార్ రజినికుమారి మాట్లాడుతూ జీవితంలో ఇంటర్ విద్యకు చాలా ప్రాదాన్యం ఉందని ఇప్పుడు తీసుకొనే నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. మంచిగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలలకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వలిశెట్టి సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు వెంకుగారి రాంరెడ్డి, రాములు, రోజాతో పాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ



## అఫ్ఘాన్ బ్యాటర్స్ ఆన్ ఫైర్

**50 ఓవర్లలో 273 పరుగులు చేసి ఆలౌట్ అయిన అఫ్ఘానిస్థాన్**

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో అఫ్ఘానిస్థాన్ జట్టు అంచనాలకు మించి అదరగొడుతోంది. ఆటగాళ్లు ఎంతో అనుభవజ్ఞుల్లా ఆడుతున్నారు. ఈ టోర్నీలోని తమ రెండో మ్యాచ్‌లోనే అగ్రజట్టు ఇంగ్లాండ్‌ను ఓడించిన అఫ్ఘాన్లు.. తాజాగా ఆస్ట్రేలియాతో జరుగుతోన్న కీలక మ్యాచ్‌లో అదిరే ప్రదర్శన చేశారు. దీంతో ఆస్ట్రేలియా ముందు 274 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది అఫ్ఘానిస్థాన్. నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులు చేసి ఆలౌట్ అయింది.
వాస్తవానికి తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (0) వికెట్ కోల్పోవడంతో అఫ్ఘాన్‌కు మంచి శుభారంభం దక్కలేదు. కానీ ఆ తర్వాత నుంచి ఆటగాళ్లు మంచిగానే రాణించారు. అఫ్ఘానిస్థాన్ బ్యాటర్లలో సెదీఖుల్లా అటల్ (95 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 85 పరుగులు) టాప్ స్కోరర్ గా నిలిచాడు. ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను కాసేపు ఆడుకున్నాడు. ఇబ్రహీం జద్రాన్ (28 బంతుల్లో 2 ఫోర్ల సాయంతో 22 పరుగులు), హష్మతుల్లా షాహిది (49 బంతుల్లో 20) నామమాత్రపు పరుగులు చేశారు. చివర్లో అజ్మాతుల్లా ఒమర్జాయ్ (63 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌ల సాయంతో 67) విజృంభించి స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. 270 పరుగులు దాటించాడు. మిగతా వారు విఫలమయ్యారు. చివరి వికెట్‌గా నూర్ అహ్మద్ (6) వెనుదిరిగాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో బెన్ డ్వారషూస్ 3 వికెట్లు పడగొట్టాడు. స్పెన్సర్ జాన్సన్, అడం జంపా తలో రెండు వికెట్లు తీశారు. నాథన్ ఎల్లీస్, గ్లెన్ మ్యాక్ వెల్ తలో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ గెలిస్తే సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. లేదంటే ఇంటి ముఖం పడుతుంది.

## కేరళ 342 ఆలౌట్



### త్రుటిలో సచిన్ బేబీ సెంచరీ మిస్!

**నాగ్‌పూర్:** విదర్భతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్‌లో కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలోనే శుక్రవారం (మూడో రోజు) ఆట ముగియగా.. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 37 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఓవర్ నైట్ స్కోరు 131/3తో మూడో రోజు ఆటను కొనసాగించిన కేరళ.. 211 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లు వికెట్లు కోల్పోయింది. సచిన్ బేబీ (98) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఆదిత్య సర్వాటె (79) రాణించాడు. మహ్మద్ అజారుద్దీన్ (34), జలజ్ సక్సేనా (28), సల్మాన్ నిజార్ (21) పరుగులు చేశారు. విదర్భ బౌలర్లలో దర్శన్ నల్కండే, హర్ష్ దూబె, పార్థ్ రేఖడే మూడేసి వికెట్లు పడగొట్టారు. యశ్ ఠాకూర్‌కు ఒక వికెట్ దక్కింది. మొదటి ఇన్నింగ్స్‌లో విదర్భ 379 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

## ఇంగ్లాండ్ కెప్టెన్సీకి జాస్ బట్లర్ గుడ్‌బై..

### కొత్త సారథి అతడేనా?



ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. వరుస పరాజయాల నేపథ్యంలో అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూపు స్టేజీలోనే ఇంగ్లాండ్ టోర్నీ నుంచి బయటకు వచ్చేసిన విషయం తెలిసిందే. ఇటీవల భారత్‌తో జరిగిన టీ20, వన్డే సిరీసుల్లోనూ ఇంగ్లాండ్ ఘోర పరాభవం ఎదుర్కొంది. ఈ పరిణామాలే బట్లర్ రాజీనామా నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. శనివారం దక్షిణాఫ్రికాతో జరగబోయే మ్యాచ్ తర్వాత కెప్టెన్సీ నుంచి వైదొలుగుతానని బట్లర్ ప్రకటించాడు. జట్టు కోసం సరైన నిర్ణయం తీసుకున్నానని భావిస్తున్నానని, కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్‌తో కలసి వేరే ప్లేయర్ జట్టును ముందుకు నడిపిస్తాడు అని జాస్ చెప్పాడు. తాను కెప్టెన్సీ నుంచి మాత్రమే దూరమవుతున్నానని, జట్టులో ఎప్పటిలానే కొనసాగుతానని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్ జట్టుకు నాయకత్వం వహించడం తన జీవితంలో గర్వకారణమని తెలిపాడు. ఇయాన్ మోర్గాన్ నుంచి 2022 జూన్‌లో నాయకత్వ బాధ్యతలు అందుకున్నాడు. ఆ ఏడాది టీ20 ప్రపంచకప్‌లో జట్టును గెలిపించాడు. అయితే ఆ తర్వాత వరుస పరాజయాలను జట్టును చుట్టుముట్టాయి. 2023 వన్డే ప్రపంచకప్, 2024 టీ20 ప్రపంచకప్‌లో జట్టు పేలవ ప్రదర్శన చేసింది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో జట్టు నాయకత్వం నుంచి పక్కకు వెళ్లాడు. బట్లర్ స్థానంలో జట్టు కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను నియమిస్తారని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం అతడు వైస్ కెప్టెన్‌గా ఉన్న విషయం తెలిసిందే.

## తల్లి కాబోతోన్న కియారా



బాలీవుడ్ క్యూట్ కపుల్స్ కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తమ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలోనే తాము తల్లిదండ్రులు అవ్వబోతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త ఫొటోను పంచుకున్నారు. 2023 ఫిబ్రవరిలో ఆమె ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాను ఘనంగా వివాహం చేసుకుంది కియారా. జైపూర్‌లోని ఓ ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగా వీళ్ల పెళ్లి జరిగింది. అయితే పెళ్లి అయిన నాలుగు నెలలకే కియారా అద్వానీ గర్భవతి అంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో ఆ వార్తలు నిజమే అనుకున్నారు కియరా అభిమానులు. అయితే ఆ వార్తలు అబద్ధమంటూ తర్వాత క్లారిటీ ఇచ్చింది ఈ భామ. ఇదిలావుంటే తాజాగా నేను తల్లి కాబోతున్నానంటూ ఒక ఫొటోను పంచుకుంది. కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తమ రెండు చేతులు ముందుకు చాచి చిన్నారి సాక్స్ ఫొటో పంచుకున్నారు. మా జీవితాల్లోకి గొప్ప బహుమతి త్వరలో వస్తుంది అంటూ ఈ ఫొటోకి క్యాప్షన్ ఇచ్చారు. ఇక ఈ విషయం తెలిసి అభిమానులు, సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# రీల్

## 'మృత్యుంజయ్' టైటిల్ టీజర్ రివీల్




టాలీవుడ్‌లో కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా తనదైన సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరో శ్రీవిష్ణు. ఆయన ఓ సినిమాలో నటిస్తున్నాడంటే ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అని ప్రేక్షకులు ఫిక్స్ అవుతారు. ఇక ఫిబ్రవరి 28న శ్రీ విష్ణు పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న నెక్ట్స్ మూవీకి సంబంధించి సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చారు. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రానికి 'మృత్యుంజయ్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ సినిమాను హుస్సేన్ షా కిరణ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ టీజర్‌ను మేకర్స్ తాజాగా రివీల్ చేశారు. పూర్తి యాక్షన్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ఈ టైటిల్ టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక 'జై' అనే పాత్రలో శ్రీవిష్ణు సరికొత్త వేరియేషన్స్‌తో నటిస్తున్నాడు.

## స్పెషల్ సాంగ్ కోసం పూజా భారీ డిమాండ్?

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కూలీ' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తుండటంతో ఈ మూవీపై భారీ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఇక ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, వీడియో గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేశాయి. కాగా, ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌లో అందాల భామ పూజా హెగ్డే స్టెప్పులు వేయనుంది. సిజ్లింగ్ సాంగ్‌గా రానున్న ఈ డ్యాన్స్ నెంబర్‌లో పూజా తన గ్లామర్‌తో ప్రేక్షకులును ఆకట్టుకోనుంది. అయితే, ఈ సాంగ్ కోసం పూజా హెగ్డే భారీ మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకున్నట్లు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క స్పెషల్ సాంగ్‌లో నటించేందుకు ఆమె ఏకంగా రూ.2 కోట్ల మేర రెమ్యునరేషన్ తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గ్లామర్ షోతో పాటు సాలిడ్ స్టెప్పులు వేయడంలో పూజా పర్ఫెక్ట్ కాబట్టి, ఆమె కోరినంత పేమెంట్ ఇవ్వడానికి నిర్మాతలు కూడా ఓకే చెప్పారట. తెలుగు, తమిళ్‌లో పెద్దగా అవకాశాలు లేని పూజా కేవలం ఓ స్పెషల్ సాంగ్ కోసం భారీగా డిమాండ్ చేయడం ప్రస్తుతం కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## 'గుడ్ బ్యాడ్ అగ్లీ' టీజర్ రిలీజ్



తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఇప్పటికే షూటింగ్ ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ చిత్రాన్ని అధిక్ రవిచంద్రన్ డైరెక్ట్ చేస్తుండగా ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇక ఈ టీజర్ కట్ ఆద్యంతం వైల్డ్ రైడ్‌గా సాగింది. అజిత్ కుమార్‌ను అభిమానులు ఎలాగైతే చూడాలని అనుకుంటారో, దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ప్రెజంట్ చేశాడు. ఇక వింటేజ్ లుక్స్‌లో అజిత్ కుమార్‌ని చూసి అభిమానులు థ్రిల్ అవుతున్నారు. ఆయన నుంచి వచ్చే డైలాగులు కూడా సాలిడ్‌గా ఉన్నాయి. వైవిధ్యమైన గెటప్స్‌లో అజిత్ చేసే యాక్షన్, ఆయన చూపెట్టిన స్వాగ్ అభిమానులకు మాస్ ట్రీట్ ఇచ్చిందని చెప్పాలి. ఈ సినిమాను ఏప్రిల్ 10న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# జనగణనతో పాటే.. కులగణన



(మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ అజీజ్‌పాషా, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి. చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ మురళిమనోహర్, ప్రొఫెసర్ ప్రభాంజన్‌యాదవ్, బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్, బత్తుల సిద్దేశ్వర్, బిసి టైమ్స్ సూర్యారావులు ప్రసంగించారు. దేశ జన గణనలో బిసి కులగణన, బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు జనభా ప్రతిపాదికన నిధులు, తదితర డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో అన్ని బిసి సంఘాలు, శక్తులు, వ్యక్తులు, ఐక్య కార్యచరణగా ఏర్పడి, ఉద్యమాలను నిర్మించేందుకు ముందుకు రావాలని రౌండ్ టేండ్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశానికి బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనంజయ నాయుడు స్వాగతం పలుకగా, ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి వందన సమర్పణ చేయగా, రాష్ట్ర కార్యవర్గం బొడ్డుపల్లి కృష, చింతకిందికుమార స్వామి, ఎల్.శ్రవణ్‌కుమార్, ఏశాలఅశోక్, కల్లెం కృష్ణ, కె.ప్రమీల, దీటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే : కూనంనేని సాంబశివరావు**

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉత్పత్తి కులాలైన బిసిల వెనకబాటు తనం అంతం కావాలంటే, వారికి సామాజిక, ఆర్థిక,రాజకీయంగా ప్రభుత్వాలు చేయూతను అందించాల్సిన అవసరముందన్నారు. జనాభా దమాషా ప్రకారం బిసిలకు చట్టసభలు,విద్య , ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వీటిని సాధించేందుకు జరిగే ప్రతి పోరాటంలో సిపిఐ పార్టీ ప్రత్యేక్షంగా, పరోక్షంగా సంపూర్ణ మద్దతు ఇస్తుందని హామీనిచ్చారు. బిసి రిజర్వేషన్, ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు సనాహ్నాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం బిసి రిజర్వేషన్ చట్టంతో సరి పెట్టకుండా ఖచ్చింతంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

**బిసి కార్పోరేషన్లు పునరుద్ధరించాలి : బొమ్మగాని ప్రభాకర్**

రాష్ట్రంలో బిసిల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన బిసి కార్పొరేషన్లు పూర్తిగా నిర్వీర్యం చేశారని బొమ్మగాని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో అన్ని కార్పోరేషన్లుకు నిధులను కేటాయించి, వాటిని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బిసి కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా సైతం కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు.

**బిజెపి అధికారంలో ఉంటే ఒక మాట లేకపోతే మరో మాట : చిరంజీవులు**

దేశంలో రిజర్వేషన్లు కేవలం 50 శాతం మాత్రమే ఉండాలని భారత రాజ్యాంగంలో ఎక్కడ పొందు పర్చలేదని, దేశ ప్రజలకు సమ న్యాయం చేయలేని సుప్రీం కోర్టు, ఈ పరిధిని విధించిందని,బిసిలంతా ఏకమైతే ఈ గీత ఇట్టే చెరిగిపోతుందని, ఇందుకు అందరూ సంసిద్ధంకావాలని చిరంజీవులు కోరారు. మొదటి నుంచి కూడా బిజెపి బిసిల పట్ల ద్వంద విధానాలను పాటిస్తు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని 2010లో పార్లమెంట్‌లో ఆందోళన చేసిన బిజెపి,కేంద్రంలో అధికారం చేపట్టిన తర్వాత 2018లో అదే పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బిసి కులగణన చేపడుతామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇదే బిజెపి ప్రభుత్వం 2021లో కులగణనకు తాము వ్యతిరేకమని సుప్రీం కోర్డుకు స్టేట్‌మెంట్ సమర్పించిందని దుయ్యబట్టారు. .

**రాహుల్ కులం ఎందుకో? : జాజుల శ్రీనివాస్**

ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కులం ఏమిటి అని పదే పదే బిజెపి నేతలు ప్రశ్నించడం పట్ల జాజుల శ్రీనివాస్ అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కులగణన చేపడితే రాహుల్ గాంధీ కులం ఏమిటో తెలుస్తుంది కదా? అని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆయన ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా దేశంలో ఉన్న 70 కోట్లమంది బిసిల కోసం ఆలోచించాలని హితువు పలికారు.

## కిషన్‌రెడ్డిదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడడం తీవ్ర అభ్యంతరకరమని సిఎం పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఒక లేఖ రాశారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండగానే చెన్నై, బెంగళూరు మెట్రో విస్తరణకు ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోపై మాత్రం పలుమార్లు విజ్ఞప్తి చేసినా పురోగతి లేదన్నారు. సబర్మతి, గంగా పునరుజ్జీవనంపై కిషన్‌రెడ్డి పలుమార్లు ప్రకటనలు చేశారని, హైదరాబాద్‌లోని మూసీపై ఎందుకు విషం చిమ్ముతున్నారని సిఎం ప్రశ్నించారు. "రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో కిషన్ రెడ్డి పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై మాట్లాడితే మమ్మల్ని అడిగి ఇచ్చారా? అంటూ విమర్శిస్తున్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో కేంద్రానికి ఒక విధానం ఉంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ అవగాహనరాహిత్యంతో మాట్లాడుతున్నారంటూ కేంద్ర మంత్రి హోదాలో ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం పూర్తి బాధ్యతారాహిత్యం. తెలంగాణలో 2023 డిసెంబరు 7న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే పూర్తి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కాంగ్రెస్ పరిపాలన కొనసాగుతోంది. భారత రాజ్యాంగంలో పేర్కొన్న సమాఖ్య విధానానికి పూర్తిగా కట్టుబడి ఉండి దానిని అనుసరిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నాం. ఈ క్రమంలోనే తెలంగాణ అభివృద్ధికి కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్11, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ నుంచి ఎపిలోని బందరు సీ పోర్ట్‌కు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల సాధనకు కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నాం. ఈ విషయం కిషన్‌రెడ్డికి స్పష్టంగా తెలుసు. వివిధ ప్రాజెక్టుల సాధనకు సంబంధించి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో పాటు విమ్ములను కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాం. తెలంగాణ ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు అనుమతులు సాధించడం, నిధులు మంజూరు చేయించడం మీ నైతిక బాధ్యత. ఇదే విషయాన్ని నేను బహిరంగంగానే పలుమార్లు ప్రకటించాను. ఇకనైనా రాష్ట్ర ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని లేఖలో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహించిన జైపాల్‌రెడ్డి, వెంకటస్వామి వంటి వారు హైదరాబాద్ మెట్రో రైలు, సింగరేణి కార్మికులకు పింఛను వంటి సౌకర్యాలను కల్పించి తమదైన ముద్రవేశారని, 2019 నుంచి తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు చేసిందేమిటో ప్రజలకు తెలియజేయాలన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా మేం ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టులకు ఏవిధంగా చేయూతనిస్తారో చెబితే రాష్ట్ర ప్రజలు సంతోషిస్తారన్నారు. అంతేగానీ కేంద్రమంత్రిగా ఉండి ఏ ఒక్కటీ సాధించలేని కిషన్‌రెడ్డి ఒత్తిడితో వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడి చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.

## సిద్ధరామయ్యపై 'శీష్ మహల్' తరహా ఆరోపణలు

**బెంగళూరు:** కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆయన అధికారిక నివాసాన్ని 'శీష్ మహల్' తరహాలో పునరుద్ధరించడానికి ప్రజాపనుల విభాగం దాదాపు రూ.2.6 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఒకవైపు ప్రభుత్వం వద్ద నిధులు లేవని పేర్కొంటూ.. మరోవైపు అధికారులు అనవసర ఖర్చులు చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ విమర్శించారు. రాష్ట్రాభివద్ధికి సంబంధించిన మిగతా పనులు పూర్తిచేసిన తర్వాత ముఖ్యమంత్రి తన సొంత పనులు చేసుకోవడంపై దష్టిసారించాలన్నారు. ప్రభుత్వ నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే... ప్రభుత్వం వాటిని ఇతర ప్రయోజనాలకు మరలిస్తుందన్నారు. ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరిస్తే రాష్ట్ర అభివద్ధి కుంటుపడుతుందని చెప్పుకొచ్చారు.
సీఎం అధికారిక భవనం పునరుద్ధరణలో భాగంగా రూ.1.7 కోట్లను హెల్పర్ రూమ్‌లు, ఇతర నిర్మాణాలకు కేటాయించగా, రూ.89 లక్షలను ఎలక్ట్రికల్ అప్‌గ్రేడ్, ఎయిర్ కండిషనింగ్ మొదలైన సదుపాయాల కోసం వినియోగించినట్లు ఆర్థికశాఖ నుంచి నివేదికలు వెలువడడంతో ప్రతిపక్ష నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు సిద్ధరామయ్య ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం విదితమే.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఉర్సులా ప్రకటించారు. ఇరు వైపుల డెడ్‌లైన్ విధించుకున్న వాణిజ్య ఒప్పందం అంతర్జాతీయంగా అతి పెద్దది. ఇందుకు 17 ఏళ్ళ క్రితం ఇరు పక్షాల మధ్య మొదటిసారి చర్చలు మొదలయ్యాయి. 2013లో లక్ష్యాల మధ్య అంతరం కారణంగా చర్చలు నిలిచిపోయి, 2022 జూన్‌లో చర్చలు పునః ప్రారంభమయ్యాయి. "2025 ఆవల విస్తరించే భారత్ – ఇయు ఒప్పందం కోసం సాహసోపేతమైన, పెద్ద ఆశలతో కూడిన రోడ్‌మ్యాప్‌ను సృష్టించాలని ఈ రోజు నిర్ణయించాం. ఇది తదుపరి భారత్ – ఇయు శిక్షరాగ్ర సదస్సు సందర్భంగా అమలులలోకి వస్తుంద'ని మోదీ వెల్లడించారు. కార్లు, వైన్, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని న్యూఢిల్లీపై ఇయు నిరంతరం కోరుతుండడంతో ఒప్పందంపై చర్చలు ముందుకు సాగలేదు. తాజాగా ఇయు కమిషన్ అధ్యక్షురాలుతో భారత్‌కు వచ్చిన బృందంలో కాలేజ్ ఆఫ్ కమిషనర్స్, ఇయు సభ్యదేశాలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు. గత జూన్ మాసంలో యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల తరువాత ఇలాంటి పర్యటన ఇదే మొదటి సారి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక సుంకాలను విధిస్తాననే బెదిరింపులతో నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య ఒప్పందంపై చర్చలు కొలిక్కి వచ్చినట్లు భావిస్తున్నారు. పెట్టుబడులకు ఊపునిచ్చేందుకు విస్తృత చర్యల్లో భాగంగా పెట్టుబడుల రక్షణ ఒప్పందంతో పాటు భౌగోళిక సంకేతాలపై చర్చలను ముందుకు తీసుకెళ్ళాలని ఇరు పక్షాలు నిశ్చయంతో ఉన్నట్లు మోదీ ఒక ప్రకటనలో తెలిపారు. "వాణిజ్యం, టెక్నాలజీ, పెట్టుబడి, ఇన్నోవేషన్, హరిత అభివృద్ధి, భద్రత, నిపుణ్యం, మొబిలిటీ వంటి రంగాలలో సహకారం కోసం బ్లూప్రింట్‌ను తయారు చేశామ"ని పేర్కొన్నారు. "ఉభయులకు ప్రయోజనం చేకూరే ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని మ బృందాలకు మార్గదర్శనం చేశామ" తెలిపారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్‌తో చర్చలు భారత్, ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్‌తో యూరోపియన్ వాణిజ్య, ఆర్థిక భద్రతా విభాగం కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్ దిల్లీలో చర్చించారు. ఈ సమావేశం వివరాలతో పీయూష్ గోయల్ 'ఎక్స్'లో ఒక ట్వీట్ చేశారు. "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఎలాంటి దాపరికం లేకుండా, విశాల దక్పథంతో చర్చలు జరిగాయి. భవిష్యత్తులోనూ ఈయూభారత్ విశ్వసనీయమైన వాణిజ్య భాగస్వాములుగా నిలుస్తాయి. పెట్టుబడుల విషయంలో కలిసికట్టుగా ముందుకు సాగుతాయి. మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహిస్తాయి" అని ఆయన వెల్లడించారు. ఈ చర్చల్లో ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా కూడా పాల్గొన్నారు.

**మార్చి 10 నుంచి 14 వరకు సమావేశాలు**

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ముడిపడిన కీలక అంశాలపై చర్చించేందుకు భారత్, ఈయూకు చెందిన సీనియర్ అధికారులు మార్చి 10 నుంచి 14 వరకు బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో భేటీ కానున్నారు. ఇరు పక్షాల అధికారులు ఈ అంశంపై సమావేశం కావడం ఇది పదోసారి.

**భారత్‌తో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం: ఉర్సులా**

భారత్‌తో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని భావిస్తున్నామని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. గతంలో తాము ఇలాంటి ఒప్పందాన్ని జపాన్, దక్షిణ కొరియాతో కుదుర్చుకున్నామని తెలిపారు. సైనిక సామర్థ్యాలను పెంచుకునే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తోందని ఈ విషయంలో భారత్‌ఈయూ పరస్పరం చేదోడును అందించుకోగలవు అని నమ్ముతున్నానన్నారు. ప్రధాని మోదీతో సమావేశానికి ముందు ఒక సదస్సులో ఉర్సులా కీలక వ్యాఖ్యలు చేశారు. "రక్షణ రంగ పారిశ్రామిక ప్రాజెక్టులలో ఈయూతో కలిసి పనిచేసేందుకు భారత్ ఆసక్తిగా ఉందని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది. సైనిక సామర్థ్యాలను పెంచుకునే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తోంది. ఈ విషయంలో భారత్‌ఈయూ పరస్పరం చేదోడును అందించుకోగలవు అని నేను నమ్ముతున్నాను. సీమాంతర ఉగ్రవాదం, సముద్ర జలాల్లో భద్రత, సైబర్ దాడులు, కీలకమైన మౌలిక సదుపాయాలపై ఉగ్రదాడులు వంటి విషయాల్లో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధం" అని ఉర్సులా ప్రకటించారు. గత 30 ఏళ్లలో భారత్ ఈయూ చాలా విషయాల్లో సంపూర్ణ విశ్వాసంతో పరస్పర సహకారాన్ని అందించుకున్నాయి. ఈ సహకారానికి పరిమితులు విధించుకునే సమయం కాదు ఇది. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా స్పందించాల్సిన సమయం ఇది. మాటలు కాదు కీలకమైన చేతల సమయం ఇదని ఆమె అన్నారు.

**ఉక్రెయిన్ ఓడిపోతే ప్రపంచానికే ముప్పు**

"ఉక్రెయిన్ విషయంలో మేం(ఈయూ) పూర్తి స్పష్టతతో ఉన్నాం. ఉక్రెయిన్ ఒకవేళ ఓడిపోతే, ప్రపంచంలో ఎక్కడైనా అదే తరహా పరిస్థితి పునరావతమయ్యే ముప్పు ఉంటుంది. అంతర్జాతీయ సరిహద్దును ఉల్లంఘించి పొరుగు దేశంపై దండయాత్ర చేయడం అస్సలు సరికాదు" అని ఉర్సులా స్పష్టం చేశారు. "భారత్ పశ్చిమాసియా ఐరోపా రోడ్ కారిడార్‌కు ఈయూ అనుకూలమే" అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com